ప్రభాతనవ

SINGIDI
తెలుగు దినపత్రిక

# సింగిడి

ప్రతి రంగూ ఓ నిజం

సోమవారం 20 జులై 2026 సంపుటి: 1 సంచిక: 33 పేజీలు 12 వెల: 6.50

Published from: Hyderabad, Karimnagar, Warangal, Khammam, Nizamabad,Mahabubnagar

క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఇళ్లకు

## నేడు శ్రీకారం

### మంత్రి పొంగులేటి



రాష్ట్రంలో పేదవాడి సొంతింటి కల నెరవేరే వరకూ ఇందిరమ్మ ఇళ్ల యజ్ఞం నిరంతరంగా కొనసాగుతుందని.. ఇది ఒకసారి చేపట్టి ముగించే కార్యక్రమం కాదని రాష్ట్ర హౌసింగ్ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఎల్ఐజీ ఇళ్ల కార్యక్రమాన్ని సోమవారం సచివాలయంలో ప్రారంభించనున్న నేపథ్యంలో ఆదివారం ఉన్నతాధికారులతో మంత్రి టెలికాన్ఫరెన్స్ నిర్వహించి ఏర్పాట్లను సమీక్షించారు.

- హైదరాబాద్, జులై 19 (సింగిడి)

2



జమ్ములో వరదల

## విధ్వంసం

17 మంది మృతి- పలువురు గల్లంతు

జమ్ముకశ్మీర్‌ను ముంచెత్తిన భారీ వర్షాలు

పూంచ్, రాజౌరిలో ఆకస్మిక వరదలు

2

# అప్పుడేంజేసింద్రు..

అవసరం ఉన్నప్పుడు ఆప్యాయత... అవసరం తీరాక మరచిపోవడం రాజకీయాల్లో కొత్త విషయం కాదు. ఎన్నికలు దగ్గరపడితే యువత గుర్తుకొస్తుంది. ఉద్యమాలు మొదలైతే నిరుద్యోగుల బాధలు వినిపిస్తాయి. సభలు పెట్టాల్సి వస్తే ఉద్యోగాల మాట మళ్లీ తెరపైకి వస్తుంది. కానీ యువత మాత్రం ఒకటే ప్రశ్నిస్తోంది... నిజంగా మా భవిష్యత్తు కోసమేనా ఈ పోరాటం? లేక రాజకీయ అజెండాకు మమ్మల్ని వేదికగా మార్చుకుంటున్నారా?

(ప్రత్యేక ప్రతినిధి - సింగిడి)



## అవసరం వస్తేనే యువత గుర్తుకొస్తుందా?

### నమ్మకం లేదు దొరా..!

### నిరుద్యోగుల ఆవేదన...

### రాజకీయాలకు ఆయుధమైందా?

### సరూర్‌నగర్ సభ...

### ఉద్యోగాల కోసమా? ఓట్ల కోసమా?

### ప్రశ్న ఒక్కటే... యువత భవిష్యత్తా?

### రాజకీయ భవిష్యత్తా?

సరూర్‌నగర్‌లో నిర్వహించిన సభను నిరుద్యోగుల ఆవేదనకు ప్రతీకగా బీఆర్ఎస్ అభివర్ణించింది. ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేరలేదని, ఉద్యోగాల భర్తీ నత్తనడకన సాగుతోందని విమర్శించింది. యువత సమస్యలపై పోరాటం కొనసాగిస్తామని ప్రకటించింది. అయితే అదే సమయంలో రాజకీయ వర్గాల్లో మరో ప్రశ్న కూడా వినిపిస్తోంది... ఈ ఆవేదన ఇప్పుడే ఎందుకు గుర్తొచ్చింది?

**గతం మరిచిపోయారా..?**

పదేళ్లు అధికారంలో ఉన్న సమయంలో ఉద్యోగాల భర్తీ, నోటిఫికేషన్లు, నిరుద్యోగ భృతి వంటి అంశాలపై తీవ్ర విమర్శలు ఎదుర్కొన్న పార్టీ... ఇప్పుడు నిరుద్యోగుల కోసం పోరాటం చేస్తున్నామని చెప్పడాన్ని నిజమైన నిఖార్సైన నిరుద్యోగులు ప్రశ్నిస్తున్నారు. ఆ సమయంలో అవకాశాలు కల్పించి ఉంటే... ఈ రోజు ఇదే యువత రోడ్డెక్కాల్సి వచ్చేదా? అనే విమర్శలు కూడా వినిపిస్తున్నాయి.

**సభలో నిరుద్యోగులేనా... లేక రాజకీయ కార్యకర్తలా..?**

సభలో మాట్లాడిన వారంతా నిజంగా ఉద్యోగాల కోసం ఎదురు చూస్తున్న యువకులేనా? లేక రాజకీయ పార్టీలకు అనుబంధంగా పనిచేస్తున్న నాయకులా? అనే సందేహాలు కూడా వ్యక్తమవుతున్నాయి. నిరుద్యోగుల వేదిక రాజకీయ ప్రసంగాలతో నిండిపోతే... అసలు సమస్యలపై చర్చ వెనుకబడిపోతుందనే అభిప్రాయం కొందరిలో వ్యక్తమవుతోంది.

**ఉద్యోగాల కోసం పోరాటమా... రాజకీయ భవిష్యత్తు కోసమా..?**

యువత సమస్యలపై ఉద్యమం చేయడం ప్రజాస్వామ్యంలో అవసరమే. కానీ ఆ ఉద్యమం ఉద్యోగాల కోసం సాగుతోందా? లేక రాజకీయంగా మళ్లీ బలం కూడగట్టుకోవడానికి ఒక అవకాశంగా మారిందా? అనే ప్రశ్న ఇప్పుడు చర్చనీయాంశమైంది. నిరుద్యోగుల బాధలను ఓట్లుగా మార్చుకునే ప్రయత్నం జరుగుతోందా? అనే అనుమానాలు కూడా వ్యక్తమవుతున్నాయి.

**యువత అడుగుతున్న ప్రశ్నలు...**

ఉద్యోగాలు ఇవ్వాల్సిన సమయంలో ఎందుకు మౌనం పాటించారు?... అధికారంలో ఉన్నప్పుడు సాధ్యం కానిది... ఇప్పుడు ఎలా సాధిస్తామని చెబుతున్నారు? మా జీవితాలు రాజకీయ ప్రసంగాలకే పరిమితమవుతాయా? ప్రతి ఎన్నికల ముందు మాత్రమే మా బాధలు గుర్తుకొస్తాయా? అనే ప్రశ్నలు నిరుద్యోగుల్లో వినిపిస్తున్నాయి.

**చివరికి తేలాల్సింది ఒక్కటే...**

*నిరుద్యోగుల పేరుతో జరిగే ప్రతి సభ.. నిజంగా ఉద్యోగాల సాధనకు దారి తీస్తుందా? లేక రాజకీయ సమీకరణాలకే పరిమితమవుతుందా? అన్నది కాలమే తేల్చాలి. కానీ ఒక విషయం మాత్రం స్పష్టం. యువతకు ప్రసంగాలు కాదు నియామకాలు కావాలి. హామీలు కాదు ఉద్యోగ నియామక పత్రాలు కావాలి. రాజకీయ నినాదాలు కాదు... భవిష్యత్తుకు భరోసా కావాలి.*



2

భవిష్యత్తులో భారత్

## వరల్డ్ కప్ ఆడుతుంది

**ఫిఫా వరల్డ్ కప్‌పై సీఎం రేవంత్ రెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు**

**ఆ జట్టులో తెలంగాణ ఆటగాళ్లు ఉంటారని జోస్యం**

గతంలో మెస్సీని హైదరాబాద్ తీసుకొచ్చిన విషయాన్ని గుర్తుచేసుకున్న వైనం తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భారత ఫుట్‌బాల్ భవిష్యత్తుపై తనకున్న దార్శనికతను పంచుకున్నారు. భవిష్యత్తులో టీమిండియా ఫిఫా వరల్డ్ కప్ ఫైనల్స్‌లో ఆడటమే కాకుండా, ఆ టోర్నీకి ఆతిథ్యం కూడా ఇస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఆదివారం అర్జెంటీనా, స్పెయిన్ మధ్య ఫిఫా వరల్డ్ కప్ ఫైనల్ జరగనున్న నేపథ్యంలో ఆయన సోషల్ మీడియా వేదికగా ఈ వ్యాఖ్యలు చేశారు.

- హైదరాబాద్, జులై 19 (సింగిడి)



2

ప్రతి జిల్లాలో ఎల్‌నినో

## కమాండ్ కంట్రోల్ రూమ్స్

### మంత్రి శ్రీధర్ బాబు

సాగునీటి విషయంలో తమకు ఎలాంటి భేషజాలు లేవని ఎన్డీఎస్ఏ చెబితే తప్పకుండా మేడిగడ్డ, కన్నెపల్లి నుంచి నీళ్లు ఎత్తిపోస్తామని మంత్రి శ్రీధర్ బాబు చెప్పారు. ప్రతి జిల్లాలో ఎన్‌నినో సంబంధిత కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేస్తామని మంత్రి శ్రీధర్ బాబు చెప్పారు. తాజా పరిస్థితుల దృష్ట్యా ప్రత్యామ్నాయ పంటలపై ప్రణాళిక అమలు చేస్తామన్నారు.

- కరీంనగర్, జులై 19 (సింగిడి)

## తక్కువ వడ్డీతో నిధుల సమీకరణ



2

**నీటిపారుదల సంస్థలకు ఆర్థిక పునర్వ్యవస్థీకరణ**

**10 రోజుల్లో కార్యాచరణ ప్రణాళిక**

**రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి**

సాగునీటి సంస్థలను ఆర్థికంగా బలోపేతం చేసి.. స్వయం సమృద్ధి దిశగా తీర్చిదిద్దేందుకు సమగ్ర కార్యాచరణ రూపొందించాలని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఆదివారం కుందన్‌బాగ్‌లోని మంత్రి క్యాంపు కార్యాలయంలో సాగునీటి సంస్థల ఆర్థిక పరిస్థితి, నిధుల సమీకరణ, రుణాల పునర్వ్యవస్థీకరణపై ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు.

- హైదరాబాద్, జులై 19 (సింగిడి)

## ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

**ప్రతి గ్రామానికి అభివృద్ధి ఫలాలు చేరవేస్తా**

**ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క**

ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో విద్యుత్, రహదారులు, తాగునీరు వంటి మౌలిక వసతులను మరింత బలోపేతం చేసి అభివృద్ధి ఫలాలను ప్రతి గ్రామానికి చేరవేస్తామని తెలిపారు. ఆదివారం కామేపల్లి మండలంలో విస్తృతంగా పర్యటించిన ఆయన సుమారు రూ.11.80 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు.

కామేపల్లి, జులై 19 (సింగిడి)



2

ఎస్ఐఆర్‌పై నిర్లక్ష్యం వహిస్తే

# కఠిన చర్యలు

## నేతలెవరూ గాంధీభవన్ రావొద్దు

**సర్‌పై కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జూమ్ సమావేశం**

**పార్టీ ముఖ్యనేతలకు పలు కీలక సూచనలు చేసిన సీఎం**

**సర్‌ను ఇన్‌ఛార్జ్ మంత్రులు పూర్తి పర్యవేక్షణ చేయాల్సిందేనన్న సీఎం**

చైర్మన్, ఇతర పదవుల కోసం గాంధీభవన్ చుట్టూ తిరిగే నాయకులకు ఇకపై అపాయింట్‌మెంట్లు ఇవ్వొద్దని, నేటి నుంచి ఆగస్టు 3తేదీ వరకు ఎవ్వరూ గాంధీభవన్‌కు రావొద్దని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఎస్ఐఆర్ అంశంపై కాంగ్రెస్ పార్టీ నాయకులతో నిర్వహించిన జూమ్ సమావేశంలో పార్టీ నాయకత్వానికి ఎస్ఐఆర్‌పై సీఎం రేవంత్ రెడ్డి స్పష్టమైన దిశానిర్దేశం చేశారు.

- హైదరాబాద్, జులై 19 (సింగిడి)





జాతీయ పోలీస్ అకాడమీలో

## లైంగిక వేధింపులు

2

**ట్రైనీ ఐపీఎస్‌పై కేసు నమోదు**

## బహదూర్‌గూడ భూముల వ్యవహారం

**పోలీసులు సహా 36 మందిపై కేసులు**

**హైదరాబాద్, జులై 19 (సింగిడి)**

శంషాబాద్ ఎయిర్‌పోర్టు సమీపంలోని బహదూర్ గూడ భూముల వ్యవహారంలో జరిగిన ఆందోళన నేపథ్యంలో పలువురిపై పోలీసులు కేసులు నమోదు చేశారు. మహిళలు, స్థానిక రైతులు, బీఆర్ఎస్, భాజపా నేతలతోపాటు 36 మందిపై కేసులు పెట్టారు. వీరిలో పటోళ్ల కార్తిక్ రెడ్డి, పంతంగి భూపాల్‌రెడ్డి, మహేందర్, కోలన్ ప్రదీప్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

2

పార్లమెంట్‌లో

## 8 బిల్లులు పెడతాం

**విస్తృత చర్చ జరగాలని ప్రభుత్వం కోరుతోంది**

**అఖిలపక్షం భేటీ.. టీఎంసీ నిరసన, విపక్షాల వాకౌట్**

**విపక్షాల వాకౌట్‌పై రిజిజు ఫైర్**

2



పార్లమెంట్ వర్షాకాల సమావేశాల ప్రారంభం కానున్న నేపథ్యంలో కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన అఖిలపక్షం భేటీ జరిగింది పార్లమెంట్ వర్షాకాల సమావేశాలకు ముందు ఆదివారం నిర్వహించిన అఖిల పక్ష సమావేశాన్ని విపక్షాలు వాకౌట్ చేయడంపై పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు తీవ్రంగా స్పందించారు. ఇది పూర్తిస్థాయి బహిష్కరణ కాదని, కేవలం సింబాలిక్ నిరసన మాత్రమేనని అన్నారు. సమావేశం ముగిసిన అనంతరం మీడియాతో మాట్లాడిన ఆయన, సమావేశం మొత్తం సానుకూల వాతావరణంలో సాగిందని తెలిపారు.

- న్యూఢిల్లీ, జులై 19 (సింగిడి)

## విశాఖలో ఘోర రోడ్డు ప్రమాదం

**లారీని ఢీకొట్టిన కారు, నలుగురి దుర్మరణం!**

**ఆనందపురం - అనకాపల్లి జాతీయ రహదారిపై ఘటన**

2



ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నం జిల్లాలో ఆదివారం తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం సంభవించింది. ఆనందపురం – అనకాపల్లి జాతీయ రహదారిపై గండిగుండం సమీపంలో జరిగిన ఈ ప్రమాదంలో నలుగురు వ్యక్తులు ఘటనా స్థలంలోనే విగతజీవులుగా మారారు.

- విశాఖపట్నం, జులై 19 (సింగిడి)

కళ, సంస్కృతి, సినిమా మన అస్తిత్వానికి

## మూలస్తంభాలు



**తెలుగు సినిమా మరిన్ని ఉన్నత శిఖరాలను అందుకోవాలని ఆకాంక్ష**

**72వ జాతీయ చలనచిత్ర పురస్కారాల విజేతలకు సీఎం చంద్రబాబు అభినందనలు**

2

తిరుమలలో గదుల కేటాయింపులో

## కొత్త విధానం

**సీఆర్వోలో రిజిస్ట్రేషన్, ఉప విచారణ కార్యాలయాల్లో కేటాయింపు**

**డిస్ప్లే బోర్డులు, ఎస్ఎంఎస్ ద్వారా భక్తులకు సమాచారం**

**గదుల కేటాయింపు, ఖాళీ చేయడంపై కఠిన నిబంధనలు**

**ఆన్‌లైన్‌లోనే రుసుము చెల్లింపు తప్పనిసరి**

2

ప్రభాతనవ
సింగిడి
ప్రతి రంగూ ఓ నిజం
Singidi
సోమవారం
20 జులై 2026

## క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఇళ్లకు
# నేడు శ్రీకారం

ఈ సందర్భంగా మాట్లాడుతూ.. చివరి లబ్ధిదారుని వరకు గౌరవప్రదమైన సొంతింటిని నిర్మించి అందిస్తామని చెప్పారు. పేదల సొంతింటి కలలను సాకారం చేయడమే ప్రజాప్రభుత్వ సంకల్పమని తెలిపారు. సొంత నివాసం కల్పించాలనే సంకల్పంతో ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల కార్యక్రమాన్ని ప్రారంభించిందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో 100 శాతం సబ్సిడీతో రూ.5 లక్షల ఆర్థిక సహాయాన్ని అందిస్తూ పేదల ఇండ్ల నిర్మాణాన్ని చేపట్టినట్లు తెలిపారు. గత నెల ఆసిఫాబాద్ జిల్లాలో సీఎం రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల కార్యక్రమాన్ని ప్రారంభించారని గుర్తు చేశారు. ఈ విడతలో హైదరాబాద్ మినహా రాష్ట్రవ్యాప్తంగా 2.50 లక్షల ఇండ్ల మంజూరు ప్రక్రియ ప్రారంభించామని తెలిపారు. ఇప్పటివరకు గ్రామీణ ప్రాంతాలపై దృష్టి సారించిన ప్రభుత్వం ఇప్పుడు హైదరాబాద్ నగరంతోపాటు పట్టణ ప్రాంతాల్లో నివసిస్తున్న పేదల సొంతింటి కలను కూడా నిజం చేయబోతున్నదని మంత్రి చెప్పారు. క్యూర్ పరిధిలో లక్ష ఎల్ఐజీ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణమే లక్ష్యంగా ప్రభుత్వం కార్యాచరణ రూపొందించిందన్నారు. తొలి విడతలో ప్రతి నియోజకవర్గానికి 500 ఇళ్ల చొప్పున నిర్మాణాన్ని ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. సోమవారం ఉదయం 11.30 గంటలకు సెక్రెటేరియట్‌లో హైదరాబాద్, రంగారెడ్డి ఇన్‌చార్జి మంత్రులు పొన్నం ప్రభాకర్, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, హైదరాబాద్ జిల్లా మంత్రి మహ్మద్‌తో కలిసి దరఖాస్తు విధానం, అర్హతలు, బ్రోచర్‌ను విడుదల చేయనున్నట్లు తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరంలో గ్రామీణ ప్రాంతాల్లో 2.50 లక్షల ఇళ్లు, పట్టణ ప్రాంతాల్లో లక్ష ఇళ్లు కలిపి మొత్తం 3.50 లక్షల కొత్త ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం చుడుతున్నామని తెలిపారు. గతేడాది మంజూరు చేసిన 4.50 లక్షల ఇళ్లతో కలిపి మొత్తం 8 లక్షలకు పైగా పేద కుటుంబాల జీవితాల్లో సొంతింటి వెలుగులు నింపుతున్న ప్రజా ప్రభుత్వం చరిత్ర సృష్టిస్తోందని మంత్రి పేర్కొన్నారు.

## తిరుమలలో గదుల కేటాయింపులో
# కొత్త విధానం

**తిరుమల, జులై 19 (సింగిడి)**

శ్రీవారి దర్శనార్థం తిరుమలకు విచ్చేసే సామాన్య భక్తులు వసతి గదుల కోసం ఎదుర్కొంటున్న ఇబ్బందులకు టీటీడీ (తిరుమల తిరుపతి దేవస్థానమ్స్) స్వస్తి పలికింది. గదుల కోసం కేంద్రీయ విచారణ కార్యాలయం (సీఆర్వో) వద్ద గంటల తరబడి నిరీక్షించాల్సిన అవసరం లేకుండా, సులభతరమైన, ఆధునిక సాంకేతికతతో కూడిన నూతన విధానాన్ని అమలులోకి తెచ్చింది. ఈ విధానం ద్వారా ఉప విచారణ కార్యాలయాల ద్వారా భక్తులకు వేగంగా గదులను కేటాయిస్తూ వారి సమయాన్ని, శ్రమను ఆదా చేస్తోంది.

**రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఇలా..**

వసతి గది కావాలనుకునే భక్తులు ముందుగా తిరుమలలోని సీఆర్వో కార్యాలయం వద్ద రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. ప్రతిరోజూ ఉదయం 5 గంటల నుంచి గదులు అందుబాటులో ఉన్నంత వరకు ఈ రిజిస్ట్రేషన్ ప్రక్రియ కొనసాగుతుంది. క్యూలైన్‌లో తమ వంతు వచ్చిన తర్వాత, భక్తులు తమ ఒరిజినల్ ఆధార్ కార్డు లేదా దాని జిరాక్స్ కాపీతో పాటు, ఫోన్ నంబర్‌ను అక్కడి కౌంటర్‌లో అందించాలి. అనంతరం ఫేస్ రికగ్నిషన్ సిస్టమ్ ద్వారా వారి వివరాలను నమోదు చేసుకుంటారు. ఈ సమయంలో భక్తులు తమకు కావాల్సిన గది కేటగిరీని ఎంచుకోవచ్చు.

A కేటగిరీ: రూ.50, రూ.100 అద్దె గల గదులు ఉంటాయి. B కేటగిరీ: రూ.1000 అద్దె గల గదులు అందుబాటులో ఉంటాయి.

ఈ ప్రక్రియ పూర్తి కాగానే, రిజిస్ట్రేషన్ విజయవంతమైనట్లు నిర్ధారిస్తూ భక్తులకు ఒక అక్నాలెడ్జ్‌మెంట్ స్లిప్ ఇస్తారు. క్యూలైన్లలో వేచి ఉండే భక్తుల సౌకర్యార్థం టీటీడీ తాగునీరు, అల్పాహారం, మరుగుదొడ్ల వంటి సదుపాయాలను కూడా ఏర్పాటు చేసింది.

A కేటగిరీ: రూ.50, రూ.100 అద్దె గల గదులు ఉంటాయి. B కేటగిరీ: రూ.1000 అద్దె గల గదులు అందుబాటులో ఉంటాయి.

ఈ ప్రక్రియ పూర్తి కాగానే, రిజిస్ట్రేషన్ విజయవంతమైనట్లు నిర్ధారిస్తూ భక్తులకు ఒక అక్నాలెడ్జ్‌మెంట్ స్లిప్ ఇస్తారు. క్యూలైన్లలో వేచి ఉండే భక్తుల సౌకర్యార్థం టీటీడీ తాగునీరు, అల్పాహారం, మరుగుదొడ్ల వంటి సదుపాయాలను కూడా ఏర్పాటు చేసింది.

**గది కేటాయింపు సమాచారం**

రిజిస్ట్రేషన్ పూర్తయ్యాక, భక్తులు సీఆర్వో కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన డిజిటల్ డిస్ ప్లే బోర్డులను గమనిస్తూ ఉండాలి. రిజిస్ట్రేషన్ క్రమ సంఖ్యల వారీగా గదులు కేటాయించబడుతున్న సమాచారం ఈ బోర్డులపై కనిపిస్తుంది. తమ రిజిస్ట్రేషన్ నంబర్ డిస్ ప్లే అయిన 15 నిమిషాల్లోపే, వారు నమోదు చేసిన ఫోన్ నంబర్‌కు గది కేటాయింపునకు సంబంధించిన పూర్తి వివరాలతో ఒక ఎస్ఎంఎస్ వస్తుంది. ఒకవేళ ఎస్ఎంఎస్ రాకపోయినా, భక్తులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. సీఆర్వో వద్ద ఉన్న కియోస్క్ మెషీన్లలో తమ అక్నాలెడ్జ్‌మెంట్ స్లిప్‌ను స్కాన్ చేయడం ద్వారా గది కేటాయించిన ఉప విచారణ కార్యాలయం వివరాలు తెలుసుకోవచ్చు.

**ఉప విచారణ కార్యాలయంలో చెల్లింపు**

ఎస్ఎంఎస్ లేదా కియోస్క్ ద్వారా సమాచారం అందిన తర్వాత, భక్తులు నేరుగా తమకు గది కేటాయించిన ఉప విచారణ కార్యాలయానికి వెళ్లాలి. అక్కడ గది అద్దె రుసుమును తప్పనిసరిగా ఆన్‌లైన్ పద్ధతిలో (ఫోన్ పే, గూగుల్ పే, యూపీఐ, క్రెడిట్ /డెబిట్ కార్డు) మాత్రమే చెల్లించాలి. నగదు చెల్లింపులకు అవకాశం లేదు. రుసుము చెల్లించిన వెంటనే వారికి గది తాళాలు అందజేస్తారు.

**తిరుమలలోని ప్రధాన ఉప విచారణ కార్యాలయాలు**

అంజనాద్రి నగర్ కాటేజస్ (ANC) శేషాద్రి నగర్ కాటేజస్ (SNC) శంఖుమిట్ట కాటేజస్ (SMC) గరుడాద్రి నగర్ కాటేజస్ (GNC) సుదర్శన, గోవర్ధన్, కల్యాణీ సత్రాలు సప్తగిరి, రామ్ భగీచా, వరాహ స్వామి విశ్రాంతి గృహాలు కౌస్తుభం, పాంచజన్యం, నందకం విశ్రాంతి గృహాలు

**భక్తులు పాటించాల్సిన ముఖ్య నిబంధనలు**

గది పొందడానికి భక్తుడికి 21 సంవత్సరాలు నిండి ఉండాలి. ఒంటరి వ్యక్తులకు, అవివాహితులకు గదులు కేటాయించరు. ఒకసారి గది పొందిన వ్యక్తి, తిరిగి 30 రోజుల వరకు మరో గదిని పొందలేరు. కుటుంబం నుంచి ఒక వ్యక్తి మాత్రమే రిజిస్ట్రేషన్ క్యూలో నిలబడాలి.

గదులు 24 గంటల కాలానికి మాత్రమే కేటాయిస్తారు. గడువు దాటితే 200 శాతం, 48 గంటలు దాటితే 400 శాతం అదనపు రుసుము వసూలు చేస్తారు. గదిని పొందిన భక్తుడే స్వయంగా ఖాళీ చేయాలి, లేదంటే కాషన్ డిపాజిట్ తిరిగి ఇవ్వబడదు. తమకు కేటాయించిన గదిని ఇతరులకు ఇవ్వడం నిషిద్ధం. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటారు.

# పార్లమెంట్‌లో 8 బిల్లులు పెడతాం

అలాగే వర్షాకాల సమావేశాల్లో ప్రవేశపెట్టేందుకు మొత్తం ఎనిమిది బిల్లులను జాబితా చేసినట్లు పేర్కొన్నారు. దేశ ప్రజలు పార్లమెంట్ సమర్థంగా పనిచేయాలని కోరుకుంటున్నారని, సభ తరచూ అంతరాయం కలగడం ప్రజాస్వామ్యానికి మంచిది కాదని రిజిజు అన్నారు. ప్రతిపక్షాలు తమ అభిప్రాయాలను బలంగా వినిపించవచ్చని, అయితే సభ కార్యకలాపాలు నిలిచిపోయేలా వ్యవహరించవద్దని కోరారు. సభ గౌరవాన్ని కాపాడేలా అన్ని పార్టీలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం తీసుకొచ్చే బిల్లులపై విస్తృతంగా చర్చ జరగాలని తాము కోరుకుంటున్నామని రిజిజు పేర్కొన్నారు. సభలో అంతరాయాలు ఏర్పడితే చిన్న పార్టీలకు మాట్లాడే అవకాశం కోల్పోతారని చెప్పారు. అనంతరం బిల్లులను చర్చ లేకుండానే ఆమోదించారని ప్రభుత్వంపై ఆరోపణలు చేయడం సరికాదని వ్యాఖ్యానించారు. ప్రతి బిల్లును సభ్యులు పూర్తిగా పరిశీలించి అభిప్రాయాలు చెప్పిన తర్వాతే ఆమోదం పొందాలని ప్రభుత్వం కోరుకుంటోందని వివరించారు. ఎన్సీపీఐకి చెందిన 20 మంది లోక్‌సభ సభ్యులు కొత్త పార్టీతో అనుబంధం కోరుతూ స్పీకర్‌కు లేఖ ఇచ్చారని, వారికి ప్రత్యేక సీటింగ్ ఏర్పాటు చేయాలని కూడా విజ్ఞప్తి చేసినట్లు రిజిజు తెలిపారు. ఈ అంశం ప్రస్తుతం స్పీకర్ పరిశీలనలో ఉందని చెప్పారు. అలాంటి పరిస్థితిలో ఆ ఎంపీలను అఖిలపక్ష సమావేశానికి ఆహ్వానించకుండా ఎలా ఉండగలమని ప్రశ్నించారు. లోక్‌సభ అందరిదని, ప్రతి సభ్యుడికి హక్కులు ఉంటాయని స్పష్టం చేశారు. ఎంపీల గుర్తింపు, పార్టీ విలీనం వంటి అంశాలు పూర్తిగా లోక్‌సభ స్పీకర్ పరిధిలోకి వస్తాయని, ఆ అంశంపై ఎలాంటి వ్యాఖ్యలు చేయబోనని రిజిజు పేర్కొన్నారు. అన్ని రాజకీయ పార్టీలతో సంప్రదింపులు జరపడం ప్రభుత్వ బాధ్యత అని, ఏకాభిప్రాయం కోసం అందరినీ సమావేశాలకు ఆహ్వానించడం సహజ ప్రక్రియ అని చెప్పారు. ప్రస్తుతం లోక్‌సభ, రాజ్యసభ సచివాలయాలు విడుదల చేసిన బులెటిన్‌లో ఎనిమిది బిల్లుల జాబితా మాత్రమే ఉందని రిజిజు తెలిపారు. అదనంగా మరే బిల్లును ప్రవేశపెట్టాల్సి వచ్చినా ముందుగా బిజినెస్ అడ్వైజరీ కమిటీ (బీఏసీ)లో చర్చించి, ప్రతిపక్షాలకు సమాచారం ఇచ్చిన తర్వాతే ముందుకు వెళ్తామని స్పష్టం చేశారు.

# జమ్ములో వరదల విధ్వంసం

**జమ్ము, జులై 19 (సింగిడి)**

జమ్ముకశ్మీర్‌లోని సరిహద్దు జిల్లాలైన పూంచ్, రాజౌరిలో ఆదివారం కురిసిన భారీ వర్షాలు తీవ్ర విషాదాన్ని మిగిల్చాయి. ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు ఆకస్మిక వరదలు, కొండచరియలు విరిగిపడటంతో కనీసం 17 మంది ప్రాణాలు కోల్పోగా, మరికొందరు గల్లంతైనట్లు అధికారులు వెల్లడించారు. రహదారులు దెబ్బతినడం, వాగులు ఉప్పొంగడంతో సహాయక చర్యలకు ఆటంకాలు ఎదురవుతున్నప్పటికీ, పలు ప్రభుత్వ శాఖలు సంయుక్తంగా సహాయక చర్యలను కొనసాగిస్తున్నాయి. మరోవైపు ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా తన ఢిల్లీ పర్యటనను మధ్యలోనే ముగించుకుని జమ్ముకు తిరిగి వెళ్లాలని నిర్ణయించుకున్నారు. పరిస్థితిని సమీక్షిస్తున్నట్లు తెలిపారు. పూంచ్ జిల్లాలోని సురన్‌కోట్ తహసీల్ అత్యంత తీవ్రంగా ప్రభావితమైంది. లోయర్ ముర్రా గ్రామంలో భారీ వర్షాల కారణంగా కొండచరియలు విరిగిపడి ఓ ఇంటిపై పడింది. ఆ సమయంలో ఇంట్లో ఉన్న ఎనిమిది మంది శిథిలాల కింద చిక్కుకున్నారు. రెస్క్యూ సిబ్బంది ఐదుగురి మృతదేహాలను వెలికితీశాయి. వీరిలో రెండేళ్ల చిన్నారి కూడా ఉంది. అదే తహసీల్‌లోని సంగ్లా గ్రామంలో ఆకస్మిక వరదల ధాటికి మరో ఇల్లు పూర్తిగా కొట్టుకుపోయింది. ఈ ఘటనలో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు గల్లంతయ్యారు. సంగ్లా గ్రామంలో ఆకస్మిక వరదల ధాటికి మరో ఇల్లు పూర్తిగా కొట్టుకుపోయింది. ఈ ఘటనలో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు గల్లంతయ్యారు. వర్షాలు పడుతున్నప్పటికీ స్థానిక పరిపాలన, పోలీసులు, విపత్తు నిర్వహణ బృందాలు, ఇతర ప్రభుత్వ శాఖలు కలిసి సహాయక చర్యలను ముమ్మరం చేశాయి. గల్లంతైన వారి కోసం గాలింపు కొనసాగుతుండగా, ప్రమాదకర ప్రాంతాల నుంచి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. గాయపడిన వారికి వైద్యసేవలు అందిస్తున్నారు.



**రాజౌరిలోనూ వరదల ప్రభావం**

రాజౌరి జిల్లాలోనూ రాత్రంతా కురిసిన వర్షాలకు నదులు, వాగులు ప్రమాదకర స్థాయిలో ప్రవహించాయి. లోతట్టు ప్రాంతాల్లోకి వరదనీరు చేరడంతో వందలాది కుటుంబాలు సురక్షిత ప్రాంతాలకు తరలాల్సి వచ్చింది. రాజౌరి పట్టణంలో నది ప్రవాహంలో ఓ మహిళ మృతదేహం లభించింది. వాహనాలు వరద ప్రవాహంలో కొట్టుకుపోవడం, మరికొన్ని నీటిలో మునిగిపోవడంతో రవాణా వ్యవస్థ తీవ్రంగా దెబ్బతింది. అనేక గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. పలు ప్రాంతాల్లో ఇళ్లు, దుకాణాలు, వ్యవసాయ భూములు, రహదారులు తీవ్రంగా దెబ్బతిన్నాయి. విద్యుత్, తాగునీటి సరఫరాపైనా ప్రభావం పడింది. స్థానిక ప్రజాప్రతినిధులు ప్రజా, ప్రైవేటు ఆస్తులకు భారీ నష్టం వాటిల్లినట్లు తెలిపారు. పూర్తి స్థాయి నష్టాన్ని అధికారులు అంచనా వేస్తున్నారు.

**పరిస్థితిని సమీక్షించిన సీఎం, ఎల్‌జీ**

మరోవైపు లెఫ్టినెంట్ గవర్నర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా కూడా సంబంధిత అధికారులతో పరిస్థితిని సమీక్షించి, బాధిత కుటుంబాలకు తక్షణ సహాయం అందించాలని ఆదేశించారు. సహాయక చర్యల్లో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని స్పష్టం చేశారు. జమ్ముకశ్మీర్ సీఎం ఒమర్ అబ్దుల్లా ఢిల్లీలో ఉన్న పర్యటనను మధ్యలోనే ముగించుకుని జమ్ముకు తిరిగి వెళ్లాలని నిర్ణయించారు. వాతావరణ పరిస్థితులు ఆందోళనకరంగా ఉన్నందున క్షేత్ర స్థాయిలో పరిస్థితిని స్వయంగా పరిశీలిస్తున్నట్లు తెలిపారు. ప్రజల ప్రాణాల రక్షణ ప్రభుత్వ తొలి ప్రాధాన్యమని, నష్టపోయిన కుటుంబాలకు అవసరమైన అన్ని విధాలా సహాయం అందిస్తామని పేర్కొన్నారు. ప్రస్తుత పరిస్థితిపై కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ఆదివారం ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ప్రస్తుతం బంగాల్ పర్యటనలో ఉన్న ఆయన జమ్ముకశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్, సీఎంతో ఫోన్‌లో మాట్లాడారు. బాధిత ప్రజల ప్రాణ, ఆస్తుల రక్షణకు కేంద్ర ప్రభుత్వం నుంచి అవసరమైన అన్ని విధాలా సహాయం అందిస్తామని హామీ ఇచ్చినట్లు అధికార వర్గాలు తెలిపాయి.


**వైష్ణోదేవి, శివ్‌ఖోరీ యాత్రలకూ తాత్కాలిక బ్రేక్**

ఐఎండీ హెచ్చరికతో అమర్‌నాథ్ యాత్రను తాత్కాలికంగా నిలిపివేశారు. యాత్రికుల భద్రత దృష్ట్యా పహల్గాం, బాల్తాల్ మార్గాలతో పాటు జమ్ములోని భగవతి నగర్ యాత్రి నివాస్ నుంచి కూడా యాత్రికుల ముందుకు వెళ్లేందుకు అనుమతి నిలిపివేసినట్లు అధికారులు వెల్లడించారు. రియాసి జిల్లాలోని ప్రసిద్ధ మాతా వైష్ణోదేవి ఆలయానికి జరిగే యాత్రను కూడా తాత్కాలికంగా నిలిపివేశారు. భక్తులు అధికారిక ప్రకటనలను మాత్రమే విశ్వసించాలని, పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తున్నామని అధికారులు తెలిపారు. అదే జిల్లాలోని ప్రముఖ శివ్‌ఖోరీ ఆలయ యాత్రను కూడా తాత్కాలికంగా రద్దు చేశారు.

# ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

ముందుగా అడవి మద్దులపల్లి గ్రామంలో రూ.2.85 కోట్ల వ్యయంతో నిర్మించనున్న 33/11 కేవీ విద్యుత్ ఉపకేంద్రం నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ ఉపకేంద్రం అందుబాటులోకి వస్తే పరిసర గ్రామాలకు నాణ్యమైన, నిరంతర విద్యుత్ సరఫరా మరింత మెరుగుపడుతుందని తెలిపారు. అనంతరం రూ.3.95 కోట్ల వ్యయంతో తాళ్లగూడెం నుంచి నర్సయ్యకుంట వరకు (ఎంపీపీఎస్ పాఠశాల మీదుగా) నిర్మించనున్న బీటీ రహదారి పనులకు శంకుస్థాపన చేశారు. అలాగే రూ.5 కోట్ల వ్యయంతో ఇల్లందు ఆర్అండ్‌బీ రహదారి నుంచి కామేపల్లి స్మశానవాటిక వరకు పెద్ద చెరువు మీదుగా నిర్మించనున్న బీటీ రహదారి పనులను ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. ఈ పనులు పూర్తయితే రవాణా సౌకర్యాలు మెరుగుపడటంతో పాటు గ్రామీణాభివృద్ధికి మరింత వేగం చేకూరుతుందని అన్నారు. సంక్షేమంతో పాటు అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం సమాన ప్రాధాన్యం ఇస్తోందని, ప్రజల అవసరాలకు అనుగుణంగా ప్రతి నియోజకవర్గంలో మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్, టీజీఎన్‌పీడీసీఎల్ ఎండీ వరుణ్ రెడ్డి, ఎమ్మెల్యేలు కోరం కనకయ్య, రాందాస్ నాయక్, సుడా చైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్, టీజీఎన్‌పీడీసీఎల్ డైరెక్టర్ వి. మోహన్ రావు, సీఈ రాజు చౌహాన్, ఎస్ఈ ఇనుగుర్తి శ్రీనివాసాచారి, పీఆర్ ఎస్ఈ జి. వెంకట్ రెడ్డి, ఈఈ మహేష్ బాబు, కామేపల్లి తహసీల్దార్ శ్రీనివాసరావు, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



## కళ, సంస్కృతి, సినిమా మన అస్తిత్వానికి
# మూలస్తంభాలు

**అమరావతి, జులై 19 (సింగిడి)**

72వ జాతీయ చలనచిత్ర పురస్కారాల విజేతలకు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ఈ మేరకు ఆయన ఆదివారం సోషల్ మీడియా వేదికగా ఒక ప్రకటన విడుదల చేశారు. విజేతలందరికీ శుభాకాంక్షలు తెలుపుతూ, తెలుగు చిత్ర పరిశ్రమ సాధించిన విజయాలపై ప్రత్యేకంగా ప్రశంసలు కురిపించారు. తెలుగు సినీ పరిశ్రమకు చెందిన నటీనటులు, దర్శకులు, నిర్మాతలు, సాంకేతిక నిపుణుల అసాధారణ ప్రతిభ మన సినిమాకు గొప్ప గర్వకారణంగా నిలిచిందని చంద్రబాబు కొనియాడారు. "కళ, సంస్కృతి, సినిమా మన అస్తిత్వానికి, వారసత్వానికి బలమైన మూలస్తంభాలు. తెలుగు సినిమా భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించి, తరతరాలకు స్ఫూర్తినివ్వాలి" అని ఆయన తన పోస్టులో ఆకాంక్షించారు. ఈ సందర్భంగా అవార్డులు గెలుచుకున్న వారందరూ భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు తెలిపారు. తన పోస్ట్‌లో ప్రముఖ నటులు మమ్ముట్టి, యామీ గౌతమ్, కార్తీక్ ఆర్యన్, నిహారిక కొణిదెల, దర్శకుడు సుకుమార్‌లను ట్యాగ్ చేయడం విశేషం. దీంతో పాటు 'పుష్ప 2', 'కల్కి 2898 ఏడీ', 'లక్కీ భాస్కర్' వంటి ప్రతిష్ఠాత్మక చిత్రాల హ్యాష్‌ట్యాగ్‌లను కూడా జతచేశారు.

## తక్కువ వడ్డీతో
# నిధుల సమీకరణ

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రుణభారం తగ్గించి, తక్కువ వడ్డీతో దీర్ఘకాలిక రుణాలు సమీకరించేలా 10 రోజుల్లో సమగ్ర ఆర్థిక ప్రణాళిక సిద్ధం చేయాలని సూచించారు. బడ్జెట్‌పై ఆధారపడకుండా సాగునీటి సంస్థలకు స్థిరమైన ఆదాయ వనరులు కల్పించేందుకు కొత్త ఆర్థిక నమూనాలను రూపొందించాలని స్పష్టం చేశారు. ఇందులో భాగంగా సాగునీటి సంస్థల ఖాళీ భూముల్లో సౌర విద్యుత్ ప్రాజెక్టులు ఏర్పాటు చేయడం లేదా లీజుకు ఇచ్చి ఆదాయం పొందే అవకాశాలను పరిశీలించాలని ఆదేశించారు. నిజాంసాగర్‌తోపాటు ఇతర జలాశయాల పరిసరాల్లో పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టుల సాధ్యతను అధ్యయనం చేయాలని సూచించారు. కొత్త ఆదాయ మార్గాల వల్ల రైతులపై ఎలాంటి అదనపు భారం పడకూడదని స్పష్టం చేశారు. 2022–23తోపాటు పెండింగ్‌లో ఉన్న అన్ని ఆర్థిక సంవత్సరాల చట్టబద్ధ ఆడిట్లను వెంటనే పూర్తి చేయాలని.. ఆడిటర్ల నియామక ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. ప్రస్తుతం సుమారు 11 శాతం వడ్డీతో ఉన్న రుణాలను తక్కువ వడ్డీకి మార్చితే ఏటా సుమారు రూ.250 కోట్ల వరకు ఆదా అయ్యే అవకాశం ఉన్నదని అధికారులు వివరించారు. ప్రతి సాగునీటి ప్రాజెక్టుకు సంబంధించిన రుణ వివరాలు, వడ్డీ, చెల్లింపులు, పనుల పురోగతి, పూర్తి చేయడానికి అవసరమైన నిధులు తదితర అంశాలతో సమగ్ర నివేదిక సిద్ధం చేయాలని మంత్రి ఆదేశించారు. తక్కువ పెట్టుబడితో త్వరగా పూర్తయ్యే ప్రాజెక్టులకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. అలాగే.. శాఖకు చెందిన భూములు, ఇతర ఆస్తుల పూర్తి వివరాలను 15 రోజుల్లో సిద్ధం చేసి వనరుల సమీకరణకు ఉపయోగించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. భూసేకరణ పరిహారానికి ఇప్పటికే విడుదల చేసిన నిధులు ఆలస్యం లేకుండా రైతులకు చేరేలా చూడాలని కూడా ఆదేశించారు. ఈ సమావేశంలో నీటిపారుదల శాఖ కార్యదర్శి ఈ.శ్రీధర్, ఈఎన్సీ (జనరల్) రమేశ్‌బాబు, జాయింట్ సెక్రటరీ శ్రీనివాస్ తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## జాతీయ పోలీస్ అకాడమీలో
# లైంగిక వేధింపులు

బాధితురాలు అందించిన ఫిర్యాదు ప్రకారం.. నిందితుడు ఉదయ్ కృష్ణారెడ్డి ఆమెను జూలై 9వ తేదీన జుట్టుపట్టుకుని బలవంతంగా గదిలోకి లాక్కెళ్లి, మెడపై కత్తి పెట్టి బెదిరించాడు. అంతటితో ఆగకుండా, ఆమెకు సంబంధించిన కొన్ని ప్రైవేట్ వీడియోలను రికార్డ్ చేశాడు. అనంతరం ఆమె మొబైల్ ఫోన్‌ను బలవంతంగా లాక్కొని, ఆ ప్రైవేట్ వీడియోలను ఆమె భర్తకు వాట్సాప్ ద్వారా పంపాడని బాధితురాలు ఆరోపించింది. బాధితురాలి ఫిర్యాదు ఆధారంగా ట్రైనీ ఐపీఎస్ ఉదయ్ కృష్ణారెడ్డిపై అత్తాపూర్ పోలీసులు ఆరు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. బీఎన్ఎస్ 74,75,77, 315(2), ఐటీ యాక్ట్ 66 (సి) కింద కేసు నమోదు చేసిన పోలీసులు.. దీనిపై త్వరలోనే ఉదయ్ కృష్ణారెడ్డి స్టేట్మెంట్ ను నమోదు చేసేందుకు సిద్ధమవుతున్నారు. దేశంలోనే అత్యున్నత పోలీస్ శిక్షణా కేంద్రంలో.. కాబోయే ఐపీఎస్ అధికారుల మధ్య ఇలాంటి ఘటన చోటుచేసుకోవడం పోలీస్ వర్గాల్లో తీవ్ర సంచలనంగా మారింది. పోలీసులు ఈ ఘటనపై దర్యాప్తును వేగవంతం చేశారు

## బహదూర్‌గూడ
# భూముల వ్యవహారం




ప్రభుత్వ విధులకు ఆటంకం కలిగించినందుకు కేసులు నమోదు చేశారు. విమానాశ్రయానికి, ఓఆర్ఆర్‌కు మధ్య బహదూర్‌గూడలో సర్వే నం.62లో 500 ఎకరాలు, సర్వే నం.28లో 150 ఎకరాల ప్రభుత్వ భూములున్నాయి. ఏళ్లుగా స్థానికులు వాటిని సాగు చేసుకుంటున్నారు. బుల్లెట్ రైలు, ఆర్టీసీ బస్సు ప్రాజెక్టుల కోసం రాష్ట్ర ప్రభుత్వం ఈ భూములను స్వాధీనం చేసుకునేందుకు సిద్ధమైందనే సమాచారంతో కొన్నిరోజులుగా రైతులు గ్రామం వద్ద దీక్ష చేపట్టారు. కంచె నిర్మాణాన్ని వారు అడ్డుకుంటారనే ఉద్దేశంతో హైడ్రా.. పోలీసు బందోబస్తుతో శనివారం వేకువజామున రంగప్రవేశం చేసింది. దీక్షా శిబిరాన్ని తొలగించి ఆ ప్రాంతంలో ఫెన్సింగ్ వేసింది. తమకు న్యాయం చేయాలని 8 రోజులుగా భూముల వద్ద దీక్ష చేస్తున్న రైతులు.. అక్కడికి వచ్చి హైడ్రాను అడ్డుకునేందుకు ప్రయత్నించారు. ఈ క్రమంలో కొందరు ఆందోళనకారులు పోలీసులపై కారం చల్లి, కుర్చీలు విసిరారు. దీంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. ఈ పరిణామాల నేపథ్యంలో పలువురిపై పోలీసులు కేసులు నమోదుచేశారు. మరోవైపు 650 ఎకరాల ప్రభుత్వ భూముల స్వాధీన ప్రక్రియ కొనసాగుతోంది.

## ఎస్ఐఆర్‌పై నిర్లక్ష్యం వహిస్తే
# కఠిన చర్యలు

నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవు : సోమవారం నుంచి పది మంది ఇన్‌ఛార్జి మంత్రులు అన్ని జిల్లాల్లో ఎస్ఐఆర్‌పై సమీక్షా సమావేశాలు నిర్వహిస్తారని, పార్లమెంట్ సమావేశాల్లో ఉన్న ఎంపీలు కూడా ఎప్పటికప్పుడు సమీక్షలు కొనసాగించాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. ఇన్‌ఛార్జిలుగా ఉన్న చోట ఎంపీలు నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎస్ఐఆర్ గడువును ఆగస్టు 3వ తేదీ వరకు పొడిగించడం కాంగ్రెస్ పార్టీకి వచ్చిన కీలక అవకాశమని, ప్రతి నాయకుడు దీన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. రాష్ట్రంలోని 119 అసెంబ్లీ నియోజకవర్గాల్లో కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఇప్పటికే 489 సమావేశాలు నిర్వహించినప్పటికీ, వెనుకబడిన నియోజకవర్గాల్లో ఇప్పటికైనా చురుకుదనం చూపించాలని రేవంత్ రెడ్డి ఆదేశించారు.



పరస్పర సమన్వయంతో ముందుకెళ్లాలి : పార్టీ పరంగా ఎస్ఐఆర్ ఇన్‌ఛార్జీలుగా పనిచేస్తున్న నాయకులు పరస్పర సమన్వయంతో ముందుకెళ్లాలని, ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌ఛార్జీలు, ఛైర్మన్లు బీఎల్ఓల నివేదికల కంటే బీఎల్ఏల నివేదికలకు ప్రాధాన్యం ఇవ్వాలని సీఎం ఆదేశించారు. కేవలం బీఎల్ఓల నివేదికలపైనే ఆధారపడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పార్టీ తరపున పనిచేస్తున్న బీఎల్ఏలను సమర్థవంతంగా వినియోగించుకోవాలని, నాయకులంతా పూర్తిగా క్షేత్రస్థాయిలో ఉండాలని, హైదరాబాద్‌లోనే ఉంటే పనులు సాగవని స్పష్టం చేశారు. వచ్చే పది రోజులు ఎన్నికల ప్రచారం తరహాలో ప్రతి నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటించాలని మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇన్‌ఛార్జీలు, కార్పొరేషన్ చైర్మన్లు, పార్టీ ప్రతినిధులకు ఆదేశాలు జారీ చేశారు.

ఎస్ఐఆర్‌పై ఇన్‌ఛార్జి మంత్రులదే బాధ్యత : గాంధీభవన్ బృందం ఎప్పటికప్పుడు బీఎల్ఏ, బీఎల్ఓ నివేదికలను పరిశీలించాలని, ఎస్ఐఆర్ ప్రక్రియపై ఇన్‌ఛార్జి మంత్రులే పూర్తి బాధ్యత తీసుకోవాలని సీఎం రేవంత్ సూచించారు. ఈ నెల 30వ తేదీన మరోసారి పూర్తి స్థాయి సమీక్ష నిర్వహించి, అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా నివేదికలు పరిశీలిస్తామని తెలిపారు. అలాగే పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మరింత బాధ్యత తీసుకుని ఇన్‌ఛార్జి మంత్రులు, ఎమ్మెల్యేలు, పార్టీ ఇన్‌ఛార్జిల మధ్య సమన్వయం తీసుకురావాలని సూచించారు. ఎస్ఐఆర్‌ను ప్రతి ఒక్కరూ ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవాలని, అత్యుత్తమంగా పనిచేసే 100 మంది బీఎల్ఏలకు రాహుల్ గాంధీని కలిసి ఫోటో దిగే అవకాశం కల్పిస్తామని ముఖ్యమంత్రి ప్రకటించారు. ఉదయం జరిగిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమంపై కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన జూమ్ సమావేశంలో రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్, ఏఐసీసీ కార్యదర్శి సచిన్ సావంత్, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, నియోజకవర్గ ఇన్‌ఛార్జిలు, ఎస్ఐఆర్ కో–ఆర్డినేటర్లు పాల్గొన్నారు.

## విశాఖలో
# ఘోర రోడ్డు ప్రమాదం

పల్నాడు జిల్లా వినుకొండకు చెందిన ఒకే కుటుంబం శ్రీకాకుళం జిల్లా టెక్కలిలో జరగబోయే ఒక శుభకార్యానికి హాజరయ్యేందుకు కారులో బయలుదేరిన క్రమంలో ఈ విషాదం చోటుచేసుకుంది. బాధితులు ప్రయాణిస్తున్న కారు ఆనందపురం పరిసరాల్లోని గండిగుండం వద్దకు చేరుకోగానే ఒక్కసారిగా అదుపుతప్పి, ముందు వెళ్తున్న లారీని బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాద తీవ్రతకు కారు ముందు భాగం పూర్తిగా నుజ్జునుజ్జయింది. ప్రమాద సమయంలో కారులో మొత్తం ఐదుగురు ప్రయాణిస్తుండగా.. డ్రైవర్ సహా నలుగురు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనలో నరసరావుపేట ఎమ్మెల్యే పీఏ చంద్రశేఖర్ తీవ్రంగా గాయపడ్డారు. కాగా, మరణించిన వారిలో చంద్రశేఖర్ కుమారుడు కూడా ఉన్నట్లు సమాచారం. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు, పోలీసులు స్పందించి సహాయక చర్యలు చేపట్టారు. తీవ్ర రక్తస్రావమై ప్రాణాపాయ స్థితిలో ఉన్న చంద్రశేఖర్‌ను చికిత్స నిమిత్తం విశాఖపట్నంలోని ఒక ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయనకు వైద్యులు అత్యవసర చికిత్స అందిస్తున్నారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాలను స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేశారు. కారు డ్రైవర్ నిద్రమత్తులోకి జారుకోవడం వల్లే ఈ ప్రమాదం జరిగిందా? లేక మరేదైనా సాంకేతిక లోపం ఉందా? అనే కోణంలో పోలీసులు విచారణ జరుపుతున్నారు.

## భవిష్యత్తులో భారత్ వరల్డ్ కప్
# ఆడుతుంది

తాను ఫుట్‌బాల్‌ను ఎంతగానో ఇష్టపడతానని పేర్కొన్న ఆయన, భవిష్యత్తులో వరల్డ్ కప్ ఆడే భారత జట్టులో తెలంగాణ నుంచి పలువురు స్టార్లు ఉంటారని జోస్యం చెప్పారు. "ఈ మాట గుర్తుపెట్టుకోండి.. భవిష్యత్ సాకర్ స్టార్లు చాలామంది తెలంగాణ నుంచే వస్తారు" అని ఆయన అన్నారు. ఫిఫా వరల్డ్ కప్‌కు తన మద్దతు వెనుక లోతైన ఉద్దేశం, దార్శనికత ఉన్నాయని వివరించారు. గతంలో ఫుట్‌బాల్ దిగ్గజం లియోనెల్ మెస్సీని హైదరాబాద్‌కు తీసుకొచ్చి, తెలంగాణ పిల్లలతో కలిసి మైదానంలో పాలుపంచుకునేలా చేసిన రోజును తాను ఎంతో ఇష్టపడతానని ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు. చివరగా, ఫుట్‌బాల్ అభిమానులందరూ ఫైనల్ మ్యాచ్‌ను ఆస్వాదించాలని ఆయన ఆకాంక్షించారు.

## ప్రతి జిల్లాలో ఎల్‌నినో
# కమాండ్ కంట్రోల్ రూమ్స్

సాగునీటి విషయంలో తమకు ఎలాంటి భేషజాలు లేవని, ఎన్డీఎస్ఏ చెబితే తప్పకుండా మేడిగడ్డ, కన్నెపల్లి నుంచి నీళ్లు ఎత్తిపోస్తామన్నారు. ఒక్కరోజు లక్ష క్యూసెక్కులు రాగానే విపక్ష నేతలు గోల చేశారని ప్రస్తుతం గోదావరిలో 16వేల క్యూసెక్కుల వరద కూడా లేదన్నారు. ఎన్‌నినో పరిస్థితులపై కరీంనగర్ కలెక్టరేట్‌లో ఆదివారం మంత్రుల బృందం సమీక్ష నిర్వహించింది. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో చేపట్టాల్సిన చర్యలపై మంత్రుల బృందం సమీక్షించారు. వివిధ శాఖలు తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు మంత్రులు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన శ్రీధర్ బాబు.. భూగర్భ జలాల పరిరక్షణపై సమగ్రంగా సమీక్ష నిర్వహించామన్నారు. ఒక సీనియర్ అధికారిని ప్రత్యేక అధికారిగా నియమించామన్నారు.



# గోదావరి జలాలు రోడ్ల పాలు

**దేవేంద్ర నగర్ ప్రధాన రహదారి శివ హిల్స్ బోర్డు వద్ద రోజుల తరబడి రోడ్ల పాలవుతున్న గోదావరి జలాలు**

**పట్టించుకోని జలమండలి అధికారులు, సిబ్బంది**

**కుత్బుల్లాపూర్, జూలై 19 (సింగిడి):** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం షాపూర్ నగర్ జలమండలి నిర్వహణలో అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం పుణ్యమా అంటూ విలువైన ప్రజల దాహార్తిని తీర్చే గోదావరి జిల్లాలు రోజుల తరబడి రోడ్లపాలవుతున్న పట్టించుకున్న నాథుడు లేకపోవడం తో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రతి నీటి బొట్టు ను ఒడిసిపట్టి నీటి జలాల దుర్వినియోగాన్ని అరికట్టాలంటూ పాలకులు చేస్తున్న ప్రచారాలు జయంతి శుభాకాంక్షలు అమలుకు నోచుకోకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని పలువురు విమర్శిస్తున్నారు. కుత్బుల్లాపూర్ నియోజక వర్గం షాపూర్ నగర్ జలమండలి పరిధిలోని గాజులరామారం నుండి దేవేంద్ర నగర్ వెళ్లే ప్రధాన రహదారి హెచ్ పి పెట్రోల్ బంక్ సమీపంలో శివహిల్స్ బోర్డు వద్ద కొన్ని రోజులుగా గోదావరి జలాల సరఫరా చేసే ప్రధాన పైప్లైన్ పగిలిపోవడంతో గోదావరి జలాలన్నీ రోడ్లపాలవుతున్నాయి. ప్రజలకు సరిపడా నీటిని సరఫరా చేయడంలో జలమండలి అధికారులు ఎంత కఠినంగా వ్యవహరిస్తున్నారో, గోదావరి జలాలన్నీ రోడ్లపాలవుతున్న పట్టించుకోకపోవడం వారి నిర్లక్ష్యానికి నిదర్శనంగా నిలుస్తున్నాయని స్థానికులు అధికారుల తీరును తప్పుపడుతున్నారు. ఎన్నో కిలోమీటర్ల సుదూర ప్రాంతాల నుండి వందల కోట్ల ప్రజాధనాన్ని వెచ్చించి హైదరాబాద్ మహా నగరానికి ప్రజల దాహార్తిని తీర్చడానికి, ప్రజా అవసరాలను కోసం ప్రభుత్వం గోదావరి జలాలు తరలిస్తుంటే సురక్షితంగా ప్రజలకు అవసరమైన తాగునీటిని అందించవలసిన జలమండలి



అధికారులు వారి నిర్లక్ష్యం కారణంగా ప్రజలకు ఉపయోగపడవలసిన గోదావరి జిల్లాలు రోడ్ల పాలు కావడంతో సరిపోయే నీరు దొరకక ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నీటు వృధాను అరికట్టడంలో షాపూర్ నగర్ జలమండలి అధికారులు పూర్తిగా విఫలం విఫలమవుతున్నారని అధికారుల తీరును తప్పుపడుతున్నారు. గోదావరి జలాల పైపులు పగిలి నీరంతా రోడ్ల పాలు కావడంతో, కోట్లాది ప్రజాధనం వెచ్చించి ప్రజల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన బీట్ రోడ్లన్నీ గుంతల మయంగా మారడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గోదావరి జలాలు రోడ్లపాలై రోడ్లన్ని చెరువులను తలపిస్తుండడంతోపాటు బురుదమయంగా మారి రోడ్లపై వెళుతున్న పాదచారులు, ద్విచక్ర వాహనదారులపై ఈ బురద నీరు పడడంతో వారు ధరించిన దుస్తులన్నీ బురదమయంగా మారడంతో ఉద్యోగులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోజులు, వారాల తరబడి గోదావరి జనాలు పైపులు పగిలి గోదావరి జలాలు రోడ్లపాలై భారీ నీరు వృధా అవుతున్న షాపూర్ నగర్ జలమండలి అధికారుల్లో చలనం లేకపోవడం అధికారుల పనితనానికి అద్దం పడుతుందని పలువురు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా జలమండలి అధికారులు నీటి వృధాను అధికట్టడంలో ప్రత్యేక చొరవ చూపాలని, ఎక్కడ పైప్ లైన్లు పగిలి నీరు వృధా అవుతున్న విషయాన్ని ఆ ప్రాంత లైన్మెన్లు గుర్తించి విషయాన్ని స్థానిక మేనేజర్లు,డి జి ఎం వంటి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువచ్చేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. నీటి వృధాను అరికట్టడంలో అధికారుల అలసత్వాన్ని ప్రభుత్వము, ఉన్నతాధికారులు ప్రత్యేక చొరవ చూపుతూ నీటి వృధాను అరికట్టడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న స్థానిక అధికారుల తప్పిదంగా భావిస్తూ వారిపై తగిన చర్యలు తీసుకుంటే నీటి వృధాను అరికట్టడం సాధ్యమవుతుందని నీటి వినియోగదారులు సూచిస్తున్నారు. నీటి నిర్వహణ బాధ్యత, పైపుల లీకేజీ సమయంలో నాణ్యతా ప్రమాణాలు పాటించేలా ప్రత్యేక చర్యలు చేపడితే గాని నీటి వృధాను అరికట్టడం సాధ్యపడుతుందని, ప్రతి నీటి బొట్టు ను ఒడిసి పట్టుకుని విధంగా ప్రభుత్వము చేస్తున్న ప్రచారానికి అర్థం పరమార్థం ఉంటుందని పలువురు భావిస్తున్నారు.

# సీఎంఆర్ఎఫ్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

**బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్**

**కుత్బుల్లాపూర్, జూలై 19 (సింగిడి):** అనారోగ్యంతో బాధపడుతున్న నిరుపేదలకు మెరుగైన వైద్యాన్ని అందించాలనే లక్ష్యంతో కుత్బుల్లాపూర్ బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ ఎప్పుడూ ముందుంటారు. నిరుపేదలకు మెరుగైన వైద్యం కోసం ఎదురు చూస్తున్న ఐదుగురు అర్హులైన వారికి ముఖ్యమంత్రి సహాయనిధి పథకం ద్వారా 6.25 లక్షల విలువ గల ఎల్వోసీ పత్రాలు మంజూరు చేయించగా ఆదివారం చింతల్ లోని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయా డివిజన్లకు చెందిన నాయకులు నిరుపేద దరఖాస్తుదారులకు ఎల్ఓసీ పత్రాలను కుటుంబసభ్యులకు అందజేశారు. వారిలో 125 - గాజుల రామారం డివిజన్ చంద్రగిరి నగర్ కు చెందిన ఎన్. రేణుక భర్త ఎన్.సంజయ్ రెడ్డి కి 2.75 లక్షలు మంజూరి,131 - కుత్బుల్లాపూర్ డివిజన్ బాపూ నగర్ కి చెందిన చెందిన పొల్ల శ్రీనివాస్ తండ్రి పూల రాజలింగంకు 75వేలు,132 - జీడిమెట్ల డివిజన్ భూమిరెడ్డి నగర్ కి చెందిన చెందిన ఇందుకూరి ప్రభావతి భర్త లేట్ ఐ.సత్యనారాయణ రాజు కు 2 లక్షలు. సీఎంసీ నిజాంపేట్ సర్కిల్ పరిధి సాయి నగర్ కు చెందిన ఎం. శాంత భర్త హన్మంత్ రెడ్డి 75 వేలు మంజూరు కాగా సంబంధిత ఎల్వసి పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో పాక్స్ డైరెక్టర్ పరుశ శ్రీనివాస్ యాదవ్, నిజాంపేట్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు రంగారాయ ప్రసాద్, నియోజకవర్గ యూత్ అధ్యక్షులు దూదిమెట్ల సోమేష్ యాదవ్, సీనియర్



నాయకులు కుంట సిద్దిరాములు, పెద్ది మల్లేష్, కిషోర్ చారి, నవాబ్ భాయ్, సమ్మయ్య నేత, నదీమ్ రాయ్, రాకేష్ జాలిగం, కాలే గణేష్, భూపాల్ రెడ్డి, చంద్ర శేఖర్ రెడ్డి, సమ్మయ్య, బాల మల్లేష్, రాముడు యాదవ్, రమణారెడ్డి, మోచి ప్రకాష్, అడ్వకేట్ దూదిమెట్ల క్రిష్ణ యాదవ్, ఉపేందర్ రెడ్డి, ప్రదీప్ తాళ్లూరి, జయం చారి, దిలీప్, శివా నాయక్, రమేష్, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

# కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలి

**వికారాబాద్, జూలై 19(సింగిడి):** సోను వాంగ్చుక్ నిరాహార దీక్షను భగ్నం చేయడం అప్రజా స్వామీకమని కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలి ఎస్ ఎఫ్ ఐ డిమాండ్ చేస్తున్నట్లు ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు సహాయ కార్యదర్శి రాజు, చాకలి అనిల్ అన్నారు. ఆదివారం ఎస్ఎఫ్ఐ పరిగి కమిటీ ఆధ్వర్యంలో కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ నీట్ యూజీ పరీక్షకు బాధ్యత వహిస్తూ రాజీనామా చేయాలని నిరసన చేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రాజు, జిల్లా సహాయ కార్యదర్శి చాకలి అనిల్ మాట్లాడుతూ మెడికల్ సీట్ల భర్తీకి నిర్వహించే నీట్ యూజీ పరీక్ష పత్రాలు లీక్ కు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని అదేవిధంగా ఎన్నో అవకతవకలతో పారదర్శకతలేని నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ఎన్.టి.ఏ ను రద్దుచేసి రాష్ట్ర ప్రభుత్వాలకె మెడికల్ సీట్ల భర్తీకి ఎంట్రన్స్ ఎగ్జామ్ లను నిర్వహించుకునే హక్కును కల్పించాలని కేంద్రీకృత పరీక్షల విధానాల వల్ల భారతదేశంలో ఏ ఒక్క సెంటర్ల అవకతకు జరిగిన దేశమంతా పరీక్ష రద్దు చేయవలసినటువంటి పరిస్థితి నెలకొందని దీంతో సంవత్సరాల తరబడి మానసిక ఒత్తిడిని తట్టుకుంటూ లక్షల రూపాయలు ఖర్చు పెట్టి చదువుకున్న విద్యార్థులు నష్టపోతున్నారని నీట్



పేపర్ లీక్ తో 20 మంది వరకు విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్నారని అన్నారు. ఇవి కేంద్ర ప్రభుత్వ హత్యలేనని అన్నారు. పారదర్శకమైన నీటి పరీక్ష అలాగే ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేయడం కోసం శాంతియుతంగా ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద సామాజిక కార్యకర్త విద్యావేత్త అయిన సోనం వాంచ్క్ చేస్తున్న నిరాహార దీక్షను నేడు కేంద్ర ప్రభుత్వం బలగాలు ప్రజాస్వామికంగా భగ్నం చేయడం సిగ్గుచేటని అన్నారు. ఆయన చేస్తున్నటువంటి పోరాటానికి మద్దతును ప్రకటిస్తున్నామని న్యాయమైన తన డిమాండ్లను పరిష్కరించాలని కేంద్రంలో ఉన్న ఎన్డీఏ ప్రభుత్వం లీకుల ప్రభుత్వమని నీట్ లీక్ కు బాధ్యత వహించాలని ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసేంతవరకు పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ తరుణంలో ఎస్ఎఫ్ఐ పరిగి కమిటీ సభ్యులు రోహిత్, శివ, సచిన్, సాయి, భాను ప్రకాష్, అరవింద్, ప్రియకుమార్ పాల్గొన్నారు.

## వర్షాభావ పరిస్థితులతో రైతులు అధైర్యపడొద్దు

**అంబేద్కర్ ప్రజా సంఘం జిల్లా కార్యదర్శి బుడిగె జంగం వెంకటేష్**



**వికారాబాద్, జూలై 19(సింగిడి):** వర్షాభావ పరిస్థితిలో రైతులు అధైర్య పడకూడదని అంబేద్కర్ ప్రజా సంఘం జిల్లా కార్యదర్శి బుడగ జంగం వెంకటేష్ అన్నారు. ఆదివారం ఆయన తాండూర్ రెవెన్యూ పరిధిలో ఖరీఫ్ పంటలను రైతులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు ధైర్యం చెప్పారు. ప్రకృతి పరంగా ఏర్పడే పరిస్థితి ని అధిగమించడం సాధ్యం కాదని అన్నారు. అంతా దైవాదీనమని అన్నారు. వర్షాభావ పరిస్థితులతోనే వేసిన పంటలు మొలుకల దశలోనే ఎండు ముఖం పట్టాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఆదుకోవాలని ఆయన కోరారు. రైతులు ఏ మాత్రం అధైర్య పడొద్దని ఇది కేవలం ఒక విపత్కర కాలం మాత్రమేనని అన్నారు. వ్యవసాయంపై ఆధారపడిన రైతులు పంటలు పండించాలనే ఒక్క కళ అందరికీ ఉన్నప్పటికీ అనుకోని పరిస్థితులలో మాత్రమే ఇలా జరుగుతుందన్నారు. వర్షాలు పుష్కలంగా కురిస్తే ఇలాంటి బాధలు ఉండేవి కాదని చెప్పారు. వాతావరణ శాఖ హెచ్చరికలు వ్యవసాయ అధికారుల సూచనలు పాటించడంతో రైతులు ఏమాత్రం నష్టపోరని గుర్తు చేశారు. భూమిని నమ్ముకున్న రైతులు పెట్టుబడి పెట్టామని వృధా పోతోందని అధైర్య పడకుండా ముందుకు వెళ్లాల్సిన అవసరం ఉందన్నారు.

## పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన



**ఆమనగల్లు, జూలై 19(సింగిడి):** మాడ్గుల మండలంలో ఆదివారం ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సుమారు రూ. 5.50 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు మరియు ప్రారంభోత్సవాలు చేశారు. కొల్కులపల్లి, నర్సాయిపల్లి, కాశిగూడెం గ్రామాల్లో సీసీ రోడ్లు, గ్రామపంచాయతీ భవనాలు, బస్ షెల్టర్లు, హైమాస్ట్ లైట్లను ఆయన ప్రారంభించారు. మాడుగులలో విజయ డెయిరీ బీఎంసీ యూనిట్, పాఠశాల భవనం ప్రారంభించడంతో పాటు రూ. 2 కోట్ల వ్యయంతో గ్రంథాలయ భవనానికి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు మరియు పార్టీ నాయకులు పాల్గొన్నారు. మండల సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.

# 15 ఏళ్ల స్మశాన వాటిక వివాదానికి తెర..





**గౌడ సంఘానికి న్యాయం**

**50 లక్షల నిధులతో గౌడ సంఘం స్మశాన వాటిక అభివృద్ధికి కృషి చేస్తా**

**ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి**

**మల్కాజిగిరి, జూలై 19(సింగిడి):** మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఓల్డ్ నేరేడ్ మెట్ గౌడ సంఘానికి చెందిన స్మశాన వాటిక స్థలం విషయంలో గత పదిహేనేళ్లుగా కొనసాగుతున్న న్యాయపోరాటానికి ఎట్టకేలకు ముగింపు లభించింది. న్యాయస్థానం గౌడ సంఘానికి అనుకూలంగా తీర్పు ఇవ్వడంతో, ఆ తీర్పు అమలుకు స్థానిక ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకోవడంతో స్మశాన వాటిక స్థలాన్ని గౌడ సంఘానిదిగానే గుర్తిస్తూ మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ జోనల్ కమిషనర్ అధికారిక ప్రొసీడింగ్స్ జారీ చేశారు. దీంతో దశాబ్ద కాలానికి పైగా నెలకొన్న అనిశ్చితికి తెరపడటంతో గౌడ సంఘం సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ ప్రజలకు సంబంధించిన సమస్యల పరిష్కారమే ప్రజాప్రతినిధిగా తన బాధ్యత అని అన్నారు. న్యాయస్థానం ఇచ్చిన తీర్పు అమలులో ఎలాంటి జాప్యం లేకుండా సంబంధిత అధికారులతో సమన్వయం చేసి, గౌడ సంఘానికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. గౌడ సంఘానికి చెందిన స్మశాన వాటిక స్థలంపై ఇకపై ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన రక్షణ చర్యలు కూడా తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రజలకు న్యాయం జరిగే ప్రతి అంశంలో తాము అండగా ఉంటామని స్పష్టం చేశారు. అనంతరం మాజీ కార్పొరేటర్ నీరుగొండ జగదీష్ గౌడ్ మాట్లాడుతూ స్మశాన వాటిక స్థలం విషయంలో గౌడ సంఘం సభ్యులు పదిహేనేళ్లుగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని పేర్కొన్నారు. ఎన్నోసార్లు కార్యాలయాల చుట్టూ తిరిగినా పరిష్కారం లభించలేదని, చివరకు న్యాయస్థానం తీర్పు వచ్చిన అనంతరం ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి ఆదేశాల మేరకు వెంటనే జోనల్ కమిషనర్‌ను కలిసి కోర్టు తీర్పు ప్రతులను అందజేయడంతో అధికారులు సానుకూలంగా స్పందించి ప్రొసీడింగ్స్ జారీ చేశారని తెలిపారు. ఈ విజయానికి ఎమ్మెల్యే అందించిన సహకారం మరువలేనిదని అన్నారు. జోనల్ కమిషనర్ జారీ చేసిన ప్రొసీడింగ్స్ పత్రాలను ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి క్యాంపు కార్యాలయంలో గౌడ సంఘం ప్రతినిధులు ఎమ్మెల్యేకు, మాజీ కార్పొరేటర్ నీరుగొండ జగదీష్ గౌడ్‌కు అందజేశారు. గౌడ సంఘం పెద్దలు మాట్లాడుతూ కోర్టు కేసు ప్రారంభమైన నాటి నుంచి ప్రతి దశలో తమకు అవసరమైన సలహాలు, సూచనలు అందిస్తూ న్యాయం జరిగేలా కృషి చేసిన ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డికి, సమస్య పరిష్కారం కోసం నిరంతరం పోరాడిన మాజీ కార్పొరేటర్ నీరుగొండ జగదీష్ గౌడ్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కోర్టు తీర్పు, అధికారిక ప్రొసీడింగ్స్ జారీ కావడంతో సుమారు వంద గౌడ కుటుంబాల సభ్యులు ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ నీరుగొండ జగదీష్ గౌడ్‌లను ఘనంగా సన్మానించి తమ ఆనందాన్ని పంచుకున్నారు. ఈ కార్యక్రమం లో గౌడ సంఘం పెద్దలు టి.వి. నరేందర్ గౌడ్, ఈశ్వర్ గౌడ్, పవన్ గౌడ్, శ్రీకాంత్ గౌడ్, జే.కే. సాయి గౌడ్, విశ్వనాథ్ గౌడ్, అభిషేక్ గౌడ్, జహంగీర్ గౌడ్, గిరి గౌడ్, గంగాధర్ గౌడ్, వినోద్ గౌడ్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు జనార్దన్, కోటేశ్వర్, శ్రీకాంత్ గౌడ్, శ్రీధర్ గౌడ్, గౌడ సంఘానికి చెందిన సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## సీసీ రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించిన కాంగ్రెస్ నాయకులు



**అల్వాల్, జూలై 19 (సింగిడి):** చిన్న రాయిని చెరువు అలుగు నుండి పెట్రోల్ బంక్ వరకు 18 లక్షల తో సీసి రోడ్డు నిర్మాణ పనులను మల్కాజ్గిరి నియోజకవర్గం కాంగ్రెస్ ఇంచార్జ్ లక్ష్మీకాంత్ రెడ్డి పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అభివృద్ధి పనులు నాణ్యత ప్రమాణాలతో చేపట్టి త్వరలో ప్రజలకు అందుబాటులో తేవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అల్వాల్ సర్కిల్ కాంగ్రెస్ నాయకులు నాగేశ్వరరావు , నల్లబలవంత రెడ్డి, డి సత్యనారాయణ, అక్రమ పాషా , ధీరజ్ ,డివిజన్ అధ్యక్షులు జ్యోతి యాదవ్ ,ప్రీతి ,విజయ, లక్ష్మిలు పాలొన్నారు. మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు రోడ్డుకు నిధులు మంజూరి చేసేందుకు కృషిచేసిన మాజీ ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

## జవహర్‌నగర్‌లో బోనాల పండుగ తేదీలు ఖరారు

- అంగరంగ వైభవంగా

**బోనాలు పండుగ: కమిటీ సభ్యులు**



**జవహర్ నగర్, జూలై 19(సింగిడి):** తెలంగాణ రాష్ట్రంలో ఘనమైన తల్లుల పండుగలైన బోనాల జాతర షురువైంది. తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు వేదికలుగా నిలిచిన బోనాల సంబరాలు అంబరాన్ని అంటే విధంగా ఈసారి ఘనంగా నిర్వహించేందుకు తెలంగాణ ప్రభుత్వ సహకారంతో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలోని అతి పెద్దదైన జవహర్ నగర్ మహంకాళి బోనాల పండుగ తేదీలను ఆలయ కమిటీ సభ్యులు ఆదివారం ప్రకటించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ ఆగస్టు 23వ తేదీ ఆదివారం రోజు బోనాల పండుగ అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నామని అలాగే ఆగస్టు 24వ తేదీన సోమవారం రంగం జాతర కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. వైభవంగా జరిగే ఈ ఉత్సవాలలో జవహర్ నగర్ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని అమ్మవార్ల కరుణాకటాక్షాలకు పాత్రులు కావాలని జవహర్ నగర్ బోనాల పండుగ ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా మహంకాళి ఆలయ కమిటీ చైర్మన్ రాజు గౌడ్ మాట్లాడుతూ ఈ సంవత్సరం బోనాల పండుగ ఘనంగా నిర్వహిస్తున్నామని జవహర్ నగర్ లోని ప్రజలందరూ ఈ వేడుకకు హాజరుకావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జవహర్ నగర్ మాజీ సర్పంచ్ కారింగుల శంకర్ గౌడ్, మల్లెపూల శ్రీకాంత్ యాదవ్, కోటేష్ గౌడ్, బండ కింది ప్రసాద్, ప్రవీణ్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# జ్ఞానాన్ని పెంచే వేదికలు గ్రంథాలయాలు

- జిల్లా చైర్మన్ మధుసూదన్ రెడ్డి

**ఆమనగల్లు, జూలై 19(సింగిడి):** జ్ఞానాన్ని పెంపొందించుకునేందుకు గ్రంథాలయాలు చక్కని వేదికలని,వాటిని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా చైర్మన్ మధుసూదన్ రెడ్డి అన్నారు.ఆదివారం ఆమనగల్లు మండలం ఆకుతోటపల్లి గ్రామంలో నూతన గ్రంథాలయాన్ని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఏ. మధుసూదన్ రెడ్డి,స్థానిక సర్పంచ్ న్యాలపట్ల నరేందర్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ పత్య నాయక్ ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చదువుకున్న యువతీ యువకులు, నిరుద్యోగులకు పోటీ ప్రపంచంలో గ్రంథాలయాలు కీలకపాత్ర పోషిస్తున్నాయని చెప్పారు. గ్రంథాలయాలు ఆలోచనా విధానం, జ్ఞానం పెంపొందించుకునేందుకు దోహదపడుతా యన్నారు. పుస్తకాలు చదవడం, రాయడం ఎంతో లాభదాయకమన్నారు. రాబోవు తరాలకు మంచి నైపుణ్యం, విద్యనందించేందుకు ఎంతో ఉపయోగపడుతాయని, విద్యార్థులు గ్రంథాలయాలను వినియోగించుకుని భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. గ్రామాల్లో గ్రంథాలయాల ఏర్పాటు యువతలో చైతన్యం, జ్ఞానాభివృద్ధిని పెంపొందిస్తుందని, ప్రజలందరూ వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. విద్యార్థులకు,



యువతకు విజ్ఞానాన్ని అందించే లక్ష్యంతో ఈ గ్రంథాలయాన్ని ఏర్పాటు చేసినట్లు సర్పంచ్ నరేందర్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ జిల్లా కార్యదర్శి రాణి, ఉప సర్పంచ్ శ్రీనివాస్,మండల పార్టీ అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి,శివలింగం,గ్రామ వార్డు సభ్యులు మహేష్,సురేష్,నాయక్, కొండల్ రెడ్డి, రాజు, విజయ్ గ్రామ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## జంగయ్యకు ఆర్థికసాయం

**ఆమనగల్లు, జూలై 19(సింగిడి):** ఆమనగల్ మండలం నల్లవారిపల్లి గ్రామానికి చెందిన పులకరం జంగయ్య పక్షవాతంతో తీవ్ర అనారోగ్యానికి గురయ్యారు. ఈ విషయాన్ని తెలుసుకున్న ప్రముఖ సంఘ సేవకులు, ఆర్యవైశ్య రాష్ట్ర నాయకులు పాపిశెట్టి రాము, వెంటనే స్పందించి బాధితుడికి ఆర్థిక సాయం అందజేశారు. అధైర్యపడొద్దని, తాను అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రామన్న మిత్రమండలి సభ్యులు శ్రీను నాయక్, ఎల్లయ్య, మార్పాకుల వెంకటనారి, దార్ల కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.



ప్రభాతనవ సింగిడి తెలుగు దినపత్రిక
ప్రతి రంగూ ఓ నిజం
Singidi సోమవారం 20-7-2026

Editorial

# ఎడిటోరియల్

## విపక్షాల ఐక్యతను బలోపేతం చేసిన మోడీ !

ప్రజాస్వామ్యంలో నిరంకుశం చేస్తామంటే కుదరదు. ప్రతి విషయంలోనూ అలాగే వ్యవహరిస్తున్న మోడీ, ఇప్పుడు 131వ రాజ్యాంగ సవరణ విష యంలోనూ అలాగే చేసారు. మహిళా బిల్లు సందర్భంగా సరిగ్గా అదే జరి గింది. బిజెపి నిరంకుశ విధానంపై ఓరకంగా తిరుగుబాటుగానే భావిం చాలి. అలాగే విపక్షాలను ఐక్యం చేసిన ఘనత కూడా మోడీదనే చెప్పాలి. వారి ఓటు చెక్కుచెదరకుండా వేయగలిగారు. అలాగే వారంతా ఒక్కటిగా నిలబడేలా చేశారు. ఇది భవిష్యత్ రాజకీయాలకు కీలక మలుపుగా భావిం చాలి. అందుకే 131వ రాజ్యాంగ సవరణ వీగిపోయింది. ఇకపోతే మహిళా బిల్లు వేరు.. డీ లిమిటేషన్ వేరు. 2023లోనే దీనిని ఆమోదించి, 2029 నుంచి అమల్లోకి తీసుకుని వస్తామని గతంలోనే చెప్పారు. అనూహ్యంగా ఇప్పుడు రెండూ కలగలిపి తీసుకుని రావడం ద్వారా బిజెపికి శృంగభంగం తప్పలేదు. నిజానికి ఈ బిల్లులను తీసుకుని వచ్చే ముందు అఖిలపక్షంలో చర్చించలేదు. విపక్షాలను విశ్వాసంలోకి తీసుకోలేదు. సొంతపార్టీలో చర్చించలేదు. ఎన్డిఎ పక్షాలతోనూ చర్చించలేదు. బహుశా మోడీ, అమిత్ షాలు మాత్రమే చర్చించుకుని ఈ సవరణ బిల్లుకు యత్నించి ఉంటారు. బహుశా వారు ఇలాంటి పరిణామం ఎదురవుతుందని కూడా ఊహించ ఉంటారు. దీనిని ఆసరాగా చేసుకుని విపక్షాలను ఎండగట్టాలన్న ఉద్దేశం కూడా ఇందులో దాగి ఉంటుంది. అయితే విపక్షాల ఐక్యత ఇప్పుడు మోడీకి సవాల్ కానుంది. మొన్న సార్వత్రిక ఎన్నికల్లో బిజెపి సంపూర్ణ మెజార్టీ కోల్పో యింది. కేవలం ఎన్డిఎ పక్షాల మద్దతుతో ప్రభుత్వం కొనసా గుతోంది. కనీసం ఎన్డిఎ పక్షాలతో అయినా మోడీ సమ గ్రంగా చర్చించి ఉంటారని అనుకోవడానికి లేదు. ఒకప్పుడు బిజెపిలో మేధావి వర్గం ఉండేది. ఏదైనా సమస్యను ముందు పార్టీలో మేధావి వర్గంతో చర్చించేవారు. ఎత్తులు వేసేవారు. కానీ మోడీ వచ్చాక పెద్దలను దూరం పెట్టారు. ఇప్పుడు పెద్దా, చిన్నా అంతా ఆయనే. అందుకే మహిళా బిల్లు ముసుగులో డీలిమిటేషన్ తీసుకుని రావాలన్న ఎత్తుగడలను ప్రతిపక్షాలు ఉమ్మడి గా చిత్తుచేశాయి. మహిళా బిల్లును ఉన్నపళంగా అమలు చేయడానికి విపక్షాలు సిద్దంగా ఉన్నాయి. కానీ మోడీ ఎందుకనో అలా చేయకుండా మెలికి పెట్టారు. డీలిమిటేషన్ వల్ల కూడా సభ్యుల సంఖ్య పెరిగితే కూడా నష్టమే. 542 స్థానాలు ఉన్న లోక్‌సభ 600 వరకు పెరిగితే ఫర్వాలేదు. కానీ 816 లేదా 850కి పెంచాలన్న తీరు మాత్రం ఆమోదించదగ్గది కాదు. రాజకీయంగా పదవులు పెరిగితే దేశానికి నష్టమే తప్ప లాభం లేదు. పార్లమెంట్ ప్రత్యేక సమావే శాల్లో బిజెపి వ్యవహరించిన తీరు, దానిని తరిస్కరించిన వైనం బిజెపికి గుణపాఠం కావాలి. మహిళా రిజర్వేషన్ బిల్లును ముందు పెట్టి.. డీలిమిటేషన్ బిల్లును ఆమోదింపజేసుకోవాలన్న కేంద్ర ఎత్తుగడను లోక్‌సభలో శుక్రవారం మూకుమ్మడిగా తిప్పికొట్టడం వెనక ఈ ఐక్యత స్పష్టంగా కనిపిం చింది. మహిళా రిజర్వేషన్ చట్ట సవరణ బిల్లు సభలో వీగిపోయేలా చేయటంలో దక్షిణాది రాష్ట్రాల ఎంపీలు కూడా కీలకపాత్ర పోషించారు. ఆంధ్రప్రదేశ్‌లోని పార్టీలు మినహా తెలంగాణ, కేరళ, తమిళనా డు, కర్ణాటక లోని ఎన్డీయే యేతర పార్టీల ఎంపీలంతా ఈ బిల్లును మరో ఆలోచనకు తావులేకుండా తిరస్కరించారు. తమిళనాడుకు చెందిన 38మంది, కేరళలోని 20 మంది, తెలంగాణలోని 9మంది, కర్ణాటకలోని 9మంది ఎన్డీయే యేతర ఎంపీలు డీలిమిటేషన్ బిల్లును అడ్డుకోవటంలో కీలకపాత్ర పోషించారు. డీలిమిటేషన్ బిల్లును బహిరంగా తగులబెట్టి తమ నిరసన ఏ స్థాయిలో ఉంటుందో చూడాలని కేంద్రాన్ని తమిళనాడు సిఎం స్టాలిన్ సవాల్ చేశారు. పార్లమెంటులోనూ తమిళనాడు ఎంపీలు నల్ల దుస్తులు ధరించి బిల్లుకు వ్యతిరేకంగా బలంగా పోరాటం చేశారు. కొత్తగా జనాభా లెక్కలను సేకరించకుండానే మోదీ సర్కారు ఏకపక్షంగా, హడా విడిగా డీలిమిటేషన్‌కు పూనుకోవటంపై అందరిలోనూ అనుమానాలు బల పడ్డాయి. కేంద్రం దక్షిణాదికి ద్రోహం చేస్తోందని ఎలుగెత్తారు. తమ రాష్ట్రాల ప్రాతినిధ్యం లేకుండానే భవిష్యత్తులో ఉత్తరాది బలంతో కేంద్రంలో ప్రభుత్వం ఏర్పాటు జరిగేలా దక్షిణాది ప్రాతినిధ్యంతో పనిలేకుండా చేయటమే మోదీ సర్కారు అసలు లక్ష్యమని విమర్శలు గుప్పించారు. రాజ్యాంగాన్ని బలహీనపర్చి, దేశ ఎన్నికల ముఖచిత్రాన్నే మార్చేయాలని కేంద్రం కుట్ర చేస్తోందని కమ్యూనిస్టు పార్టీలు కూడా పోరాటం చేశాయి. అందుకే కసిగా ఉన్న స్టాలిన్ 'ఢిల్లీని తమిళనాడు ఓడించింది' అని ప్రకటించారు. ఈ క్రమంలో ఇప్పుడు బిజెపి పునరాలోచన చేయాలి. పెద్దలను, మేధావులను గౌరవించడం అలవాటు చేసుకవాలి. కీలకమైన ఇలాంటి సవరణల సందర్భంలో విపక్షాలను విశ్వాసంలోకి తీసుకోవాలి. డీలిమిటేషన్ కూడా లిమిట్ దాటకుండా సీట్లను కుదించాలి. అందరి ఆమోదంతో మళ్లీ బిల్లును ప్రవేశ పెట్టడం ద్వారా ముందుగా మహిళా బిల్లుకు ఆమోదం దక్కేలా చూడాలి. అప్పుడే పోయిన పరువు కొంతయినా దక్కుతుంది. అంతే తప్ప మహిళా బిల్లును వ్యతిరేకించారన్న ప్రచారం ఫలితం ఇవ్వదని గుర్తించాలి.

# చంద్రుణి చేరిన మానవ గమనం

### అంతర్జాతీయ చంద్ర దినోత్సవం: మానవ విజ్ఞాన యాత్ర సఫలం



చంద్రుడు అనగానే ప్రతి భారతీయుడి మనస్సులోనూ చందమామ కథలు, శిశువులకు చెప్పే లోక గీతాలు, కవిత్వపు ఊహలు, పౌరాణిక సందర్భాలు వెంటనే గుర్తుకొస్తాయి. కానీ శాస్త్రీయ దృష్టిలో చంద్రుడు మానవ జిజ్ఞాసకు, సాంకేతిక సామర్థ్యానికి అసాధారణ పరీక్షా కేంద్రంగా నిలిచాడు. ఖగోళ పరిజ్ఞానానికి ఒక మలుపు తిప్పిన ఘట్టం, మానవజాతి కలలకూ, సంకల్పాలకూ నిత్య గుర్తుగా నిలిచి పోయింది. 1969 జూలై 20న అమెరికా అంతరిక్ష పరిశోధనా సంస్థ నాసా చేపట్టిన అపోలో-11 మిషన్ విజయ వంతంగా చంద్రునిపై మానవ తొలి అడుగును ముద్రించింది. నీల్ ఆర్మ్‌స్ట్రాంగ్ చంద్రునిపై అడుగు పెట్టిన మొదటి వ్యక్తిగా చరిత్రలో నిలిచాడు. అతడు పలికిన "ఇది మనిషికి ఒక చిన్న అడుగు, మానవాళికి ఒక పెద్ద గంతు" అనే మాటలు శతాబ్దాలుగా శాస్త్రీయ పరిశోధనలకు మైలు రాళ్లుగా నిలిచాయి. ఆర్బిటర్‌లో మైఖేల్ కాలిన్స్ ఉండగా, బజ్ ఆల్డ్రిన్ కూడా చంద్రుడిపై నడిచిన రెండో వ్యక్తి అయ్యాడు. అపోలో 11 మిషన్ మొత్తం 8 రోజులు, 3 గంటలు, 18 నిమిషాల పాటు కొనసాగింది. దీని విజయంతో ప్రపంచం మొత్తం ఆశ్చర్య పోయింది. టెలివిజన్ తెరల, రేడియోల ముందు కోట్లాది మంది ఆ క్షణాన్ని కన్నీటి ఆనందంతో చూశారు, విన్నారు. ఐక్యరాజ్య సమితి జనరల్ అసెంబ్లీ జూలై 20ను అంతర్జాతీయ చంద్ర దినోత్సవంగా అధికారికంగా గుర్తించి, అంతరిక్షం పట్ల శాంతియుత ప్రయోగాలు, సాంకేతిక సహకారం, శాస్త్రీయ విజ్ఞానం పట్ల మానవతా బాధ్యతను తెలియ జేసింది. ఈ దినోత్సవం ద్వారా మానవ విజ్ఞాన గమనాన్ని గుర్తు చేసుకోవడంతో పాటు భవిష్యత్తులో అంతరిక్షంలో మానవ ప్రస్థానం ఎలా ఉండబోతుందో పట్ల చర్చలకు, ప్రేరణలకు అవకాశం కలుగుతోంది. ప్రపంచ వ్యాప్తంగా అనేక దేశాలలోని ఖగోళ పరిశోధనా సంస్థలు, విద్యా సంస్థలు, ప్లానెటోరియంలు, అంతరిక్ష కేంద్రాలు ఈ రోజున వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తూ, చంద్రునిపై జరిగిన తొలి మిషన్ విజయాన్ని గుర్తుచేసేలా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి. భారత దేశం కూడా చంద్ర అన్వేషణలో విశేషమైన పాత్ర పోషిస్తోంది. ఇస్రో చేపట్టిన చంద్రయాన్-1 మిషన్ 2008లో చంద్రునిపై నీటి ఆనవాళ్లు గుర్తించింది. ఇది ప్రపంచ ఖగోళ శాస్త్రవేత్తలకు ఆశ్చర్యాన్ని కలిగించింది. ఆ తర్వాత 2019లో చంద్రయాన్-2 ద్వారా మరింత మెరుగైన టెక్నాలజీతో ల్యాండర్ పంపించగా, చివరిదశలో ల్యాండింగ్ విఫలమైనప్పటికీ ఆర్బిటర్ విజయవంతంగా పనిచేసి శేష గగనచార ప్రణాళికలకు మార్గదర్శిగా నిలిచింది. 2023లో చంద్రయాన్-3 విజయవంతంగా చంద్రునిపై దక్షిణ ధృవ ప్రాంతంలో ల్యాండింగ్ చేసి భారత ఖగోళ విజ్ఞానానికి ఒక చరిత్రాత్మక ఘట్టాన్ని చేర్చింది. భారత్ చంద్రునిపై విజయవంతంగా ల్యాండింగ్ చేసిన నాలుగో దేశంగా గర్వించదగిన స్థాయికి ఎదిగింది. ప్రస్తుతం చంద్రునిపై నాసా, యూరోపియన్ స్పేస్ ఏజెన్సీ, చైనా స్పేస్ ప్రోగ్రామ్, జపాన్, ఇస్రో వంటివి మానవ అన్వేషణకు సిద్ధమవుతున్నాయి. నాసా చేపట్టిన ఆర్టెమిస్ మిషన్ ద్వారా మళ్లీ మానవులను చంద్రునిపై పంపించేందుకు ప్రణాళికలు సిద్ధమవుతున్నాయి. చంద్రునిపై శాశ్వత స్థావరాలు, నీటి వనరులు, జీవవాస పరిస్థితులపై పరిశోధనలు కొనసాగుతున్నాయి. భవిష్యత్ మానవ అంతరిక్ష ప్రయాణాల కోసం చంద్రుడు ప్రయోగశాలగా మారబోతున్నాడు. అంగారక గ్రహంపై మానవ యాత్రకు పునాది కూడా చంద్రుడే కానుంది. చంద్రుడు కేవలం ఒక ఖగోళ వస్తువు కాదు. మానవతా కలల ఆకృతి. శాస్త్రజ్ఞుల పరిశోధనకు కేంద్రం. కవుల ఊహలకు ప్రతిరూపం. పురాణాల్లో శాంతి సంకేతంగా, తేజోమయమైన దేవతగా వెలుగొందింది. ఇప్పుడు మానవ విజ్ఞాన సాధనకు మార్గదర్శకంగా నిలుస్తోంది. అంతర్జాతీయ చంద్ర దినోత్సవం మానవ శ్రమ, సంకల్పానికి ఘన నివాళిగా, భవిష్యత్ శాస్త్రీయ ప్రయాణాలకు ప్రేరణగా నిలుస్తోంది. ఇది మానవ జాతి ఏకత్వాన్ని, శాస్త్ర విజ్ఞాన శక్తిని, మరియు భవిష్యత్ స్వప్నాలను ప్రతిబింబించే వెలుగురేఖ. జూలై 20 చంద్ర దినోత్సవం కేవలం ఒక స్మారక రోజు కాదు -- అది మానవత కోసం వెలిగే అక్షయ దీపం.

**రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్ -- 9440595494**

### విద్యావ్యవస్థ నిర్వీర్యంపై

# యువత శంఖారావం

## అటు బీజేపీ నిర్లక్ష్యం.. ఇటు కాంగ్రెస్ వైఫల్యం!

నేడు జంతర్ మంతర్ వీధుల నుండి పార్లమెంటు భవనం వరకు నిరసనకారులు భారీ మార్చ్ నిర్వహిస్తున్నారు. దేశ భవిష్యత్తు కోసం, విద్యా సంరక్షణ కోసం రోడ్లపైకి వచ్చిన ఈ 'కాక్‌రోచ్ జనతా పార్టీ' ఆధ్వర్యంలో జరుగుతున్న నిరసనను నేడు ప్రతి ఒక్కరూ గమనించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. వారు లేవనెత్తుతున్న సమస్యలు కేవలం తాత్కాలికమైనవి కావు, అవి ఈ దేశ మూలాలను, ప్రజాస్వామ్య పునాదులను కదిలించేవిగా మారాయి. ప్రస్తుత



విద్యావ్యవస్థ పూర్తిగా నిరుపయోగంగా మారిందని, మన భావి తరాల జీవితాలను తీవ్రమైన చీకట్లోకి నెట్టేస్తోందని ఈ యువత చెప్తున్న ప్రతి మాటలోనూ నూటికి నూరు పాళ్ళు నిజం దాగి ఉంది. ఈ దేశంలో విద్యా సంక్షేమానికి, నిరుద్యోగ సమస్యకు కారణమైన వారు నేడు సమాధానం చెప్పాల్సిన సమయం ఆసన్నమైంది. నేడు జంతర్ మంతర్ పరిసరాల్లో ఒక్క నిమిషం గమనించినా, దేశ యువతలో విస్తరిస్తున్న తీవ్రమైన నిరాశ, ఆందోళన, భవిష్యత్తు పట్ల భయం స్పష్టంగా కనిపిస్తాయి.

నగరాల నుండి నలుమూలల ఉన్న గ్రామాల వరకు ప్రతి చోటా యువత సరైన విద్యా విధానం లేక, చదువుకున్నా ఉద్యోగాలు రాక కొట్టుమిట్టాడుతోంది. కానీ, దేశ రాజధాని ఢిల్లీ పాలకుల అహంకారానికి ఈ దీన గొంతుకలు ఏమాత్రం వినబడటం లేదు. మరోవైపు, దేశంలో ప్రధాన ప్రతిపక్షంగా చెప్పుకునే కాంగ్రెస్ పార్టీ ఈ యువత పోరాటాన్ని కనీసం పట్టించుకోకపోవడం, వారి సమస్యలపై నిలదీయకపోవడం వారి చేతకానితనానికి, నిస్సహాయతకు అద్దం పడుతోంది. ప్రజాస్వామ్యంలో ప్రజల పక్షాన నిలబడి ప్రభుత్వాన్ని కడిగిపారేయాల్సిన కాంగ్రెస్, కేవలం తమ సొంత రాజకీయ ఉనికిని కాపాడుకోవడం కోసం కొట్టుమిట్టాడుతోంది తప్ప, దేశ విద్యావ్యవస్థ మార్పుపై ఒక స్పష్టమైన వ్యూహం కానీ, యువతకు అండగా నిలిచే కనీస నైతిక బలం కానీ చూపించలేకపోతోంది. అధికారం కోల్పోయిన నాటి నుండి క్షేత్రస్థాయిలో ప్రజలు పడుతున్న ఇబ్బందులను పూర్తిగా వదిలేసి, కేవలం సోషల్ మీడియా వేదికలపై ట్వీట్లు, డ్రామాలకు పరిమితమైన కాంగ్రెస్, ఈ నిరసనకారుల గొంతుకను పార్లమెంటులో బలంగా వినిపించడంలో ఘోరంగా విఫలమైంది. ఒక బాధ్యతాయుతమైన ప్రతిపక్షంగా విఫలమైన కాంగ్రెస్ తీరు వల్లే నేడు యువత స్వయంగా రోడ్లపైకి వచ్చి పోరాడాల్సిన దుస్థితి ఏర్పడింది.

ఇక కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం ప్రజాస్వామ్య నిరసనలను, ప్రజాస్వామ్యబద్ధంగా వచ్చే అసమ్మతిని అణచివేయడమే ఏకైక లక్ష్యంగా పెట్టుకుంది. ఈ దేశంలో ఎవరైనా తమ హక్కుల కోసం, ఉపాధి కోసం పోరాటం చేస్తే చాలు, వారిపై తక్షణమే "విదేశీ ఏజెంట్లు", "దేశద్రోహులు", లేదా "టూల్‌కిట్ గ్యాంగ్" అంటూ ముద్ర వేసి బురదజల్లడం బీజేపీకి, వారి ఐటీ సెల్‌కు ఒక అలవాటుగా మారిపోయింది. నిరసనకారుల వ్యక్తిగత ప్రతిష్టను దెబ్బతీస్తే, వారు దేశం కోసం లేవనెత్తుతున్న విద్యా సంక్షేమం, ఉద్యోగాల భర్తీ, పేపర్ లీకేజీల వంటి నిజమైన సమస్యలు పక్కదారి పడతాయనేది పాలకుల కుయుక్తి. భవిష్యత్తులో ఎవరూ కూడా ఈ ప్రభుత్వాన్ని ప్రశ్నించకూడదనే ఉద్దేశంతోనే, భయానక వాతావరణాన్ని సృష్టిస్తూ ఇలాంటి బెదిరింపు ధోరణిని అవలంబిస్తున్నారు. గౌరవనీయులైన ప్రధానమంత్రి, ఆయన క్యాబినెట్ మంత్రులు ఈ యువత ఆవేదనను ప్రత్యక్షంగా వినకుండా మౌనం వహించడం శోచనీయం. తమ తప్పులను కప్పిపుచ్చుకోవడానికి సోషల్ మీడియాలో తమ సొంత యోధులను రెచ్చగొడుతూ, నిరసనకారులపైకి ఉసిగొల్పడం అత్యంత దారుణమైన విషయం.

ప్రస్తుతం ఈ విప్లవాత్మక నిరసనలకు నాయకత్వం వహిస్తున్న 'కాక్‌రోచ్ జనతా పార్టీ' వ్యవస్థాపకుడు అభిజీత్ దిప్కేతో పాటు, లడఖ్ హక్కుల కోసం, దేశ విద్యా సంస్కరణల కోసం ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న సోనమ్ వాంగ్‌చుక్ లాంటి మేధావుల పోరాటం నిజంగా అభినందనీయం. దేశంలో విద్యావ్యవస్థను మార్చాలనే పవిత్రమైన ఆశయం కోసం వాంగ్‌చుక్ తన ప్రాణాలను సైతం పణంగా పెట్టి ఉపవాసం ఉంటున్నారు. దేశ యువత ప్రాణాలతో, వారి భవిష్యత్తుతో ఇటు పాలకులు, అటు ప్రతిపక్షాలు చెలగాటమాడుతున్న ఈ క్లిష్ట తరుణంలోనైనా అధికార బీజేపీ, ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీలు తమ రాజకీయ స్వార్థాన్ని, ఓటు బ్యాంకు రాజకీయాలను పక్కనబెట్టాలి. ప్రాథమిక పాఠశాల స్థాయి నుండి విశ్వవిద్యాలయ స్థాయి వరకు విద్యా సంక్షేమాన్ని, మౌలిక మార్పులను తీసుకురావడానికి ఇరుపక్షాలు కలిసి ఒక ఉమ్మడి పార్లమెంటరీ కమిటీని ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

మన దేశంలో నేడు సామాన్యుల పిల్లలు, పేదలు చదివే ప్రభుత్వ పాఠశాలలు కనీస వసతులు, ఉపాధ్యాయులు లేక నామమాత్రంగా నడుస్తున్నాయి. కానీ, విద్యావ్యవస్థను శాసించే రాజకీయ నాయకులు, ఉన్నతాధికారులు మాత్రం తమ పిల్లలను కార్పొరేట్ ప్రైవేట్ స్కూళ్లకు, విదేశీ యూనివర్సిటీలకు పంపుకుంటూ, దేశంలోని పేద విద్యార్థులకు మాత్రం నాణ్యత లేని, పనికిరాని చదువులను అందిస్తున్నారు. విద్యాసంస్థల్లో నిరంతరం జరుగుతున్న పేపర్ లీకేజీలు, చివరి నిమిషంలో రద్దవుతున్న పోటీ పరీక్షలు కోట్లాది మంది యువత భవిష్యత్తును ప్రశ్నార్థకం చేస్తున్నాయి. కోచింగ్ సెంటర్లు కాలేజీల స్థానాన్ని ఆక్రమించి వ్యాపారాలు చేస్తున్నా పాలకులు పట్టించుకోవడం లేదు. ఈ వికృత నిజాలపై, వ్యవస్థలోని లోపాలపై పోరాడుతున్న 'కాక్‌రోచ్ జనతా పార్టీ' నేటి పోరాటంలో విజయం సాధించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ప్రభుత్వం తప్పు చేసినప్పుడు, దానికి భయపడకుండా ఎదురుతిరిగి ప్రశ్నించే ఇలాంటి నిజమైన గొంతుకలకే దేశ ప్రజలు మద్దతుగా నిలవాలి. దేశవ్యాప్తంగా విద్యావ్యవస్థలో విప్లవాత్మక మార్పులు రానంతవరకు, యువతకు న్యాయం జరిగేంతవరకు ఈ పోరాటం ఆగేలా లేదు. భయాందోళనలను వీడి, హక్కుల కోసం కదంతొక్కిన యువశక్తికి ఈ దేశం సెల్యూట్ చేస్తోంది.

-వెంక గారి భూమయ్య
సీనియర్ జర్నలిస్ట్ విశ్లేషణ
9848559863



# మత్స్యకారుల భద్రతకు భరోసా ఏదీ?

లైసెన్స్, రిజిస్ట్రేషన్లు వంటివి సరిగా లేకుండానే చేపల వేటకు వెళుతూ ఉన్నారు బైక్, కారు, లారీ...ఇలా వాహనం ఏదైనా నడపాలంటే లైసెన్స్ ఉండాలి. టూ వీలర్ అయితే హెల్మెట్ ధరించాలి. కారు నడిపితే సీటు బెల్ట్ పెట్టుకోవాలి. ప్రమాదం జరిగితే ఆర్థికంగా నష్టపోకుండా తప్పనిసరిగా బీమా తీసుకోవాలి. వీటిలో ఏది లేకపోయినా అధికారులు జరిమానా వేస్తారు. ఇందుకోసం రహదారులపై ఎక్కడికక్కడ పోలీసులు కాపు కాసి తనిఖీలు చేస్తుంటారు. మరి సముద్రంలో చేపల వేటకు వెళ్లే సమయంలో బోటు యజమానులు ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి?, వాటిని పాటిస్తున్నారా?, లేదా?...అనేది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.విశాఖ జిల్ల గంగవరం పోర్టు సమీపాన ఈ నెల మొదటి వారంలో బోటు మునిగిపోయి ఆరుగురు మత్స్యకారులు మరణించారు. బోటు యజమాని కారి చిన్నా ఒక్కడే బతికి బయటపడ్డాడు. ప్రభుత్వం తనకు ఏమీ సాయం చేయలేదని, చనిపోయిన కుటుంబాలకే రూ.10 లక్షల నష్టపరిహారం ఇచ్చిందని వాపోతున్నాడు. నిన్నటికి నిన్న ఓ బోటు బ్రేక్ వాటర్స్ సమీపాన బోల్తాపడింది. ఇద్దరు గాయపడ్డారు. తమకు ప్రభుత్వం సాయం చేయాలని వారు కోరుతున్నారు. బోటుకు రూ.2 లక్షలు, వలకు రూ.2.5 లక్షల నష్టం జరిగిందని అంటున్నారు.

**నిబంధనలు ఏమి చెబుతున్నాయి?**

ఆంధ్రప్రదేశ్ మెరైన్ ఫిషింగ్ రెగ్యులేషన్ (ఏపీఎంఎఫ్ఆర్) చట్టం ప్రకారం సముద్రంలో చేపల వేటకు వెళ్లే ప్రతి బోటు తప్పనిసరిగా మత్స్య శాఖ అధికారుల వద్ద రిజిస్టర్ చేసుకోవాలి. లైసెన్స్ తీసుకోవాలి. రిజిస్ట్రేషన్ ఫీజు రూ.25 మాత్రమే. లైసెన్స్ ఫీజు రూ.50. నిబంధనల ప్రకారం రెన్యువల్ చేయించుకోవాలి. వేటకు వెళ్లే ప్రతిసారి ముందుగా సమీపంలోని సాగరమిత్రకు సమాచారం ఇవ్వాలి. ఏ బోటు వేటకు వెళుతుంది?, ఎంతమంది (పేర్లతో సహా) వెళుతున్నారు?, ఏ దిక్కున వెళుతున్నారు?, ఎంత ఆయిల్ పోయించుకొని వెళుతున్నారు?...అనే వివరాలు అందించాలి.వేటకు వెళ్లే బోటు ఫిట్‌గా ఉందని సర్టిఫై చేయించుకోవాలి. ఫిషరీస్ డెవలప్‌మెంట్ ఆఫీసర్, సర్వేయర్ సంయుక్తంగా బోటును తనిఖీ చేసి, బాగుందని, వేటకు అనువైనదని, అందులో అన్నీ ఉన్నాయని సర్టిఫై చేస్తేనే రెన్యువల్ చేస్తారు. అప్పుడే అది వేటకు వెళ్లాలి. ప్రతి బోటులో ఎంత మంది ఉంటే అంతమందికి ప్రమాదంలో ఉపకరించే లైఫ్ జాకెట్లు, అగ్ని ప్రమాదం సంభవిస్తే నివారించడానికి ఫైర్ ఫైటింగ్ ఎక్విప్‌మెంట్, బీమా పత్రాలు ఉండాలి.విశాఖపట్నంలో లక్ష రూపాయల నుంచి రూ.50 లక్షల వరకు ఖరీదు చేసే బోట్లు చేపలవేటకు వెళుతున్నాయి. చాలామంది పాత బోట్లను కేరళ, తమిళనాడు ప్రాంతాల నుంచి తీసుకువచ్చి ఇక్కడ వేటకు ఉపయోగిస్తున్నారు. ఇక్కడ రిజిస్ట్రేషన్ చేయించడం లేదు. రోడ్లపై వాహనాలను తనిఖీ చేసినట్టు హార్బర్‌లో బోట్లను ఎవరూ తనిఖీ చేయడం లేదు. తోటి మత్స్యకారులకు ప్రాణాపాయం అని తెలిసినా అధికారులకు సహకరించడం లేదని ఈత వచ్చునని, గంగమ్మ ఒడిలో పెరిగామని, ఏ నష్టం జరగదని సమర్థించుకుంటున్నారు.

బోటు ఖరీదు రూ.లక్ష అయినా రూ.1.2 లక్ష సాయం

మత్స్యకారుల పట్ల కూటమి ప్రభుత్వం చాలా ఉదారంగా వ్యవహరిస్తోంది. లక్ష రూపాయల ఖరీదు చేసే బోటు అయినా సరే చేపల వేట నిషేధ సమయంలో బోటుకు ఆరుగురికి ఒక్కొక్కరికి రూ.20 వేలు చొప్పున రూ.1.2 లక్షల ఆర్థిక సాయం చేస్తోంది.చేపల వేటకు వెళ్లే వారు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి అధికారులు ప్రతి బోటు ను తనికీ చేయాలి.బోట్ డ్రైవర్స్ మద్యం సేవించి బోట్స్ నడపకుండా తగిన చర్యలు తీసుకోవాలి కాలం చెల్లిన బోట్లను సముద్రం లోకి వెళ్లకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.

**కామిడి సతీష్ రెడ్డి ,
జయశంకర్ భూపాల్ పల్లి జిల్లా 9848445134**

## సర్ ప్రక్రియ పారదర్శకంగా జరగాలి..

### ఒక్క ఓటు కూడా పోకుండా చూడాల్సిన బాధ్యత బిఎల్ఓలదే

### జూమ్ మీటింగ్‌లో ప్రణవ్



**జమ్మికుంట, జులై 19 (సింగిడి):** హుజురాబాద్ నియోజకవర్గ పరిధిలో సర్ పై జూమ్ కాల్ సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ ..ఈ సందర్భంగా కోఆర్డినేటర్లు, బిఎల్‌ఏలకు పలు కీలక సూచనలు చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సర్ పై నిర్వహించిన మీటింగ్ లోహుజురాబాద్ నియోజకవర్గంలో ఓటు నమోదు ప్రక్రియ ఎలా అవుతుంది అని అడగడం జరిగింది అని దీని బట్టి చూస్తే పార్టీ ఎంత సిరియస్ గా ఉందో అర్థం చేసుకోవాలని దానికి అనుగుణంగా ఒక్క ఓటు కూడా ఓటరు కోల్పోకుండా చూడాలని, మ్యాపింగ్ అన్ మ్యాపింగ్ ఎప్పటికప్పుడు సరి చూసుకోవాలని కోరారు. క్షేత్ర స్థాయిలో తిరుగుతున్నప్పుడు ఏవైనా సమస్యలు వస్తే మా దృష్టికి తీసుకురావాలని కోరారు.

## చిన్నారిని ఆశీర్వదించిన ప్రణవ్..





**జమ్మికుంట, జులై 19 (సింగిడి):** జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని ఆరో వార్డు కౌన్సిలర్ శ్రీపతి స్వర్ణలత నరేష్ గౌడ్ దంపతుల కూతురు శౌరి ప్రియ నూతన వస్త్ర ఫల పుష్పాలంకరణ కార్యక్రమానికి హాజరై చిన్నారిని ఆశీర్వదించిన కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ ప్రణవ్ బాబు. పట్టణంలోని స్వాతి గార్డెన్ ఫంక్షన్ హాల్ లో ఏర్పాటు చేసిన ఈ శుభకార్యానికి హుజురాబాద్ మున్సిపల్ చైర్పర్సన్ రొంటాల సుహాసిని మనోజ్ రావు జమ్మికుంట మున్సిపల్ కౌన్సిలర్లు చందా రాజు మాచర్ల రాజు లక్ష్మయ్య అశోక్ పాతకాల మౌనిక అనిల్ తో పాటు కాంగ్రెస్ నేతలు పొన్నగంటి మల్లయ్య దేశిని కోటి పొన్నగంటి రవీందర్ పలువురు మహిళా నేతలు కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

**చిన్నారిని ఆశీర్వదించిన కేడిసిసి బ్యాంక్ వైస్ చైర్మన్..**

మున్సిపల్ కౌన్సిలర్ శ్రీపతి స్వర్ణలత నరేష్ గౌడు ల కూతురు శౌరిప్రియ సారీ ఫంక్షన్ కు కరీంనగర్ జిల్లా కేడీసీసీ బ్యాంకు వైస్ చైర్మన్ పింగళి రమేష్ హాజరై చిన్నారిని ఆశీం-ర్వదించారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ లు పాతకాల రమేష్ గాజుల భాస్కర్ వీణవంక మాజీ సర్పంచ్ చిన్నాల ఐలయ్య జోడు కుమారస్వామి మార్కెట్ డైరెక్టర్ ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర నాయకులు ప్రసాద్ యాద సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## వరద కాలువలో చెత్తను తొలగించిన మున్సిపల్ సిబ్బంది



**జమ్మికుంట, జులై 19 (సింగిడి):** జమ్మికుంట మున్సిపల్ పరిధిలో గల వరద కాలువలు పేరుకుపోయిన చెత్త ను మున్సిపల్ కమిషనర్ చైర్మన్ ఆదేశాల మేరకు సానిటరీ ఇన్స్పెక్టర్ ఇల్లందుల రమేష్ ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి కాల్వ లోని చెత్త చెదారాన్ని ఆదివారం తొలగించారు. ఈ సందర్భంగా సానిటరీ ఇన్స్పెక్టర్ రమేష్ మాట్లాడుతూ, మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున స్వామి చైర్మన్ ప్రశాంత్ కుమార్ ఆదేశాల మేరకు హౌసింగ్ బోర్డు లోని వరద కాలువను పూర్తిస్థాయిలో శుభ్రం చేయడానికి ప్రత్యేక డ్రైవ్ చేపట్టడం జరిగిందని తెలిపారు. వరద కాలువలో భారీ మొత్తంలో ప్లాస్టిక్ చెత్తతో పాటు వ్యర్థ పదార్థాలు ఉన్నాయని ఇద్దరు జవాన్లతో కలిసి ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి చెత్తను పూర్తిస్థాయిలో తొలగిస్తున్నామని తెలిపారు. భారీ వర్షాల నేపథ్యంలో వరద కాలువ లో ఉన్న చెత్తను తొలగిస్తేనే పలు కాలనీలను ముంపుకు గురి కాకుండా కాపాడ గలుగుతామని తెలిపారు. ప్రజలు కూడా మున్సిపల్ సిబ్బందికి సహకరిస్తూ కాలువలో చెత్తను వేయకూడదని సూచించారు. శనివారం కురిసిన వర్షంతో వరద కాలువలో నీరు భారీగా చేరిందని భారీ వర్షాలు కురిస్తే మరింత సమస్యగా మారుతుందని అధికారుల ఆదేశాల మేరకు వరద కాలువను శుభ్రం చేస్తున్నామని తెలిపారు.



# శభాష్ కమిషనర్ గారు...

### కమిషనర్ ఆదేశాలతో వ్యాపారస్తులలో మొదలైన మార్పు

### పరిశుభ్రతను పాటిస్తూ నాణ్యమైన వ్యాపారం

### ఫలించిన మున్సిపల్ అధికారుల వ్యూహం..

జమ్మికుంట మున్సిపల్ కమిషనర్ గుట్టల మల్లికార్జున స్వామి ఆధ్వర్యంలో ఇటీవల పట్టణంలోని పలువురు హోటల్స్ యజమానులతో పాటు తోపుడు బండ్ల పై తినుబండారాలు అమ్ముతున్న చిరు వ్యాపారస్తుల తో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్మన్ ప్రశాంత్ కుమార్ కమిషనర్ మల్లికార్జున స్వామి సానిటరీ ఇన్స్పెక్టర్ ఇల్లందుల రమేష్ వ్యాపారస్తులకు పలు సూచనలు చేశారు. పట్టణ ప్రజలకు పరిశుభ్రమైన వాతావరణంలో నాణ్యతతో కూడిన తినుబండారాలను శుభ్రంగా అందించాలని ముఖ్యంగా ముఖానికి మాస్క్ తలపై క్యాప్ పెట్టుకుని తినుబండారాలను సప్లై చేయాలని సూచించారు.





**జమ్మికుంట, జులై 19 (సింగిడి):** జమ్మికుంట మున్సిపల్ కమిషనర్ గుట్టల మల్లికార్జున స్వామి ఆధ్వర్యంలో ఇటీవల పట్టణంలోని పలువురు హోటల్స్ యజమానులతో పాటు తోపుడు బండ్ల పై తినుబండారాలు అమ్ముతున్న చిరు వ్యాపారస్తుల తో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్మన్ ప్రశాంత్ కుమార్ కమిషనర్ మల్లికార్జున స్వామి సానిటరీ ఇన్స్పెక్టర్ ఇల్లందుల రమేష్ వ్యాపారస్తులకు పలు సూచనలు చేశారు. పట్టణ ప్రజలకు పరిశుభ్రమైన వాతావరణంలో నాణ్యతతో కూడిన తినుబండారాలను శుభ్రంగా అందించాలని ముఖ్యంగా ముఖానికి మాస్క్ తలపై క్యాప్ పెట్టుకుని తినుబండారాలను సప్లై చేయాలని సూచించారు. అంతేకాకుండా ప్రజలకు అందించే తినుబండారాలను భోజనాలను పరిశుభ్రమైన వస్తువులతో తయారు చేయాలని ముఖ్యంగా నాణ్యతతో కూడిన రిఫైండ్ ఆయిల్ ద్వారా టిఫిన్లు తయారుచేసి విక్రయించాలని ఆదేశించారు. కమిషనర్ ఆదేశాలతో వ్యాపారస్తులలో మార్పు మొదలైంది. పట్టణంలోని ఏ హోటల్ కి వెళ్ళిన ఏ తోపుడు బండిపై చూసిన నాణ్యతతో కూడిన వంటకాలను తయారు చేస్తూ కస్టమర్లకు అందిస్తున్నారు. స్వచ్ఛమైన నూనెను వాడుతూ రుచికరమైన తినుబండారాలను వినియోగదారులకు అందిస్తున్నారు. గతంలో ఏ అధికారి కూడా చేయని వినూత్న కార్యక్రమానికి మున్సిపల్ కమిషనర్ గుట్టల మల్లికార్జున స్వామి సానిటరీ ఇన్స్పెక్టర్ రమేష్ ప్రత్యేక చొరవతో ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా అమలు చేస్తున్నారు.

**వినియోగదారుల ఆరోగ్య భద్రతే ముఖ్యం..**
**– మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున స్వామి**

ఈ విషయంపై మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున స్వామిని నినాదం వివరణ కోరగా ఆయన మాట్లాడుతూ జమ్మికుంట పట్టణంలో హోటల్స్ యజమానులు కానీ తోపుడుబండ్ల వ్యాపారస్తులు ఎవరైనా సరే వినియోగదారుల ఆరోగ్యానికి ఇబ్బందులు లేకుండా నాణ్యమైన ఆహారాన్ని అందించాలనే లక్ష్యంతో వ్యాపారస్తులకు పలు సూచనలు చేయడం జరిగిందని తెలిపారు. మున్సిపల్ అధికారుల ఆదేశాలతో వ్యాపారస్తులు సహకారం అందిస్తూ నాణ్యమైన ఆహారాన్ని వినియోగదారులకు అందిస్తున్నారని ఇంకా కొంతమంది అందించడానికి సిద్ధంగా ఉన్నారని మున్సిపల్ అధికారుల ఆదేశాలను ఎవరైనా విస్మరిస్తే వారికి జరిమానాలతో పాటు కేసులు నమోదు చేస్తామని తెలిపారు. అంతేకాకుండా వినియోగదారుల సైతం ప్లాస్టిక్ వాడకండి తగ్గించాలని మార్కెట్ కు వెళ్తే బట్ట సంచిలో వెళ్లాలని సూచించారు. కమిషనర్ చేసిన ఈ కార్యక్రమానికి పట్టణ ప్రజల నుండి విశేష స్పందన లభిస్తుంది. వ్యాపారస్తులు సైతం పరిశుభ్రతతో కలిగిన నాణ్యమైన ఆహారాన్ని వినియోగదారులకు అందిస్తూ వారి అభిమానాన్ని చూరగొంటున్నారు.

## భగత్‌నగర్‌లో వైభవంగా పోచమ్మతల్లి బోనాల జాతర

### బోనం ఎత్తి ఊరేగింపును ప్రారంభించిన యాదగిరి సునీల్ రావు

**కరీంనగర్, జులై 19(సింగిడి):** నగరంలోని భగత్‌నగర్ వెంకటేశ్వర కాలనీలో ఆషాఢమాసాన్ని పురస్కరించుకుని పోచమ్మతల్లి బోనాల జాతర భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. శ్రీ వెంకటేశ్వర కాలనీ అభివృద్ధి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన ఈ వేడుకలకు బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, కరీంనగర్ నగరపాలక సంస్థ మాజీ మేయర్ యాదగిరి సునీల్ రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా యాదగిరి సునీల్ రావు స్వయంగా నెత్తిపై బోనం ఎత్తి బోనాల ఊరేగింపును ప్రారంభించారు. అనంతరం మహిళలతో కలిసి బోనాల ఊరేగింపులో పాల్గొని పోచమ్మతల్లి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో అభివృద్ధి



సంక్షేమ సంఘం అధ్యక్షుడు గాజె నాగులు, నాయకులు చెప్యాల రాంరెడ్డి, తడిసిన బాల్‌రెడ్డి, ముస్కుల విద్యాసాగర్‌రెడ్డి, తిప్పారపు శ్రీనివాస్‌తో పాటు వెంకటేశ్వర కాలనీ వాసులు పాల్గొన్నారు.

## ప్రజా సేవే లక్ష్యంగా ముందుకు సాగుతా..

### మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్

**కుత్బుల్లాపూర్, జూలై 19 (సింగిడి):** కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ ను ఆదివారం షాపూర్ నగర్‌లోని ఆయన నివాసంలో నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన స్థానికులు మర్యాదపూర్వకంగా కలిసి తమ సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా మంచినీటి సరఫరా, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణం తదితర ప్రజా సమస్యలకు సంబంధించిన వినతిపత్రాలను ఆయనకు అందజేసి, వాటి పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. వినతులను స్వీకరించిన కూన శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారం కోసం తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.



## అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు..

### పేదల సొంతింటి కల నెరవేర్చడమే ప్రభుత్వ లక్ష్యం

### ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశానికి హాజరైన ప్రణవ్



**జమ్మికుంట, జూలై 19 (సింగిడి):** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కులమతాలకు అతీతంగా ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలతో లబ్దిదారులు ఎంతో సంతోషంగా ఉన్నారని హుజూరాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి వొడితల ప్రణవ్ పేర్కొన్నారు. ఆదివారం హుజూరాబాద్ మండల పరిధిలోని తుమ్మనపల్లి గ్రామంలో ఎండీ మౌలానా – సలీంబి దంపతుల నూతన ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వొడితల ప్రణవ్ మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో ప్రభుత్వం అత్యంత పారదర్శకంగా వ్యవహరిస్తోందని స్పష్టం చేశారు. మొదటి విడతలో ఏ విధంగానైతే రాజకీయాలకు తావులేకుండా కేవలం అర్హత ప్రాతిపదికన లబ్ధిదారులను ఎంపిక చేశామో, రాబోయే రెండో విడతలోనూ అదే విధానాన్ని కచ్చితంగా అమలు చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో హుజూరాబాద్ మున్సిపల్ చైర్పర్సన్ రొంటాల సుహాసిని, సర్పంచ్ అన్నాడి మాధవి రవీందర్తో పాటు స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రైతులను కాపాడుకుందాం..





### మిషన్ మోడ్‌లో సూపర్ ఎల్‌నినోను ఎదుర్కొందాం

### ఇన్‌చార్జి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

### రైతులకు ప్రత్యామ్నాయ పంటలపై అవగాహన

### వరి సాగుకు తొందరపడొద్దు

### సూపర్ ఎల్‌నినోపై ప్రభుత్వం అప్రమత్తం

### జిల్లాల్లో కంట్రోల్ రూమ్‌ల ఏర్పాటు

**కరీంనగర్, (పెద్దపల్లి)జూలై 19(సింగిడి):** సూపర్ ఎల్‌నినో ప్రభావాన్ని సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు ప్రభుత్వం మిషన్ మోడ్‌లో పనిచేస్తోందని ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. రైతులు, ప్రజలను రక్షించేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు, శాస్త్రవేత్తలు, ప్రజలు సమిష్టిగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కరీంనగర్ కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్ష సమావేశంలో సూపర్ ఎల్‌నినో ప్రభావం, తాగునీటి పరిస్థితి, ప్రత్యామ్నాయ పంటల సాగు, భూగర్భ జలాల పరిరక్షణ, జిల్లాల వారీ కార్యాచరణ ప్రణాళికలపై విస్తృతంగా చర్చించారు. వరి వంటి అధిక నీటి అవసరమయ్యే పంటలకు బదులుగా కందులు, నువ్వులు, పప్పుధాన్యాలు, వేరుశనగ, ఆయిల్‌పామ్, ఉద్యానవన పంటలను సాగు చేయాలని రైతులకు సూచించారు. ప్రతి జిల్లాలో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేసి పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తున్నామని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు. వర్షపు నీటి ప్రతి చుక్కను ఒడిసిపట్టేందుకు ఇంకుడు గుంతల నిర్మాణాన్ని ప్రజా ఉద్యమంగా చేపట్టాలని మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు. కరోనా సమయంలో చూపిన సమిష్టి స్ఫూర్తితోనే సూపర్ ఎల్‌నినో సవాల్‌ను అధిగమించాలని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో ప్రభుత్వ విప్‌లు ఆది శ్రీనివాస్, చింతకుంట విజయ రమణారావు, స్పెషల్ చీఫ్ సెక్రటరీ మహేష్ దత్ ఎక్కా, వ్యవసాయ శాఖ కార్యదర్శి సురేంద్రమోహన్, పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్షతో పాటు ఎమ్మెల్యేలు, కలెక్టర్లు, సీపీలు, ఎస్పీలు, వ్యవసాయ శాస్త్రవేత్తలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## అల్ఫోర్స్ ఎక్సెల్ క్యాంపస్‌లో నయా దౌర్ సాంస్కృతిక వేడుకలు

- లక్ష్యసాధనతో తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చి సమాజంలో ఉన్నత స్థానాన్ని సాధించాలి,
- అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ నరేందర్ రెడ్డి

**కరీంనగర్, జులై19(సింగిడి):** స్థానిక కొత్తపల్లిలోని ఓ ప్రైవేటు వేడుకల మందిరంలో అల్ఫోర్స్ ఎక్సెల్ (బాలుర నివాస కళాశాల) ఆధ్వర్యంలో నిర్వహించిన "నయా దౌర్" నూతన విద్యార్థుల ఆహ్వాన సాంస్కృతిక వేడుకలు విద్యార్థుల కేరింతల నడుమ ఘనంగా జరిగాయి. అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి. నరేందర్ రెడ్డి సరస్వతి మాత విగ్రహానికి పూజలు నిర్వహించి, జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు స్పష్టమైన లక్ష్యాలను నిర్దేశించుకుని, తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చడంతో పాటు సమాజంలో ఉన్నత స్థానాన్ని సంపాదించాలని సూచించారు. పోటీ ప్రపంచంలో పాఠ్యాంశాలకే పరిమితం కాకుండా వివిధ పోటీల్లో పాల్గొని ప్రతిభను చాటుకుంటే మెరుగైన అవకాశాలు లభిస్తాయని అన్నారు. అల్ఫోర్స్ విద్యాసంస్థలు ప్రారంభం నుంచి ప్రతిభాధారిత విద్యను అందిస్తూ విద్యార్థులను ఉన్నత స్థాయికి తీర్చిదిద్దుతున్నాయని పేర్కొన్నారు. 2025--26 విద్యా సంవత్సరంలో వివిధ పరీక్షల్లో సంస్థ



సాధించిన అద్భుత ఫలితాలు దీనికి నిదర్శనమని తెలిపారు. విద్యార్థులు తరగతి గదిలో నేర్చుకున్న అంశాలను నిరంతరం పునశ్చరణ చేసి అన్ని స్థాయిల పోటీ పరీక్షల్లో ప్రతిభ కనబరచాలని ఆకాంక్షించారు. వేడుకల్లో విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. 2025--26 విద్యా సంవత్సరంలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## సత్యసాయి మందిర్‌లో గోరింటాకు మహోత్సవం





### భారీగా తరలివచ్చిన మహిళా భక్తులు

**జమ్మికుంట, జులై 19 (సింగిడి):** జమ్మికుంట పట్టణంలోని భగవాన్ శ్రీ సత్య సాయి బాబా మందిరంలో ఆషాడ మాసం పురస్కరించుకొని మహిళా భక్తులు గోరింటాకు మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించుకున్నారు. మహిళా డే ఆషాడ మాసాన్ని పురస్కరించుకొని సత్యసాయిబాబా ఆలయంలో గోరింటాకు కార్యక్రమాన్ని మహిళలు వైభవంగా నిర్వహించుకున్నారు. అనంతరం స్వామి వారి గాయత్రి వేదాన్ని 21 సార్లు భక్తులు పఠించారు. అనంతరం స్వామివారి భజన నిర్వహించి మంగళహారతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సత్య సాయి మహిళా విభాగం నాయకులు పాల్గొన్నారు.

## చొక్కారావు ఆశయాలు..

## నిజాయితీ రాజకీయాలే తమకు స్ఫూర్తి





- కరీంనగర్‌లో ఘనంగా మాజీ మంత్రి జువ్వాడి చొక్కారావు జయంతి వేడుకలు
- రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు

**కరీంనగర్, జులై 19(సింగిడి):** నగరంలో దివంగత మాజీ మంత్రి, మాజీ పార్లమెంట్ సభ్యుడు జువ్వాడి చొక్కారావు జయంతి వేడుకలను కరీంనగర్ కార్పొరేషన్ కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, సమాచార సాంకేతిక, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, కరీంనగర్ కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్షుడు వైద్యుల అంజన్ కుమార్, సుడా మాజీ చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, కార్పొరేటర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు హాజరై చొక్కారావు విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, చొక్కారావు తన రాజకీయ గురువని పేర్కొన్నారు. రాజకీయాల్లో పారదర్శకత, నీతి, నిజాయితీకి ఆయన ప్రతీకగా నిలిచారని, ఆయనను ఆదర్శంగా తీసుకుని జిల్లాలో రాజకీయ ప్రస్థానం కొనసాగించామని తెలిపారు. చొక్కారావు ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని ప్రజాసేవలో ముందుకు సాగుతామని, ఆయన జయంతి సందర్భంగా ఘన నివాళులు అర్పిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉప్పుల అంజని ప్రసాద్, ఎం.డి. తాజ్, ఆకారపు భాస్కర్ రెడ్డి, మల్లికార్జున రాజేందర్, మడుపు మోహన్, గుండాటి శ్రీనివాస్ రెడ్డి, పడిశెట్టి భూమయ్య, బోనాల శ్రీనివాస్, నిహాల్ అహ్మద్, వంగల విద్యాసాగర్, కామ్రెడ్డి రాంరెడ్డి, మాదాసు శ్రీనివాస్, కంకణాల అనిల్ కుమార్, కుంభాల రాజు కుమార్, తోట అంజయ్య, కొట్టె ప్రభాకర్, పెద్ది తిరుపతి, సాయిని తిరుపతి, షబాన మహమ్మద్, ఖలీల్, నాగుల సతీష్, ముక్క భాస్కర్, స్వప్న శ్రీ, బసవరాజ్ శంకర్, పెంట శేఖర్, రాచర్ల పద్మ, కుర్ర పోచయ్య, నెల్లి నరేష్, గుండారపు శ్రీనివాస్, వీర దేవేందర్, మార్కరాజు, బత్తిని చంద్రయ్య గౌడ్, సుంకరి గణపతి తదితరులు పాల్గొన్నారు.

సింగిడి
ప్రతి రంగూ ఓ నిజం
Singidi
సోమవారం
20-7-2026

# రైతులు, ప్రజల రక్షణే ప్రభుత్వ లక్ష్యం

ఎల్‌నినోను మిషన్ మోడ్‌లో ఎదుర్కొందాం..

ఆరుతడి, ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులకు గ్రామ గ్రామానా అవగాహన కల్పించాలి

ఆరుతడి, ప్రత్యామ్నాయ పంటలపై గ్రామస్థాయిలో అవగాహన

తాగునీటి సంరక్షణకు ముందస్తు కార్యాచరణపై కరీంనగర్‌లో ఉమ్మడి జిల్లా సమీక్షలో

మంత్రి తుమ్మల నాగేశ్వరరావు







**కరీంనగర్, జూలై 19(సింగిడి):** ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో వర్షపాతం తగ్గే అవకాశాల నేపథ్యంలో రైతులు, ప్రజలను రక్షించేందుకు ప్రభుత్వ యంత్రాంగం మొత్తం మిషన్ మోడ్‌లో పనిచేయాలని వ్యవసాయ శాఖ మంత్రి, ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. వార్డు సభ్యుడు, సర్పంచి నుంచి ఎంపీ వరకు, పంచాయతీ కార్యదర్శి నుంచి జిల్లా కలెక్టర్ వరకు ప్రతి ఒక్కరూ సమన్వయంతో బాధ్యత తీసుకుని పనిచేయాలని సూచించారు. కరీంనగర్ కలెక్టరేట్‌లో ఆదివారం నిర్వహించిన ఉమ్మడి జిల్లా సమీక్ష సమావేశంలో ఎల్‌నినో ప్రభావాన్ని తగ్గించేందుకు రూపొందించిన ప్రత్యామ్నాయ కార్యాచరణ ప్రణాళికపై విస్తృతంగా చర్చించారు. సమావేశానికి మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ప్రభుత్వ విప్‌లు, ఎమ్మెల్యేలు, మేయర్లు, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి మహేశ్ దత్ ఎక్కా, వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి సురేంద్ర మోహన్, ఉమ్మడి జిల్లా కలెక్టర్లు, పోలీసు కమిషనర్లు, ఎస్పీలు, వ్యవసాయ శాస్త్రవేత్తలు, వివిధ శాఖల అధికారులు హాజరయ్యారు. మంత్రి తుమ్మల మాట్లాడుతూ, తక్కువ నీటితో సాగయ్యే ఆరుతడి, ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులకు గ్రామ గ్రామాన అవగాహన కల్పించాలని ఆదేశించారు. కంది, నువ్వులు, వేరుశనగ, పప్పుధాన్యాలు, చిరుధాన్యాలు, ఉద్యాన పంటలు, ఆయిల్‌పామ్ వంటి పంటలను నేల స్వభావానికి అనుగుణంగా ప్రోత్సహించాలని సూచించారు. భూగర్భ జలాల పరిస్థితి, ప్రాజెక్టుల నీటి నిల్వలు, వర్షాభావ పరిస్థితులపై రైతులకు స్పష్టమైన సమాచారం అందించాలని, గ్రామసభలు, రైతు వేదికల ద్వారా విస్తృత ప్రచారం నిర్వహించాలని తెలిపారు. తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేయాలని, నీటి వినియోగంలో పొదుపు పాటించేలా ప్రజల్లో చైతన్యం కల్పించాలని ఆదేశించారు. మేజర్, మీడియం, మైనర్ నీటిపారుదల వ్యవస్థలపై ప్రత్యేక సమీక్షలు నిర్వహించాలని సూచించారు. రైతుల కోసం ప్రభుత్వం ఇప్పటికే రైతు భరోసా కింద రూ. 9 వేల కోట్లు విడుదల చేసిందని గుర్తు చేస్తూ, సమన్వయంతో పనిచేస్తే ఎల్‌నినో ప్రభావాన్ని సమర్థంగా ఎదుర్కోగలమన్నారు. ఉమ్మడి జిల్లా ప్రత్యేక అధికారి, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి మహేశ్ దత్ ఎక్కా మాట్లాడుతూ ఎల్‌నినోను ఎదుర్కోవడంలో కరీంనగర్ రాష్ట్రానికి ఆదర్శంగా నిలవాలని, అధికారులు యుద్ధ ప్రాతిపదికన క్షేత్రస్థాయిలో చర్యలు చేపట్టాలని సూచించారు. రైతులను ప్రత్యామ్నాయ పంటల సాగు వైపు మళ్లిస్తూ, ప్రభుత్వం చేపడుతున్న చర్యలను ప్రతి గ్రామానికి చేరవేయాలని కోరారు. వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి సురేంద్ర మోహన్ మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా గ్రామసభలు, ప్రతి మంగళవారం 1,600 రైతు వేదికల్లో నిర్వహించే "రైతు నేస్తం" కార్యక్రమాల ద్వారా రైతులకు శాస్త్రీయ సూచనలు అందిస్తున్నామని తెలిపారు. వ్యవసాయ శాస్త్రవేత్తల సలహాల మేరకు ముందస్తు కార్యాచరణ అమలు చేస్తున్నట్లు చెప్పారు. సమావేశంలో వ్యవసాయ శాస్త్రవేత్తలు ఎల్‌నినో ప్రభావం, తక్కువ వర్షపాతం పరిస్థితులు, ఆరుతడి పంటల ప్రయోజనాలు, భూగర్భ జలాల సంరక్షణ, ప్రత్యామ్నాయ సాగు విధానాలపై సమగ్ర అవగాహన కల్పించారు. కరీంనగర్ కలెక్టర్ చిత్రా మిశ్రా మాట్లాడుతూ, జిల్లాలో ఇప్పటికే ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక అమలు చేస్తున్నామని, రైతు వేదికల ద్వారా పంటల మార్పిడి విధానంపై విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నామని తెలిపారు.

రాజన్న సిరిసిల్ల కలెక్టర్ గరిమా అగర్వాల్, జగిత్యాల కలెక్టర్ సత్యప్రసాద్, పెద్దపల్లి కలెక్టర్ కోయ శ్రీహర్ష తమ జిల్లాల్లో చేపట్టిన చర్యలను వివరించారు. సమావేశంలో ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు తాగునీటి సమస్యల పరిష్కారం, సాగునీటి నిర్వహణ, ప్రత్యామ్నాయ పంటల ప్రోత్సాహం, ప్రత్యేక నిధుల కేటాయింపు, రైతులకు విత్తనాలు, డ్రిప్ సౌకర్యాలు, పంటల బీమా వంటి అంశాలపై పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ చిత్ర మిశ్రా, ఏంఎల్ఏ లు గంగుల కమలాకర్, కవ్వంపల్లి సత్యనారాయణ, మేడిపెల్లి సత్యం, విజయరామణారావు, పాడి కౌశిక్ రెడ్డి, సంజయ్ కుమార్, మక్కాన్ సింగ్, సంజయ్ కుమార్, ఆది శ్రీనివాస్, కరీంనగర్ నగర మేయర్ కొలగాని శ్రీనివాస్, ఉప మేయర్ యాదగిరి సునీల్‌రావు, మాజీ సూడా చైర్మన్ కోమిటిరెడ్డి నరేందర్ రెడ్డి, నగర పాలక సంస్థ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, అదనపు కలెక్టర్లు, పోలీసు కమిషనర్ గౌష్ ఆలం, ఉమ్మడి జిల్లాల పోలీసు అధికారులు, వ్యవసాయ, నీటిపారుదల, భూగర్భ జలాలు, మిషన్ భగీరథ, విద్యుత్, రెవెన్యూ శాఖల అధికారులు, వ్యవసాయ శాస్త్రవేత్తలు, నిపుణులు పాల్గొన్నారు.

## ఘనంగా ప్రారంభమైన లక్ష్ ఫౌండేషన్ ఆసుపత్రి

కేవలం రూ.50 ఓపీ రుసుముతో ప్రజలకు

నాణ్యమైన వైద్య సేవలు

లక్ష్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు ప్రముఖ విద్యావేత్త,

న్యాయవాది మొహమ్మద్ ముస్తాక్ అలీ



**కరీంనగర్, జూలై 19 (సింగిడి):** నగరంలోని ఆదర్శనగర్, రోడ్డు నంబర్-- 1, శివాలయం ఎదురుగా నూతనంగా నిర్మించిన లక్ష్ ఫౌండేషన్ ఆసుపత్రి ఆదివారం ఘనంగా ప్రారంభమైంది. ప్రముఖ విద్యావేత్త, న్యాయవాది, లక్ష్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు డా. మొహమ్మద్ ముస్తాక్ అలీ ఆధ్వర్యంలో ఏర్పాటైన ఈ ఆసుపత్రిని మానవ సేవే మా ధ్యేయం" అనే లక్ష్యంతో ప్రజలకు అంకితం చేశారు. ప్రజలకు తక్కువ ఖర్చుతో నాణ్యమైన వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో ప్రారంభించిన ఈ ఆసుపత్రిలో బాహ్య రోగుల (ఓపీ) రుసుమును కేవలం రూ. 50గా నిర్ణయించారు. ప్రతిరోజూ ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సాధారణ వైద్యుల సేవలు, సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు నిపుణులైన వైద్యుల సేవలు అందుబాటులో ఉంటాయని నిర్వాహకులు తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని ప్రత్యేక వైద్య విభాగాలను ప్రారంభించి ఆధునిక వైద్య సేవలను విస్తరించనున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా డా. మొహమ్మద్ ముస్తాక్ అలీ మాట్లాడుతూ, ఆసుపత్రిని లాభాపేక్షతో కాకుండా సేవాభావంతో ప్రారంభించామని చెప్పారు. పేద, మధ్యతరగతి ప్రజలకు అందుబాటు ధరలో నాణ్యమైన వైద్య సేవలు అందించడమే తమ లక్ష్యమని, డబ్బుల లేమి కారణంగా ఎవరూ చికిత్సకు దూరం కాకూడదనే సంకల్పంతో ఈ ఆసుపత్రిని ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో కార్పొరేటర్లు సోమిడి వేణు ప్రసాద్, జమ్ము, నవీన్, సహకార కార్పొరేటర్ ఇక్రామ్, ముఫ్తీ సాదిక్ సాహెబ్, మొహమ్మద్ అలీ, అక్రమ్ అలీ, ఫజల్ ఉద్దీన్ బషీర్, ఫైసల్, జమాత్-ఎ-ఇస్లామీ హింద్ అధ్యక్షుడు సోహైబ్, అజ్హర్ దబీర్, మాజీ డిప్యూటీ మేయర్ అబ్బా సామి సాహెబ్‌తో పాటు వైద్యులు, విద్యావేత్తలు, సామాజిక సేవకులు, ప్రజా ప్రతినిధులు, శ్రేయోభిలాషులు, స్థానికులు పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు.

## అల్లుడి మరణం తట్టుకోలేక ఆగిన అత్త గుండె





**జమ్మికుంట, జూలై 19 (సింగిడి):** అల్లుడు అనారోగ్యంతో మృతి చెందగా అతని మరణం తట్టుకోలేక ఏడుస్తున్న తరుణంలో అకస్మాత్తుగా గుండె ఆగడంతో ఓ అత్త మృతి చెందింది. జమ్మికుంట మున్సిపాలిటీ పరిధిలోని కొత్తపల్లి గ్రామంలో నివాసం ఉంటున్న బూర్ల రంజిత్(36) అనే వ్యక్తి ఆదివారం సాయంత్రం మెడికల్ షాప్ వద్దకు వెళ్లి అకస్మాత్తుగా అక్కడే పడి మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న అతని అత్త గుండేటి పద్మ(56) అనే మహిళ అక్కడికి చేరుకొని అతనిపై పడి ఏడుస్తున్న తరుణంలో అకస్మాత్తుగా గుండెపోటు రావడంతో మృతి చెందింది. ఒకేసారి కన్నతల్లి కట్టుకున్న భర్త మృతి చెందడంతో భార్య పిల్లలు అనాధలుగా మారిపోయారు. ఈ సంఘటన అక్కడ ఉన్న వారిని కంటతడి పెట్టించింది.

మత్స్య సహకార సంఘం ఎన్నికల నేపథ్యంలో

## నేడు.. రేపు 144 సెక్షన్ అమలు

జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్

**నల్లగొండ ప్రతినిధి, జూలై 19 (సింగిడి):** నల్గొండ జిల్లా నకిరేకల్ మండలం మూసీ గ్రామానికి చెందిన మత్స్య శాఖ సహకార సంఘం లిమిటెడ్ మేనేజింగ్ కమిటీ చైర్మన్ ఎన్నికలు నల్గొండ పట్టణంలోని మహిళా సమాఖ్య భవన్, మిర్యాలగూడ రోడ్ (డీటీసీ సమీపంలో) నిర్వహించనున్న నేపథ్యంలో శాంతిభద్రతల పరిరక్షణ దృష్ట్యా జూలై 20, 21 తేదీల్లో భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్) సెక్షన్ 163 (పూర్వపు సీఆర్పీసీ సెక్షన్ 144) అమలులో ఉంటుందని జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్, ఐపీఎస్ తెలిపారు. ఆదివారం స్థానిక ఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల ప్రక్రియను ప్రశాంతంగా, స్వేచ్ఛాయుతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు జిల్లా పోలీసు శాఖ విస్తృత భద్రతా ఏర్పాట్లు చేసినట్లు ఎస్పీ పేర్కొన్నారు. ఎన్నికల నిర్వహణ కేంద్రం మరియు పరిసర ప్రాంతాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు.

ఉమ్మడి పాలమూరు జిల్లాలోనే తొలి గుర్తింపు రంగాపురంలో

## 98 శాతం ఎస్ఐఆర్ ప్రక్రియ పూర్తి

బీఎల్ఏ దారపోగు వెంకటేష్ వెల్లడి



**పెబ్బేరు, జూలై 19 (సింగిడి):** పెబ్బేరు మండలం రంగాపురం గ్రామంలో ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (స్పెషల్ ఇంటెన్సివ్ రెవిషన్ - ఎస్ఆర్ఐ ) ప్రక్రియను 98 శాతం మేర విజయవంతంగా పూర్తి చేసినట్లు ఎస్సీ సెల్ మండల నాయకులు, బూత్ లెవెల్ ఏజెంట్ (బీఎల్ఏ) దారపోగు వెంకటేష్ తెలిపారు. గ్రామంలో మొత్తం 3,100 మంది ఓటర్లు ఉండగా, వారిలో అత్యధికుల వివరాలను డిజిటలైజేషన్ పూర్తి చేసినట్లు పేర్కొన్నారు. ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి ఆదేశాలు, రంగాపురం గ్రామ కాంగ్రెస్ నాయకులు బి. రామచంద్రారెడ్డి సూచనల మేరకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టి ఈ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేసినట్లు ఆయన వెల్లడించారు. గ్రామంలోని బూత్ లెవెల్ ఆఫీసర్లు (బీఎల్ఓలు), బూత్ లెవెల్ ఏజెంట్లు సమన్వయంతో పనిచేయడంతో ఈ లక్ష్యాన్ని చేరుకున్నట్లు తెలిపారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో 98 శాతం డిజిటలైజేషన్ పూర్తి చేసినందుకు ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి ఫోన్ ద్వారా బీఎల్ఓలు, బీఎల్ఏ దారపోగు వెంకటేష్‌లను అభినందించినట్లు తెలిపారు. అర్హత కలిగిన ప్రతి ఓటరు పేరు ఓటరు జాబితాలో నమోదు అయ్యేలా గ్రామంలో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోనే ఎస్ఐఆర్ ప్రక్రియలో 98 శాతం డిజిటలైజేషన్ పూర్తి చేసుకున్న తొలి గ్రామంగా రంగాపురం గుర్తింపు పొందడం గర్వకారణమని దారపోగు వెంకటేష్ హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి సహకరించిన బీఎల్ఓలు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, గ్రామ ప్రజలకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## మాదకద్రవ్యాల నిర్మూలనపై అవగాహన

తల్లిదండ్రుల అప్రమత్తతే యువతకు రక్షణ కవచం

మాదకద్రవ్యాల నిర్మూలనకు ప్రజల సహకారం అవసరం

యువతను చెడు వ్యసనాల నుంచి కాపాడాల్సిన బాధ్యత తల్లిదండ్రులదే

అనుమానాస్పద కదలికలపై వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వండి

సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడును: ఎస్సై



**పెబ్బేరు, జూలై 19 (సింగిడి):** సమాజాన్ని పట్టిపీడిస్తున్న మాదకద్రవ్యాల మహమ్మారిని నిర్మూలించేందుకు ప్రజల భాగస్వామ్యం అత్యంత అవసరమని పెబ్బేరు ఎస్సై వెంకటేష్ గౌడ్ అన్నారు. పెబ్బేరు మండలంలోని పాతపల్లి గ్రామంలో ఆదివారం గ్రామ సర్పంచి చైతన్య భారతి ఆధ్వర్యంలో మాదకద్రవ్యాల నిర్మూలన, శాంతిభద్రతల పరిరక్షణ పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై వెంకటేష్ గౌడ్ మాట్లాడుతూ, మాదకద్రవ్యాల వ్యసనం యువత భవిష్యత్తును నాశనం చేయడమే కాకుండా కుటుంబాలు, సమాజంపై తీవ్ర ప్రభావం చూపుతోందన్నారు. మాదకద్రవ్యాలకు బానిసైన యువకులు చదువు, ఉపాధి, ఆరోగ్యం కోల్పోయి నేరాల బాట పట్టే ప్రమాదం ఉందని హెచ్చరించారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండేలా తల్లిదండ్రుల పాత్ర అత్యంత కీలకమని అన్నారు. పిల్లల ప్రవర్తనలో వచ్చే మార్పులను ఎప్పటికప్పుడు గమనిస్తూ, వారితో స్నేహపూర్వకంగా మెలగాలని సూచించారు. పిల్లలు ఎవరితో స్నేహం చేస్తున్నారు, ఎక్కడికి వెళ్తున్నారు, మొబైల్ ఫోన్ వినియోగం ఎలా ఉంది, రోజువారీ కార్యకలాపాలు ఎలా సాగుతున్నాయనే విషయాలపై తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. యువతపై చెడు స్నేహాలు, సామాజిక మాధ్యమాల ప్రభావం, మాదకద్రవ్యాల మాయాజాలం పెరుగుతున్న నేపథ్యంలో కుటుంబ సభ్యులు పిల్లలకు నైతిక విలువలు, మంచి అలవాట్లు అలవర్చాలని అన్నారు. పిల్లలతో తరచూ మాట్లాడి వారి సమస్యలను తెలుసుకోవడం ద్వారా వారు చెడు వ్యసనాల బారిన పడకుండా కాపాడవచ్చని తెలిపారు. గ్రామాలలో ప్రజలు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మాదకద్రవ్యాలను మహమ్మారిని తరిమేద్దాం గ్రామాన్ని రక్షిద్దాం అనే నినాదంతో ప్రతి గ్రామాన్ని డ్రగ్స్ రహితంగా తీర్చిదిద్దేందుకు పోలీసు శాఖ కట్టుబడి పనిచేస్తోందని తెలిపారు. మాదక ద్రవ్యాల విక్రయం, వినియోగంపై సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు అందించాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచుతామని భరోసా ఇచ్చారు.

శాంతిభద్రతల పరిరక్షణలో ప్రజల సహకారం కీలకమని పేర్కొన్న ఆయన, గ్రామంలో అనుమానాస్పద వ్యక్తుల సంచారం, చట్టవ్యతిరేక కార్యకలాపాలు గమనిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ప్రజల అప్రమత్తతతోనే నేరాలను సమర్థవంతంగా అరికట్టడం సాధ్యమవుతుందన్నారు. రోడ్డు భద్రతపై కూడా అవగాహన కల్పించిన ఎస్సై, ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, మద్యం సేవించి వాహనాలు నడపరాదని, అతివేగం ప్రాణాంతక ప్రమాదాలకు దారితీస్తుందని హెచ్చరించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ప్రతి పౌరుడి బాధ్యత అని పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువత, మహిళలు, ప్రజాప్రతినిధులు పాల్గొని డ్రగ్స్ నిర్మూలనకు పోలీసు శాఖతో కలిసి పనిచేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమం ద్వారా గ్రామ ప్రజల్లో మాదకద్రవ్యాల దుష్పరిణామాలపై విస్తృత అవగాహన కల్పించడంతో పాటు సామాజిక బాధ్యతపై చైతన్యం పెంపొందించారు.

## కోచ్ ఫ్యాక్టరీలో స్థానికులకే ఉద్యోగ అవకాశాలు కల్పించాలి

ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి




**హనుమకొండ, జూలై 19 (సింగిడి):** కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీలో స్థానిక యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు రైల్వే జేఏసీ, వివిధ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో మడికొండ నుంచి కాజీపేట రైల్వే జంక్షన్ స్టేషన్ వరకు నిర్వహించిన పాదయాత్రలో ఆయన పాల్గొని సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటుతో వరంగల్ ప్రాంత యువత ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న ఉద్యోగాల కల సాకారం కావాలని ఆకాంక్షించారు. ఫ్యాక్టరీలో కల్పించే ఉద్యోగాల్లో స్థానికులకు మొదటి ప్రాధాన్యం ఇవ్వాలని ఆయన స్పష్టం చేశారు. ఈ విషయంలో రైల్వే జేఏసీ తీసుకునే నిర్ణయాలకు అన్ని రాజకీయ పార్టీలు కట్టుబడి ఉండాలని, జేఏసీ నాయకత్వంలో ఉద్యమం ఐక్యంగా కొనసాగాలని ఆయన పిలుపునిచ్చారు. ఫ్యాక్టరీలో సుమారు మూడు వేల ఉద్యోగాలను స్థానిక యువతకే కేటాయించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగాలకు అవసరమైన నైపుణ్యాలు లేని యువతకు శిక్షణ అందించేందుకు ప్రభుత్వం, సంబంధిత సంస్థలు ముందుకు రావాలని, అవసరమైన స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమాలు నిర్వహించేందుకు తాము కూడా సహకరిస్తామని ఆయన హామీ ఇచ్చారు. స్థానిక యువతకు వారి అర్హతలు, నైపుణ్యాలకు అనుగుణంగా ఉద్యోగ అవకాశాలు కల్పించడం ద్వారానే ఈ ప్రాంత అభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు. అదేవిధంగా, కోచ్ ఫ్యాక్టరీ కోసం భూములు కోల్పోయిన కుటుంబాలకు ఉద్యోగాల్లో ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వాలని, అలాగే ఈ ప్రాంతంలోని నిరుద్యోగ యువతకు కూడా తగిన అవకాశాలు కల్పించాలని కోరారు. కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ ప్రాంత అభివృద్ధికి, యువత భవిష్యత్తుకు మైలురాయిగా నిలవాలంటే స్థానికులకు న్యాయం జరిగేలా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కోరారు. ఈ కార్యక్రమంలో రైల్వే జేఏసీ నాయకులు, ప్రజా సంఘాల నాయకులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు , కార్యకర్తలు పాల్గొన్నారు.

## జిల్లా నూతన కుమ్మర సంఘం కార్యవర్గానికి సన్మానం

ఐక్యతతో పోరాడితే హక్కులు సాధించుకోవచ్చని పిలుపు

జిల్లా అధ్యక్షుడు సుగురు రాములు



**పెబ్బేరు, జూలై 19 (సింగిడి):** నూతనంగా ఎన్నికైన వనపర్తి జిల్లా కుమ్మర సంఘం కార్యవర్గ సభ్యులకు ఆదివారం పెబ్బేరు కుమ్మర సంఘం కమిటీ హాల్‌లో ఘన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా కుమ్మర సంఘం అధ్యక్షుడు సుగురు రాములు, ప్రధాన కార్యదర్శి సూర్యవంశం పరుశరాముడు, గౌరవ అధ్యక్షుడు సూర్యవంశం వెంకటస్వామి, స్టీరింగ్ కమిటీ సభ్యులు బుద్దారం నరసింహ, బొడ్డుపల్లి నరసింహ, పెబ్బేరు మండల అధ్యక్షుడు సూర్యవంశం హర్షవర్ధన్, టౌన్ కమిటీ అధ్యక్షుడు సూర్యవంశం నాగన్న ఆధ్వర్యంలో నాయకులకు శాలువాలు కప్పి ఘనంగా సత్కరించి, శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు సుగురు రాములు మాట్లాడుతూ, పూర్వకాలం నుంచి కుమ్మరులు చేతివృత్తిని ఆధారంగా చేసుకుని జీవనం సాగించారని, ప్రస్తుతం కాలానుగుణ మార్పులతో మట్టిపాత్రల స్థానంలో స్టీల్, వెండి తదితర పాత్రల వినియోగం పెరగడంతో సంప్రదాయ వృత్తి తీవ్ర సంక్షోభంలో పడిందన్నారు. కుమ్మరుల జనాభా, వృత్తి పరిస్థితులను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి కార్పొరేషన్‌ల ద్వారా ఆధునిక మట్టిపాత్రల తయారీ యంత్రాలను అందించడంతో పాటు, కాలానుగుణ శిక్షణా కార్యక్రమాలు నిర్వహించేలా కృషి చేస్తామని తెలిపారు. అలాగే ప్రతి అర్హ కుటుంబానికి కార్పొరేషన్ రుణాలు అందేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. అదే విదంగా జిల్లా ప్రధాన కార్యదర్శి సూర్యవంశం పరుశరాముడు మాట్లాడుతూ, కుమ్మర కులస్తులు ఐక్యతతో ఉద్యమిస్తే తమ హక్కులను సాధించుకోవడం సాధ్యమవుతుందని అన్నారు. మనిషి పుట్టినప్పటి నుంచి మరణించే వరకు మట్టికుండకు ప్రత్యేక స్థానం ఉందని, అలాంటి వృత్తిని ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం బాధాకరమన్నారు.


ఇతర సామాజిక వర్గాలకు కార్పొరేషన్లు ఏర్పాటు చేసిన తరహాలోనే కుమ్మరులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి, చైర్మన్‌ను నియమించి, వృత్తి అభివృద్ధికి తగిన నిధులు కేటాయించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వనపర్తి రూరల్ మండల అధ్యక్షుడు శివ, పెబ్బేరు మండల యువజన అధ్యక్షుడు సురేష్, సుగూరు గ్రామ అధ్యక్షుడు శివ, పెబ్బేరు సంఘం ప్రధాన కార్యదర్శి కె. పరుశరాముడు, కె. శ్రీనివాసులు, పామాపురం ఉపసర్పంచ్ శ్రీనివాసులు, సంఘం నాయకులు వెంకటస్వామి, నరేందర్, కర్ణ, తేజ, మహేష్, రమేష్, బుచ్చన్న, నాగన్నతో పాటు యువజన సంఘం సభ్యులు ధర్మతేజ, రవి, రామకృష్ణ, పవన్, శ్రీరాజ్, చింటూ, శేఖర్, బన్నీ తదితరులు పాల్గొన్నారు.

మక్తల్ నియోజకవర్గ అభివృద్ధిపై

# బహిరంగ చర్చకు సిద్ధమా?

మాజీ ఎమ్మెల్యే కు సవాల్ విసిరిన రాష్ట్ర టాడి


కార్పొరేషన్ సొసైటీ వైస్ చైర్మన్ కేశం నాగరాజు గౌడ్




**అమరచింత, జూలై 19, (సింగిడి):** మక్తల్ నియోజకవర్గం అభివృద్ధిపై సోషల్ పాఠశాలకు మీడియా వేదికగా అబద్ధపు ప్రచారాలు చేస్తున్న మక్తల్ మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి బహిరంగ చర్చకు సిద్ధమని రాష్ట్ర దాడి కార్పొరేషన్ సొసైటీ వైస్ చైర్మన్ నాగరాజు గౌడ్ సవాల్ విసిరారు. ఆదివారం ఆయన అమరచింత పట్టణంలో స్థానిక విలేకరులతో గత మూడు పర్యాయాలు ఎమ్మెల్యేగా పనిచేసే నియోజకవర్గం లో ఏం అభివృద్ధి పనులు చేశావో మీడియా సాక్షిగా చర్చకు రావాలన్నారు రాష్ట్ర మంత్రి డాక్టర్ వాకిడి శ్రీహరి పదవి చేపట్టిన రెండున్నర సంవత్సరాలలోనే 1400 కోట్ల అభివృద్ధి పనులు ఆధారాలతో సహా చూపిస్తామన్నారు. 15 సంవత్సరాలు ఎమ్మెల్యేగా పనిచేసి ఏమి అభివృద్ధి చేశావో ప్రజల ముందు ఉంచాలన్నారు. మక్తల్ లోని సంఘం బండ రాయిని తొలగించకుండా రైతుల ఉసురుపోసుకున్నావని ఆరోపించారు. సంగం బండ రాయిని తొలగించి ఆయకట్టు రైతులకు సాగునీరు అందించామని గుర్తు చేశారు. మక్తల్ మాగనూరు కృష్ణ మండలాల్లో రూ,270 కోట్లతో బీటీ రోడ్లు వేస్తున్నామని గుర్తు చేశారు. రాయచూరు గద్వాల పరిసర ప్రాంతాల కనెక్టివిటీ కోసం ఆత్మకూరు మండలంలోని జూరాల వద్ద 126 కోట్ల రూపాయలతో బ్రిడ్జి నిర్మిస్తున్నామని ఇది మాజీ ఎమ్మెల్యే కు కనపడదా అని ప్రశ్నించారు. 15 సంవత్సరాల అనుభవమున్న మాజీ ఎమ్మెల్యే ఈనాడు అసెంబ్లీలో మక్తల్ నియోజకవర్గ సమస్యలపై మాట్లాడిన దాఖలాలు లేవన్నారు. అమరచింత ఆత్మకూర్ ఉమ్మడి మండలాల్లో కోట్ల రూపాయలు విచ్చించి అభివృద్ధి పనులు చేపడుతున్నామని తెలిపారు. అమరచింత మండలంలోని ధర్మపురం నందిమల్ల గ్రామాలకు నాలుగు కోట్ల రూపాయలతో బీటీ రోడ్లు వేశామన్నారు. పాఠశాల అదనపు గదుల కోసం 60 లక్షలు, చంద్రగడు లిఫ్ట్ మరమ్మత్తుల కోసం 8 కోట్ల రూపాయలు వెచ్చించామని అన్నారు. ఉమ్మడి మండలాల్లో అభివృద్ధి కన్నులకు కట్టినట్లు కనిపిస్తున్న మాజీ ఎమ్మెల్యే కు మాత్రం కనపడకపోవడం శోచనీయమన్నారు. అమరచింత మునిసిపాలిటీ కేంద్రంలో ప్రభుత్వ సమీకృత భవనాల కోసం రూ,16 కోట్ల రూపాయలు మంజూరయ్యాయి అన్నారు. ఉమ్మడి అమరచింత ఆత్మకూరు మున్సిపాలిటీలకు రూ,15 కోట్ల చొప్పున నిధులు వచ్చాయని గుర్తు చేశారు. అవసరమైతే అభివృద్ధికి సూచనలు ఇవ్వాలని సోషల్ మీడియా వేదికగా అబద్ధపు ప్రచారాలు చేసుకుంటున్న మాజీ ఎమ్మెల్యేకు రాబోయే రోజుల్లో ప్రజలే బుద్ధి చెప్తారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ జింక సువర్ణ రవి, మండల పట్టణ అధ్యక్షులు రాజేందర్ రెడ్డి రవికాంత్ డిసిసి కార్యదర్శి ముదిరాజ్ రమేష్ మాజీ మండల పట్టణ అధ్యక్షులు కేజీ మహేందర్ రెడ్డి పాల్గొన్నారు.

## వాసవి లేఔట్ జెడ్‌పిహెచ్ఎస్‌లో "సర్"

## మెగా హెల్ప్ డెస్క్ ప్రారంభించిన కొలన్ హన్మంత్ రెడ్డి





**కుత్బుల్లాపూర్, జూలై 19 (సింగిడి):** కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని 276వ డివిజన్ ప్రగతి నగర్ అధ్యక్షులు బొమ్ము వెంకటేశ్వర రెడ్డి (తాతి రెడ్డి) అధ్యక్షతన వాసవి లేఔట్ జెడ్పిహెచ్ఎస్ లో ఏర్పాటు చేసిన "సర్" మెగా హెల్ప్ డెస్క్ క్యాంపును కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్ ఐ ఆర్ ఏమైందిరా ప్రక్రియపై ఓటర్లకు పూర్తి అవగాహన కల్పించడం, అవసరమైన సమాచారం అందించడం, నమోదు ప్రక్రియలో ఎదురయ్యే సమస్యలకు సహాయం చేయడం కోసం ఈ మెగా హెల్ప్ డెస్క్ క్యాంపును ఏర్పాటు చేసినట్లు తెలిపారు. "సర్" కార్యక్రమం విజయవంతం కావాలంటే ప్రతి కాంగ్రెస్ నాయకుడు, కార్యకర్త క్షేత్రస్థాయిలో ప్రజలకు అందుబాటులో ఉండి ప్రతి అర్హులైన ఓటరికి సహాయం చేయాలని పిలుపునిచ్చారు. ప్రతి ఓటరు వివరాలు సక్రమంగా నమోదు అయ్యేలా సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా కాంగ్రెస్ పార్టీ తరఫున పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.



### డ్రాగన్ ఫ్రూట్ అంటే..?:

కాక్టస్ జాతికి చెందిన ఈ పండును హిందీలో కమలం అని కూడా పిలుస్తారు. దీని పై తొక్క గులాబీ లేదా ఎరుపు రంగులో ఉండి, ఆకుపచ్చని ముళ్ల వంటి భాగాలతో డ్రాగన్ ఆకారాన్ని పోలి ఉండటం వల్ల దీనికి ఆ పేరు వచ్చింది. ఇందులో తెల్లటి గుజ్జు, ఎర్రటి గుజ్జు గల రెండు ప్రధాన రకాలు అందుబాటులో ఉన్నాయి.

# ఈ పండు తింటే చాలు..!

## బ్యూటీ పార్లర్‌కు వెళ్లే పని ఉండదు..

**చర్మ ఆరోగ్యానికి ఎలా తోడ్పడుతుంది?:**

డ్రాగన్ ఫ్రూట్‌లో విటమిన్ సి, యాంటీఆక్సిడెంట్లు, ఫైబర్ పుష్కలంగా ఉంటాయి. ఇందులో ఉండే విటమిన్ సి చర్మంలో కొల్లాజెన్‌ను పెంచి చర్మాన్ని దృఢంగా, యవ్వనంగా ఉంచుతుంది. ఇది ముడతలు, సన్నని గీతలను తగ్గిస్తుంది. ఇది శరీరం నుండి విష పదార్థాలను బయటకు పంపడం ద్వారా చర్మానికి లోపలి నుండి సహజమైన మెరుపును ఇస్తుంది. చర్మంపై వాపును తగ్గించి, మొటిమలు మరియు మచ్చల సమస్యను దూరం చేస్తుంది. విటమిన్ ఇ, అధిక నీటి శాతం ఉండటం వల్ల చర్మం పొడిబారకుండా మృదువుగా మారుతుంది.


**14 రోజుల మ్యాజిక్:**

నిపుణుల ప్రకారం.. డ్రాగన్ ఫ్రూట్‌ను ఆహారంలో భాగంగా చేసుకుంటే దశలవారీగా ఫలితాలు కనిపిస్తాయి. మొదటి వారం చర్మంలో పొడిదనం తగ్గి, ముఖం తాజాగా కనిపిస్తుంది. 10వ రోజు నాటికి చర్మపు రంగు మెరుగుపడి, అలసట తగ్గుతుంది. 14వ రోజుకు చర్మం తన సహజ కాంతిని, మృదుత్వాన్ని తిరిగి పొందుతుంది.

**ఎలా తీసుకోవాలి?:**

ఈ పండును పరగడుపున లేదా ఉదయం అల్పాహారంతో తీసుకోవడం శ్రేయస్కరం. జ్యూస్ లేదా స్మూతీ రూపంలో తీసుకుంటే పోషకాలు త్వరగా శరీరానికి అందుతాయి. అంతేకాకుండా దీని గుజ్జును నేరుగా ముఖానికి ఫేస్ మాస్క్‌లా వేసుకోవడం వల్ల చర్మం తక్షణ ఉపశమనం పొందుతుంది.

డ్రాగన్ ఫ్రూట్ కేవలం సౌందర్యానికే కాదు, తక్కువ కేలరీలు ఉండటం వల్ల బరువు తగ్గడానికి కూడా ఎంతో ఉపయోగపడుతుంది. అయితే కేవలం ఆహారమే కాకుండా సరైన నిద్ర, తగినంత నీరు, ఆరోగ్యకరమైన జీవనశైలిని పాటించినప్పుడే ఈ సౌందర్య ఫలం పూర్తి ఫలితాలను ఇస్తుందని నిపుణులు సూచిస్తున్నారు.



### హరే కృష్ణ మూవ్మెంట్ ఆధ్వర్యంలో

# 19న శ్రీ జగన్నాథ రథ యాత్ర



**నార్సింగి, హైదరాబాద్ (నినాదం):** హైదరాబాద్ హరే కృష్ణ మూవ్మెంట్, కోకాపేటలో తొలిసారిగా నిర్వహిస్తున్న శ్రీ జగన్నాథ రథ యాత్రను జూలై 19న నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇది భారతదేశపు చిరకాల ఆధ్యాత్మిక, సాంస్కృతిక వారసత్వాన్ని కొనియాడే పవిత్రమైన ఉత్సవం. అందంగా అలంకరించిన శ్రీ జగన్నాథ, బలదేవ, సుభద్ర దేవతా విగ్రహాలు ద ట్రైలైట్, గోల్డెన్ మైల్ లేఅవుట్ రోడ్, కోకాపేట నుండి బయలుదేరి, కోకాపేట వీధుల గుండా, రాజాపుష్ప అట్రియా మీదుగా, హరే కృష్ణ హెరిటేజ్ టవర్, నార్సింగి – కోకాపేట వరకు ఒక అద్భుతమైన రథంపై సాగనున్నాయి. వందలాది మంది భక్తులు ఉత్సాహంగా పాల్గొంటూ, భక్తి సంగీతంతో పాటు భారీ ఎత్తున ప్రజల భాగస్వామ్యంతో ఈ రథయాత్ర సాగనుంది. అందరికీ ఆధ్యాత్మికంగా ఉత్తేజాన్నిచ్చే, గుర్తుండిపోయే అనుభూతిని అందించేందుకు అన్ని ఏర్పాట్లు ఖచ్చితంగా జరుగుతున్నాయి.

**రథయాత్ర కార్యక్రమ విశేషాలు:**

5:00 : ద ట్రైలైట్, గోల్డెన్ మైల్ లేఅవుట్ రోడ్, కోకాపేట వద్ద కార్యక్రమం ప్రారంభమవుతుంది. హరే కృష్ణ కీర్తనలతో పాటు, రథంపై కొలువైన శ్రీ జగన్నాథ, బలదేవ, సుభద్రలకు ప్రారంభ పూజ నిర్వహిస్తారు.

5:20 : ప్రముఖులు రథ మార్గానికి సంప్రదాయబద్ధంగా ప్రథమ హారతి, చీపురుతో మార్గాన్ని శుద్ధి చేసే కార్యక్రమం నిర్వహిస్తారు. ఆ తర్వాత శ్రీ జగన్నాథ, బలదేవ, సుభద్రలకు హారతి ఇస్తారు.


5:30: మనోహరమైన రథయాత్ర, ఇస్కాన్ వ్యవస్థాపకాచార్యులు శ్రీల ప్రభుపాద రథాన్ని సంప్రదాయ బద్ధంగా తొలిసారి లాగే కార్యక్రమంతో ప్రారంభమవుతుంది. ఆ తర్వాత భక్తులు మధురమైన భజనలు, కీర్తనల నడుమ ఆనందంగా రథాన్ని లాగుతారు.

5:30 – 7:30: రథయాత్ర కోకాపేట వీధుల గుండా సాగుతూ, రాజాపుష్ప అట్రియా మీదుగా, గోల్డెన్ మైల్ రోడ్ వైపు కదులుతూ, చివరికి హరే కృష్ణ హెరిటేజ్ టవర్ చేరుకుంటుంది. మార్గం పొడవునా నివాసితులకు జగన్నాథ, బలదేవ, సుభద్రల దర్శనం చేసుకునే, రథాన్ని లాగే అవకాశం లభిస్తుంది.

7:30: రథయాత్ర హరే కృష్ణ హెరిటేజ్ టవర్, నార్సింగి చేరుకుంటుంది. అక్కడ మెగా కీర్తనలతో పాటు, హైదరాబాద్ హరే కృష్ణ మూవ్మెంట్ అధ్యక్షులు మరియు అక్షయ పాత్ర (తెలంగాణ, ఆంధ్రప్రదేశ్) రీజినల్ ప్రెసిడెంట్ అయిన సత్య గౌర చంద్ర దాస ప్రభుజీ ప్రత్యేక ప్రవచనం అందిస్తారు.

8:00: శ్రీ జగన్నాథ, బలదేవ, సుభద్రలకు తుది హారతితో కార్యక్రమం ముగుస్తుంది. ఆ తర్వాత రాత్రి భోజన ప్రసాదం పంపిణీ చేస్తారు.

రథయాత్ర పోస్టరు, కార్యక్రమ వివరాలను విడుదల చేస్తూ, సత్య గౌర చంద్ర దాస ప్రభుజీ అందరినీ ఈ ఉత్సవంలో పాల్గొని, రథాన్ని లాగి, జగన్నాథ, బలదేవ, సుభద్రల దివ్య ఆశీస్సులు పొందాలని ఆహ్వానించారు. పద్మ పురాణంలో పేర్కొన్న విధంగా, రథంపై భగవానుడిని దర్శించడం వల్లనే జనన మరణ చక్రం నుండి విముక్తి దిశగా ముందుకు సాగగలమని ప్రభుజీ తెలిపారు. ఈ చారిత్రక సందర్భంలో భక్తులు, కుటుంబాలు, శ్రేయోభిలాషులు అందరూ ముందుకు రావాలని కోరారు. హైదరాబాద్ హరే కృష్ణ మూవ్మెంట్ అధ్యక్షులు, అక్షయ పాత్ర (తెలంగాణ, ఆంధ్రప్రదేశ్) రీజినల్ ప్రెసిడెంట్ సత్య గౌర చంద్ర దాస ప్రభుజీ అధ్యక్షతన జరిగే ఈ రథయాత్ర కార్యక్రమానికి రాష్ట్రవ్యాప్తంగా ఉన్న గౌరవనీయ కాంగ్రిగేషన్ సభ్యులు, యువత, శ్రేయోభిలాషులు హాజరవుతారు.




### ఎంఈపీ ప్రణాళికపై నరెడ్కో తెలంగాణ వర్క్‌షాప్




**హైదరాబాద్, (సింగిడి):** భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రాజెక్టుల ప్రారంభ దశలోనే మెకానికల్, ఎలక్ట్రికల్, ప్లంబింగ్ (ఎంఈపీ) సేవలను సమగ్రంగా ప్రణాళిక చేయడం అవసరమని నరెడ్కో తెలంగాణ పేర్కొంది. ఇండియన్ ప్లంబింగ్ అసోసియేషన్ (ఐపీఏ) హైదరాబాద్ చాప్టర్‌తో కలిసి ఎంఈపీ సేవలు, నీటి నిర్వహణ, పంపింగ్ వ్యవస్థలు, నీటి శుద్ధి, మురుగునీటి నిర్వహణపై అవగాహన కల్పించే వర్క్‌షాప్ నిర్వహించింది. ఈ సందర్భంగా నరెడ్కో తెలంగాణ అధ్యక్షుడు కె. శ్రీధర్ రెడ్డిమాట్లాడుతూ, సురక్షితమైన, సుస్థిరమైన నిర్మాణాలకు ప్రారంభ దశలోనే ఎంఈపీ ప్రణాళిక కీలకమని అన్నారు. ఐపీఏ హైదరాబాద్ చాప్టర్ ఛైర్మన్ పి. శ్రవణ్ కుమార్ మాట్లాడుతూ, సరైన డిజైన్, ప్రణాళికతో భవిష్యత్ అవసరాలకు అనుగుణమైన నాణ్యమైన ప్రాజెక్టులు నిర్మించవచ్చని తెలిపారు.




# యూఎస్ ఫెడ్‌లో రఘురామ్ రాజన్‌కు కీలక బాధ్యతలు

రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మాజీ గవర్నర్ రఘురామ్ రాజన్‌ను కీలక పదవి వరించింది. అమెరికా కేంద్ర బ్యాంక్ ఫెడరల్ రిజర్వ్‌లో మానిటరీ పాలసీలను సమీక్షించే బాధ్యతలను ఆయనకు అప్పగించారు. ఇందుకోసం ఏర్పాటైన టాస్క్‌ఫోర్స్‌లో రఘురామ్ రాజన్‌తో పాటు భారత సంతతికి చెందిన ఆర్థిక వేత్త రాజ్ చెట్టి, మైక్రోసాఫ్ట్ సీనియర్ ఎగ్జిక్యూటివ్ ఆశా శర్మ కూడా ఉన్నారు. ఫెడ్ కొత్త ఛైర్మన్ కెవిన్ వార్ష్ ఈ విషయాన్ని వెల్లడించారు.

ఫెడరల్ రిజర్వ్ బ్యాలెన్స్ షీట్ సమీక్ష బాధ్యతలను ఈ టాస్క్‌ఫోర్స్ నిర్వర్తించనుంది. విధాన రూపకల్పనల్లో ఎకనమిక్ డేటాను వినియోగించే అవకాశాలను ఈ బృందం పరిశీలిస్తుంది. అలాగే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలు.. ఉత్పాదకత, ఉపాధి కల్పనను ఎలా ప్రభావితం చేస్తున్నాయనే అంశాలనూ సమీక్షిస్తుంది. అమెరికాలో పెరుగుతున్న ద్రవ్యోల్బణాన్ని అరికట్టడంతో పాటు, ఫెడ్ మానిటరీ పాలసీ కమిటీ విధానాలను ఆధునికీకరించే ఉద్దేశంతో ఈ టాస్క్‌ఫోర్స్ నియామకం చేపట్టారు.



డీజిల్ ఎగుమతులపై విండ్‌ఫాల్ గెయిన్స్ ట్యాక్స్ పెంపు.. అమెరికా ఫెడరల్ రిజర్వ్ ఛైర్మన్ జెరోమ్ పావెల్ స్థానంలో కొత్తగా నియమితులైన కెవిన్ వార్ష్.. మొత్తం ఐదు టాస్క్‌ఫోర్స్‌లను ఏర్పాటు చేశారు. ఇందులో ఒక దానికి రఘురామ్ రాజన్ నేతృత్వం వహిస్తుండగా.. బ్యాంక్ ఆఫ్ ఇంగ్లాండ్ మాజీ గవర్నర్ మెర్విన్ కింగ్, వాల్‌మార్ట్ మాజీ సీఈవో డగ్ మెక్‌మిలన్, నోబెల్ అవార్డు గ్రహీత థామస్ సర్జెంట్, సిలికాన్ వ్యాలీ వెంచర్ క్యాపిటలిస్ట్ మార్క్ ఆండ్రీసెన్ నేతృత్వంలో మిగతా టాస్క్‌ఫోర్స్‌లు ఏర్పాటయ్యాయి. ఫెడ్ పనితీరును మరింత మెరుగుపరిచే విషయంలో కలిసి పనిచేసేందుకు మేధావులు అంగీకరించడం తనకు దక్కిన గౌరవంగా భావిస్తున్నట్లు వార్ష్ పేర్కొన్నారు.

2013 నుంచి 2016 వరకు రఘురామ్ రాజన్ ఆర్‌బీఐ గవర్నర్‌గా పనిచేశారు. ద్రవ్యోల్బణాన్ని అదుపు చేయడం, రూపాయి విలువను స్థిరీకరించడం, బ్యాంకింగ్ రంగంలో కీలక సంస్కరణలకు ఆయన తన పదవీకాలంలో శ్రీకారం చుట్టారు. అంతకుముందు అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థలో ముఖ్య ఆర్థిక వేత్తగా పనిచేశారు. ప్రస్తుతం షికాగో విశ్వవిద్యాలయంలో ఫైనాన్స్ ప్రొఫెసర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

# స్విగ్గీలో వంటగ్యాస్ సిలిండర్ల సరఫరా సేవలు

వంటగ్యాస్ సిలిండర్ల సరఫరాకు హెచ్‌పీసీఎల్ తో ఒప్పందం చేసుకున్నట్లు స్విగ్గీకి చెందిన క్విక్‌కామర్స్ విభాగమైన ఇన్‌స్టామార్ట్ ప్రకటించింది. హెచ్‌పీసీఎల్ కొత్తగా విడుదల చేసిన 10 కిలోగ్రాముల ఎల్‌పీజీ సిలిండర్ల (హెచ్‌పీ నవ్య)తో ఈ సేవకు శ్రీకారం చుడుతున్నట్లు తెలిపింది. తొలుత బెంగళూరులోని వినియోగదారులు హెచ్‌పీ నవ్య సిలిండర్ల కోసం ఇన్‌స్టామార్ట్‌లో ఆర్డరు చేసుకోవ్చని, 5 కిలోగ్రాముల సిలిండర్లు కూడా అందిస్తామని ఇన్‌స్టామార్ట్ వెల్లడించింది. గృహ వినియోగ వంటగ్యాస్ కనెక్షన్ లేని వారు కూడా వీటికి ఆర్డరు చేయొచ్చని.. గదుల్లో అద్దెకు ఉండే విద్యార్థులు, ఉద్యోగులకు ఇవి ఉపకరిస్తాయని పేర్కొంది.




### డీజిల్ ఎగుమతులపై విండ్‌ఫాల్ గెయిన్స్ ట్యాక్స్ పెంపు..




**పశ్చిమాసియా ఉద్రిక్తతల వేళ..** కేంద్రప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. డీజిల్, ఏటీఎఫ్ ఎగుమతులపై విండ్‌ఫాల్ గెయిన్స్ ట్యాక్స్ ( ను పెంచింది. అయితే, పెట్రోల్‌పై సుంకాన్ని మాత్రం తగ్గించింది. జులై 16 నుంచి రెండు వారాల పాటు ఈ నిర్ణయాలు అమల్లో ఉంటాయని తెలిపింది. తాజా నిర్ణయంతో లీటర్ డీజిల్‌పై విండ్ ఫాల్ ట్యాక్స్ రూ. 8.5 నుంచి రూ. 15.5కు పెరిగింది. విమాన ఇంధనం లీటర్‌పై ఈ పన్నును రూ. 7.5 నుంచి రూ. 14.5కు పెంచింది. ఇక, లీటర్ పెట్రోల్‌పై ఎగుమతి సుంకాన్ని రూ. 4 నుంచి రూ. 2.5కి తగ్గించింది. అంతర్జాతీయ మార్కెట్లో చమురు ధరలు అకస్మాత్తుగా పెరిగినప్పుడు, చమురు కంపెనీలకు భారీ లాభాలు వస్తాయి. ఇలాంటి అదనపు లాభాలపై ప్రభుత్వం పన్ను రూపంలో కొంత మొత్తాన్ని వసూలు చేస్తోంది. ఈ నిధులను దేశీయ అవసరాలకు, సంక్షేమ పథకాలకు ఉపయోగిస్తోంది.

**వరుసగా నాలుగోరోజు..**

ఇదిలా ఉండగా.. హర్మూజ్ అంతరాయాల నేపథ్యంలో వరుసగా నాలుగోరోజు ముడిచమురు ధరలు పెరిగాయి. బ్రెంట్ క్రూడ్ ఒక బ్యారెల్ ధర 85డాలర్లు దాటగా.. యూఎస్ వెస్ట్ టెక్సాస్ ఇంటర్మీడియెట్ క్రూడ్ ధర 80 డాలర్లు దాటింది.

# లేఆఫ్‌లకు ఏఐ వినియోగమా?

శాన్‌ఫ్రాన్సిస్కో: ఉద్యోగుల్లో ఎవరిని తొలగించాలో (లేఆఫ్ చేయాలో) ఎంపిక చేయడానికి కృత్రిమ మేధ (ఏఐ) సాంకేతికతను వినియోగించిందంటూ మెటా సంస్థపై 26 మంది ఉద్యోగులు కలిసి దావా వేశారు. వైద్య, మాతృత్వ/కుటుంబ సెలవుల్లో ఉన్న వారినే లేఆఫ్ చేసేందుకు ఎక్కువగా లక్ష్యంగా చేసుకున్నట్లు వారు ఆరోపించారు. మే నెలలో కంపెనీ 8,000 మంది (మొత్తం సిబ్బందిలో 10%) ఉద్యోగులకు లేఆఫ్ ఇచ్చిన విషయం తెలిసిందే. వారిలో ఈ 26 మంది కూడా ఉన్నారు. ఎవరిని లేఆఫ్ చేయాలన్న దాని కోసం కంపెనీ తన అంతర్గత ఏఐ వ్యవస్థలు, కీస్ట్రోక్–యాక్టివిటీ మానిటరింగ్ డేటా, ఏఐ టోకెన్ వినియోగిత డ్యాష్‌బోర్డులు, అల్గారితమ్ ఆధారిత పనితీరు ర్యాంకింగ్‌లు వంటి పద్ధతులను వినియోగించిందని వివరిస్తూ, కాలిఫోర్నియాలోని ఫెడరల్ కోర్టులో వీరు దావా వేశారు. వైద్య, కుటుంబ సెలవుల్లో ఉన్న వారి ఉత్పాదకత సాధారణంగానే తగ్గినట్లు కనిపిస్తుంది. అది వారి అసమర్థత కింద జమకట్టడం అన్యాయమని పేర్కొన్నారు.



# ఫ్లాట్‌గా ముగిసిన సూచీలు



దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు గురువారం సెషన్‌లో ఊగిసలాడాయి. పశ్చిమాసియా ఉద్రిక్తత పరిస్థితులు, చమురు ధరలు పెరగడం మదుపర్ల సెంటిమెంట్‌ను దెబ్బతీసింది. అమెరికా–ఇరాన్ మధ్య మరోసారి ఘర్షణలు ప్రాంతీయ యుద్ధానికి దారితీయొచ్చనే భయాలు నెలకొన్నాయి. దీంతో ప్రపంచ మార్కెట్లపై ప్రభావం పడింది. ఈ క్రమంలోనే దేశీయ సూచీలు ఫ్లాట్‌గా ముగిశాయి.

**డీజిల్ ఎగుమతులపై విండ్‌ఫాల్ గెయిన్స్ ట్యాక్స్ పెంపు..**

చివరికి సెన్సెక్స్ 1.44 పాయింట్ల లాభంతో 77,186.87 వద్ద ముగిసింది. నిఫ్టీ 5.75 పాయింట్లు నష్టపోయింది. సెన్సెక్స్ 30 సూచీలో హెచ్‌సీఎల్‌టెక్, ఇండిగో, బజాజ్‌ఫైనాన్స్, మారుతీ,మహీంద్రా అండ్ మహీంద్రా, ఐటీసీ కంపెనీ షేర్లు ప్రధానంగా లాభపడ్డాయి. ఎటర్నల్, బీఈఎల్, బజాజ్ ఫైనాన్స్, హెచ్‌డీఎఫ్‌సీబ్యాంక్, ఎన్‌టీపీసీ, ట్రెంట్ షేర్లు నష్టాలను చవిచూశాయి. డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ 96.34 వద్ద ఉంది. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ చమురు ధర 84.76 డాలర్ల వద్ద కొనసాగుతోంది. బంగారం ఔన్స్ ధర 4,033 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. మరోవైపు ఆసియా మార్కెట్లలో దక్షిణకొరియా కోస్పి, జపాన్ నిక్కీ వంటి మార్కెట్లు కూడా నష్టాలను చవిచూశాయి.

ప్రభాతనవ
సింగిడి
SINGIDI తెలుగు దినపత్రిక
ప్రతి రంగూ ఓ నిజం
Singidi
సోమవారం
20-7-2026

## చెక్ బౌన్స్ కేసులకు సత్వర పరిష్కారం

**18న స్పెషల్ లోక్ అదాలత్ విజయవంతం చేయాలి**

**సీనియర్ సివిల్ జడ్జి డి. నాగేశ్వర్ రావు పిలుపు**



**మెట్ పల్లి, (సింగిడి):** చెక్ బౌన్స్ కేసుల సత్వర పరిష్కారం కోసం ఈ నెల 18న నిర్వహించనున్న స్పెషల్ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని సీనియర్ సివిల్ జడ్జి డి. నాగేశ్వర్ రావు న్యాయవాదులకు పిలుపునిచ్చారు. మండల్ లీగల్ సర్వీసెస్ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం మెట్‌పల్లి బార్ అసోసియేషన్ సభ్యులతో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశవ్యాప్తంగా పెరుగుతున్న చెక్ బౌన్స్ కేసుల పెండెన్సీని తగ్గించేందుకు ప్రత్యేక లోక్ అదాలత్‌లు సమర్థవంతమైన వేదికగా నిలుస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. రాజీ ద్వారా పరిష్కారం సాధ్యమయ్యే కేసులను గుర్తించి, సంబంధిత పక్షాలను ఒప్పించి లోక్ అదాలత్‌లో పరిష్కరించేలా ప్రతి న్యాయవాది చొరవ చూపాలని కోరారు. వారెంట్ ఉన్న కేసులతో పాటు రాజీకి అవకాశం ఉన్న అన్ని కేసులను కూడా లోక్ అదాలత్‌కు తీసుకురావాలని సూచించారు. న్యాయస్థానాల్లో పెండింగ్ కేసుల భారాన్ని తగ్గించడంతో పాటు, కక్షిదారులకు తక్కువ సమయంలో తక్కువ ఖర్చుతో న్యాయం అందించడమే లోక్ అదాలత్‌ల ప్రధాన ఉద్దేశమని ఆయన వివరించారు. న్యాయవాదుల సహకారంతో ఈ ప్రత్యేక లోక్ అదాలత్‌ను విజయవంతం చేసి, ఎక్కువ సంఖ్యలో కేసులను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో జూనియర్ సివిల్ జడ్జి వి. మాధవి, ఏపీపీ ప్రణయ్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఏలేటి రామ్‌రెడ్డి, లోక్ అదాలత్ సభ్యులు వడ్డేపల్లి శ్రీనివాసన్, జేడి సుధాకర్, న్యాయవాదులు జిల్లా వెంకటేశ్వర్లు, మగ్గిడి వెంకట నర్సయ్య, కోటగిరి వెంకటస్వామి, పుప్పాల భానుమూర్తి, కటకం వేణుగోపాల్, బక్కూరి రమేష్, పసునూరి శ్రీనివాస్, బిగుర్ల శంకర్, అలాల శంకర్, అందె సంజయ్ తదితరులు పాల్గొన్నారు.

## ఓటరు జాబితాలో పేరు తప్పనిసరిగా పరిశీలించుకోవాలి



**హుజురాబాద్, (సింగిడి):** హుజురాబాద్ నియోజకవర్గంలో కొనసాగుతున్న ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియ లో ప్రతి ఓటు ఎంతో విలువైన దని, అర్హులైన ప్రతి ఓటరు తమ పేరు ఓటరు జాబితాలో నమోదైందో లేదో తప్పనిసరిగా పరిశీలించుకోవాలని బీఆర్ఎస్ సభ్యత్వ నమోదు నియోజకవర్గ ఇన్‌చార్జి, టీఎస్ఎం ఎస్ఐడీసీ మాజీ చైర్మన్ డా. చిరుమిల్ల రాకేష్ పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కే.టి. రామారావు ఆదేశాల మేరకు ఈ సూచనలు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అర్హులైన ప్రతి ఓటరికి సంబంధిత దరఖాస్తు ఫారాలు అందాయా లేదా అనే విషయాన్ని పార్టీ నాయకులు, కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి పరిశీలించాలని సూచించారు. ఫారాలు అందని వారికి వెంటనే అందేలా చర్యలు తీసుకోవడంతో పాటు, ఓటరు నమోదు, పేరు మార్పులు, చిరునామా సవరణలు, కొత్తగా చేర్పులు వంటి అంశాల్లో ప్రజలకు అవసరమైన సహాయ సహకారాలు అందించాలని పార్టీ శ్రేణులకు ఆదేశించారు. అదేవిధంగా ప్రజలు కూడా తమ ఓటు హక్కు పట్ల బాధ్యతతో వ్యవహరించాలని, ఓటరు జాబితాలో తమ పేరు నమోదైందో లేదో స్వయంగా ధృవీకరించుకోవాలని సూచించారు. పేరు నమోదు కాని వారు వెంటనే దరఖాస్తు చేసుకుని ఓటు హక్కును వినియోగించుకునే అవకాశాన్ని కోల్పోకుండా చూసుకోవాలని హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి, డా. చిరుమిల్ల రాకేష్ కోరారు. ఈ కార్యక్రమంలో బండ శ్రీనివాస్, తక్కలపల్లి రాజేశ్వరరావు, పింగళి రమేష్, గందె శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## రూ.5 లక్షలతో సీసీ రోడ్డు పనులకు శ్రీకారం



**మల్లాపూర్, (సింగిడి):** కోరుట్ల ఎమ్మెల్యే డా. కల్వకుంట్ల సంజయ్ ప్రత్యేక కృషితో మంజూరైన రూ.5 లక్షల విలువైన సీసీ రోడ్డు నిర్మాణ పనులను మల్లాపూర్ మండలం రాఘవపేటలో సర్పంచ్ తోట శ్రీనివాస్ ప్రారంభించారు. 2వ వార్డులో ఆకుల చిన్నయ్య గల్లీ నుండి నల్ల గణేష్ ఇంటివరకు, అలాగే 8వ వార్డులో గాండ్ల మల్లయ్య ఇంటి నుండి గడ్డం సాయిరెడ్డి ఇంటి వరకు సీసీ రోడ్ల నిర్మాణానికి గ్రామ ప్రజల తరఫున ఎమ్మెల్యేను కోరగా, వెంటనే స్పందించి ఈజీఎస్ నిధుల నుంచి రూ.5 లక్షలు మంజూరు చేయించారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ మద్దెల నర్సయ్య, పంచాయతీ కార్యదర్శి మోహన్ నాయక్, వార్డు సభ్యులు దాసరి భారతి మనోజ్, మామిడి లక్ష్మి నర్సయ్య, బీఆర్ఎస్ నియోజకవర్గ నాయకులు బైరి రవికుమార్ యాదవ్, నాయకులు పుప్పాల వినోద్, ఆకుల గంగారెడ్డి, ఆకుల మహిపాల్, శశికుమార్, చిన్నయ్య, బండి కుమారస్వామి, గజ్జ రవి, కమ్మల శంకర్, ముండం గంగారెడ్డి, కారోబార్ రంజిత్, 8వ వార్డు మహిళలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## కన్న రుణం తీర్చుకున్న... కూతురు

**తండ్రి చితికి నిప్పు పెట్టిన చిన్నకూతురు ప్రీతి**



**జమ్మికుంట, (సింగిడి):** అల్లారుముద్దుగా పెంచి పెద్ద చేసిన కన్న కూతురు తండ్రి అకాల మృత్యువాత పడటంతో బాధాతప్తమైన హృదయంతో తండ్రి చితికి నిప్పు పెట్టి కన్నరుణం తీర్చుకుంది ఓ కూతురు. జమ్మికుంట పట్టణంలోని హౌసింగ్ బోర్డు కాలనీలో నివసించే కేబుల్ ఆపరేటర్ దాసరి రామ్మూర్తి గౌడ్ ఆర్థిక ఇబ్బందులను తట్టుకోలేక ఆత్మహత్యకు పాల్పడ్డారు. రామ్మూర్తి మృతితో ఆయన భార్య సుజాత, ఇద్దరు కుమార్తెలు కన్నీరుమున్నీరయ్యారు. తండ్రి మరణాన్ని తట్టుకోలేక విలవిలలాడుతూ కూడా చిన్న కుమార్తె సాయి ప్రీతి చితికి నిప్పంటించి అంత్యక్రియలు నిర్వహించడం అక్కడున్న ప్రతి ఒక్కరిని కలిచివేసింది. ఈ హృదయవిదారక దృశ్యం చూసిన బంధువులు, గ్రామస్తులు భావోద్వేగానికి గురయ్యారు.

**త్వరలో ప్రజలకు అందుబాటులోకి**

## నూతన జిల్లా డిజిటల్ గ్రంథాలయం

**చివరి దశ పనులను పరిశీలించిన కమిషనర్ త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు ఆదేశం**

**నగరపాలక సంస్థ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్**



**కరీంనగర్, (సింగిడి):** పోటీ పరీక్షల అభ్యర్థులు, విద్యార్థులు, పాఠకుల సౌకర్యార్థం అత్యాధునిక సౌకర్యాలతో నిర్మిస్తున్న నూతన జిల్లా డిజిటల్ గ్రంథాలయ భవనాన్ని త్వరలో ప్రజల వినియోగానికి తీసుకువస్తామని నగరపాలక సంస్థ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ తెలిపారు. స్మార్ట్ సిటీ నిధులతో నిర్మిస్తున్న జిల్లా గ్రంథాలయ భవనాన్ని బుధవారం ఇంజినీరింగ్ అధికారులతో కలిసి ఆయన సందర్శించి, తుదిదశ నిర్మాణ పనులు, రంగుల పూత, రక్షణ కంచెల తదితర అభివృద్ధి పనులను పరిశీలించారు. మిగిలిన పనులను వేగంగా పూర్తి చేసి ప్రారంభోత్సవానికి అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. గ్రంథాలయంలో విద్యార్థులు, నిరుద్యోగ యువత, పాఠకులకు అనుకూలంగా అన్ని వసతులు కల్పించాలని, నాణ్యమైన ఫర్నిచర్ ఏర్పాటు చేసి ప్రశాంతమైన అధ్యయన వాతావరణాన్ని సిద్ధం చేయాలని సూచించారు. డిజిటల్ గ్రంథాలయాన్ని వీలైనంత త్వరగా ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. ఈ తనిఖీలో సహాయ ఇంజినీర్ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# జోన్3లో కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ అగ్రస్థానం

**తెలంగాణ రాష్ట్ర పోలీస్ క్రీడల్లో 11 పతకాలతో విశిష్ట ప్రతిభ: పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం**



**కరీంనగర్, (సింగిడి):** 5వ తెలంగాణ రాష్ట్ర పోలీస్ క్రీడలు–క్రీడోత్సవంలో కరీంనగర్ పోలీస్ కమిషనరేట్‌కు చెందిన అధికారులు, సిబ్బంది అత్యుత్తమ ప్రతిభ కనబరిచి మొత్తం 11 పతకాలు సాధించి జోన్–3లో అగ్రస్థానాన్ని దక్కించుకున్నారు. కమిషనరేట్ క్రీడాకారులు 2 స్వర్ణ, 4 రజత, 5 కాంస్య పతకాలు గెలుచుకుని విశేష ప్రతిభ కనబరిచారు.

**పతక విజేతలు:**

పీసీ పి. రాజు 90 కిలోల బాడీ బిల్డింగ్‌లో స్వర్ణ పతకం. ఏఆర్‌పీసీ ఎస్. నరేందర్ 85 కిలోల బాడీ బిల్డింగ్‌లో రజత పతకం.
పీసీ ఎం.డి. వహాజుద్దీన్ 80 కిలోల బాడీ బిల్డింగ్‌లో రజత పతకం. ఏఆర్‌పీసీ ఎ. శంకర్ యోగా విభాగంలో స్వర్ణ పతకం. ఏఆర్‌పీసీ వి. సాయి మాధవ్, ఆర్మ్ రెజ్లింగ్‌లో రజత, 55 కిలోల బాక్సింగ్‌లో కాంస్య పతకం. పీసీ జె. శ్రీనివాస్ 81 కిలోల జూడోలో కాంస్య పతకం. డబ్ల్యూపీసీ ఎ. స్వప్న 65 కిలోల ఆర్మ్ రెజ్లింగ్‌లో రజత పతకం. డబ్ల్యూపీసీ ఎం. అరుణ 77 కిలోల బాక్సింగ్, వెయిట్‌లిఫ్టింగ్, పవర్‌లిఫ్టింగ్ విభాగాల్లో మూడు కాంస్య పతకాలు సాధించారు.
జోన్–3 పతకాల పట్టికలో కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ 11 పతకాలతో తొలి స్థానంలో నిలవగా, సిద్ధిపేట కమిషనరేట్ 5, రాజన్న సిరిసిల్ల 3, కామారెడ్డి 2, మెదక్ 2 పతకాలు సాధించాయి. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం, ఐపీఎస్ పతక విజేతలను అభినందించారు. విధి నిర్వహణతో పాటు క్రీడల్లోనూ రాణించడం పోలీసు సిబ్బందికి ఆదర్శమని పేర్కొన్నారు. క్రమశిక్షణ, శారీరక దృఢత్వం, నిరంతర సాధనతోనే ఈ విజయాలు సాధ్యమవుతాయని తెలిపారు. రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో మరింత ప్రతిభ కనబర్చి కమిషనరేట్‌కు మరిన్ని విజయాలు తీసుకురావాలని ఆకాంక్షించారు.

# కార్మిక భవన్ నిర్మాణానికి కృషి చేస్తాం..

**ఎలక్ట్రికల్ కార్మికుల సంఘ భవనానికి స్థలం కేటాయించాలని వినతి**
**కార్మికుల సమస్యల పరిష్కారానికి అండగా ఉంటాం**
**డిప్యూటీ మేయర్ సునీల్‌రావు**



**కరీంనగర్, (సింగిడి):** కరీంనగర్ సెంట్రల్ ప్రైవేట్ ఎలక్ట్రికల్ వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, కరీంనగర్ నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్, మాజీ మేయర్ యాదగిరి సునీల్ రావును కలిసి సంఘ భవన నిర్మాణానికి తగిన స్థలం కేటాయించాలని వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘ ప్రతినిధులు మాట్లాడుతూ, ప్రైవేట్ ఎలక్ట్రికల్ కార్మికులు సంఘంగా ఏర్పడి సభ్యుల సహకారంతో కార్యాలయ అద్దెతో పాటు ఇతర ఖర్చులను భరిస్తున్నామని తెలిపారు. పెరుగుతున్న వ్యయభారాన్ని దృష్టిలో ఉంచుకుని సొంత సంఘ భవనం నిర్మించుకోవాలని నిర్ణయించామని, అందుకు అవసరమైన స్థలం కేటాయించి సహకరించాలని కోరారు. వినతిపై స్పందించిన యాదగిరి సునీల్ రావు మాట్లాడుతూ, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ మార్గదర్శకత్వంలో కరీంనగర్‌లో అన్ని కార్మిక సంఘాలకు ఉపయోగపడే విధంగా కార్మిక భవన్ నిర్మాణానికి కృషి చేస్తున్నామని తెలిపారు. భవన నిర్మాణానికి అవసరమైన స్థలం కేటాయింపుతో పాటు నిర్మాణం పూర్తయ్యే వరకు బాధ్యతగా వ్యవహరిస్తామని హామీ ఇచ్చారు. కార్మికుల సంక్షేమమే తమ లక్ష్యమని పేర్కొన్న ఆయన, ఉద్యోగ భవిష్య నిధి (ఈపీఎఫ్), ఉద్యోగుల రాష్ట్ర బీమా (ఈఎస్ఐ) వంటి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని అన్నారు. కార్మికులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా తమను నేరుగా సంప్రదించవచ్చని, వారి హక్కుల పరిరక్షణ, సంక్షేమం కోసం ఎల్లప్పుడూ అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు దువ్వాసి రాజబాబు, ఉపాధ్యక్షుడు కయ్యం పాపయ్య, ప్రధాన కార్యదర్శి బషీర్ మహమ్మద్, సంయుక్త కార్యదర్శి పింగిలి మహేష్, ఖజాంచి కయ్యం నాగరాజు, కార్యవర్గ సభ్యులు పెండ్యాల అనిల్ రెడ్డి, నాయిని గంగారెడ్డి, ఒల్లాల రవి తదితరులు పాల్గొన్నారు.

# మూగ జీవం... ప్రసవ వేదన..

**సకాలంలో వైద్య సేవలు అందించిన ప్రశాంత్ కుమార్**
**గో మాతలను సంరక్షించాలి... మున్సిపల్ చైర్మన్**



**జమ్మికుంట, (సింగిడి):** ప్రసవ వేదన అనుభవిస్తున్న ఓ గోవును సంరక్షించడమే కాకుండా పశువైద్యాధికారి రాజ్ కుమార్ పర్యవేక్షణలో గోవుకు ప్రసవం చేసి తల్లి బిడ్డను కాపాడి మానవత్వం చాటుకున్నాడు మున్సిపల్ చైర్మన్ ప్రశాంత్ కుమార్. జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని పాత మున్సిపల్ కార్యాలయం వద్ద ఓ గోవు ప్రసవంతో ఇబ్బంది పడుతుండగా అటుగా వెళుతున్న చైర్మన్ ప్రశాంత్ కుమార్ గమనించి దానిని సంరక్షించాడు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోవుల యజమానులు తమ ఆవులను రోడ్లపై వదిలివేయడంతో రాత్రివేళలా ఇబ్బంది కలగడమే కాకుండా ట్రాఫిక్కు తీవ్ర అంతరాయం కలుగుతుందని పేర్కొన్నాడు. గోవు యజమానులు వాటిని ఇంటి వద్దనే సంరక్షించే బాధ్యతను తీసుకోవడంతోపాటు బయటికి రాకుండా చూసుకోవాలని సూచించారు. వారం రోజుల్లో ఆవుల యజమానులు అందరూ రోడ్డుపై తిరుగుతున్న వాటిని సంరక్షించుకోవాలని అలా కాకుండా రోడ్లపైనే గోవులను వదిలివేస్తే యజమానులపై మున్సిపల్ చట్టాల ప్రకారం శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

### శభాష్ చైర్మన్... అభినందించిన పట్టణ ప్రజలు



బుధవారం ఒక మూగ జీవి ప్రసవ ఆవేదనను అర్థం చేసుకొని సకాలంలో పశువైద్యాధికారి చేత వైద్యం అందించి ఆ గోమాతను రక్షించిన మున్సిపల్ చైర్మన్ ప్రశాంత్ కుమార్ ను పట్టణ ప్రజలు అభినందించారు. నూతన చైర్మన్గా బాధ్య తలు స్వీకరించిన ప్రశాంత్ కుమార్ పట్టణ అభి వృద్ధి తో పాటు మానవత్వంతో ఒక మూగజీవి ప్రసవ ఆవేదనను అర్థం చేసుకొని దానికి సేవ లందించడం ఆయన మానవత్వానికి నిలువెత్తు నిదర్శనమని కొనియాడారు. సకాలంలో వైద్య సేవలు అందించిన పశు వైద్యాధికారి రాజకుమార్ ను కూడా ప్రజలు అభినందించారు.

# పోక్సో నిందితులను నడి రోడ్డుపై ఉరితీయాలి: ఆకినపల్లి శిరీష

**అంబేద్కర్ చౌరస్తాలో స్వేరోస్ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ**




**హుజురాబాద్, (సింగిడి):** రాష్ట్రంలో చిన్నారులు, మహిళలపై జరుగుతున్న అత్యాచా రాలు, హత్యలు వంటి అమానుష ఘటనలను అరికట్టేందుకు ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని, పోక్సో కేసుల్లో దోషులుగా తేలిన నిందితులకు అత్యంత కఠిన శిక్షలు అమలు చేయాలని స్వేరోస్ రాష్ట్ర నాయకురాలు ఆకినపల్లి శిరీష డిమాండ్ చేశారు. ఈ మేరకు హుజురాబాద్ అంబేద్కర్ చౌరస్తాలో స్వేరోస్ ఆధ్వర్యంలో మానవహారం నిర్వహించి, అనంతరం నిరసన ర్యాలీ చేపట్టారు. ఆకినపల్లి శిరీష మాట్లాడుతూ, 9 నెలల పసికందు నుంచి వృద్ధ మహిళల వరకు ఎవరూ సురక్షితంగా లేని పరిస్థితులు నెలకొన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళలు, చిన్నారులపై లైంగిక దాడులు, హత్యలకు పాల్పడే నిందితులపై చట్టపరంగా అత్యంత కఠిన చర్యలు తీసుకోవాలని, ఇలాంటి నేరాలు పునరావృతం కాకుండా ప్రభుత్వం సమర్థవంతమైన చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమానికి ప్రజాసంఘాల నాయకులు, బీసీ సంఘాల నాయకులు, వివిధ రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు పెద్ద ఎత్తున హాజరై సంఘీభావం తెలిపారు. ముఖ్య అతిథులుగా మాజీ ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ బండ శ్రీనివాస్, బీసీ సిటిజన్ ఫోరం అధ్యక్షుడు జనార్దన్, జేఏసీ అధ్యక్షుడు సందెల వెంకన్న, డీసీ జేఏసీ కార్యదర్శి చిలకమారి శ్రీనివాస్, హుజురాబాద్ మున్సిపల్ కౌన్సిలర్ గందె శ్రీనివాస్ రాధిక, మాజీ జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ తక్కలపల్లి రాజేశ్వరరావు, కేడీసీసీ బ్యాంకు వైస్ చైర్మన్ పింగిలి రమేష్ పాల్గొన్నారు. అదేవిధంగా ప్రజాసంఘాల నాయకులు ఇప్పకాయల సాగర్, స్వేరోస్ సీనియర్ నాయకులు గడప రాజు, మేకల రవీందర్, దేవసాని ప్రియదర్శిని, ప్రవీణ్, క్రాంతి, సొల్లు బాబు, శోభ, ఎండి బాబర్, ఎండి ఫరీదా, వాగ్దేవి తదితరులతో పాటు ప్రభుత్వ డిగ్రీ, ఇంటర్ కళాశాలల విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## విద్యార్థుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

**మున్సిపల్ చైర్పర్సన్ నాగలక్ష్మి రాజేష్**




**ధర్మపురి, (సింగిడి):** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థు లకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన పోషకాహారం అం దించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని ధర్మపురి మున్సిపల్ చైర్‌పర్సన్ వేముల నాగలక్ష్మి రాజేష్ అన్నారు. పట్టణంలోని మైనారిటీ పాఠశాలలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో 5వ తరగతి విద్యార్థులకు నూతన భోజన ప్లేట్లను ఆమె పంపిణీ చేశారు. అనంతరం తెలంగాణ రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఆదేశాల మేరకు పాఠశాలను పరిశీలించారు. ఉపాధ్యాయుల హాజరు నమోదును తనిఖీ చేయడంతో పాటు విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం నాణ్యత, భోజనశాల పరిశుభ్రతను పరిశీలించారు. విద్యార్థులకు ప్రతిరోజూ పరిశుభ్రమైన, పోషకాహారంతో కూడిన నాణ్యమైన భోజనం అందేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. చైర్‌పర్సన్ మాట్లాడుతూ, విద్యార్థుల విద్య, ఆరోగ్యం, సంక్షేమానికి సంబంధించిన ఏ సమస్య వచ్చినా రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ సహకారంతో పరిష్కరిస్తామని తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తు బలోపేతానికి ప్రభుత్వం అవసరమైన అన్ని సౌకర్యాలను కల్పిస్తోందని పేర్కొన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థుల పట్ల ప్రేమ, బాధ్యతతో వ్యవహరిస్తూ వారికి మెరుగైన విద్యా వాతావరణాన్ని కల్పించాలని సూచించారు. ప్రతి విద్యార్థి ఆరోగ్యంగా, ఆనందంగా చదువుకునే పరిస్థితులు కల్పించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు షూలు పంపిణీ



**అమరచింత, (సింగిడి):** అమరచింత పట్టణంలోని దేశాయి మురళీధర్‌రెడ్డి ప్రాథమిక ప్రభుత్వ పాఠశాలలో బుధ వారం పాఠశాల నిర్మాణదాత దేశాయి ప్రకాష్‌రెడ్డి మురళీ ధర్ రెడ్డి ట్రస్టు ఆధ్వర్యంలో విద్యార్థిని విద్యార్థులకు షూలు పంపిణీ చేశారు. మురళీధర్ రెడ్డి ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రత్యేక పాఠశాలలోని మొత్తంవిద్యార్థిని విద్యార్థులకు ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు ప్రకాష్రెడ్డి సేవా సమితి అధ్యక్షులు కలంపాష తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానో పాధ్యాయురాలు పద్మమ్మ, ఉపాధ్యాయులు సుధా, జ్యోతి, శ్రీలత, బాలమణి, షకీలా పాల్గొన్నారు.

# 'ఎస్ఐఆర్'ను పకడ్బందీగా పూర్తి చేయాలి : ఆర్డీఓ



**ధర్మపురి, (సింగిడి):** రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు చేపడుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్)--2026 కార్యక్రమాన్ని నిర్దేశిత గడువులోగా పకడ్బందీగా పూర్తి చేయాలని 022 ధర్మపురి (ఎస్సీ) అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికల రిజిస్ట్రేషన్ అధికారి, మెట్ పల్లి రెవెన్యూ డివిజనల్ అధికారి సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం ధర్మపురి తహసీల్దార్ కార్యాలయంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో కార్యక్రమం పురోగతిపై సవివరంగా చర్చించారు. ఎస్ఐఆర్--2026 కార్యక్రమం ద్వారా ఓటరు జాబితాను మరింత పారదర్శకంగా, ఖచ్చితత్వంతో రూపొందించడమే లక్ష్యమని సమావేశంలో వివరించారు. ఇందుకోసం ప్రతి ఇంటిని సందర్శించి గణన పత్రాల (ఎన్యూమరేషన్ ఫారాలు) సేకరణ, వాటి పరిశీలన, డిజిటైజేషన్ ప్రక్రియను వేగవంతంగా చేపట్టాలని అధికారులకు సూచించారు. ఇప్పటివరకు నమోదైన పురోగతిని సమీక్షిస్తూ, మిగిలిన పనులను ప్రణాళికాబద్ధంగా పూర్తి చేయాలని తెలిపారు. గణన పత్రాల సేకరణలో వెనుకబడిన పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆర్డీఓ ఆదేశించారు. ఆయా కేంద్రాలకు చెందిన బూత్ లెవల్ అధికారులు (బీఎల్వోలు), బూత్ లెవల్ ఏజెంట్లు (బీఎల్ఏలు) పరస్పర సమన్వయంతో పనిచేసి ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వివరాలను సేకరించాలని సూచించారు. సేకరించిన గణన పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించి, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా డిజిటైజేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని స్పష్టం చేశారు. ఓటరు జాబితాలో అర్హులైన ప్రతి ఓటరికి స్థానం కల్పించడంతో పాటు అనర్హుల పేర్లను తొలగించే ప్రక్రియను ఎన్నికల సంఘం నిబంధనలకు అనుగుణంగా నిర్వహించాలని సూచించారు. కార్యక్రమం విజయవంతం కావడంలో రాజకీయ పార్టీల సహకారం కూడా కీలకమని పేర్కొంటూ, బీఎల్ఏలు క్షేత్రస్థాయిలో చురుకుగా పనిచేసి ఎన్నికల యంత్రాంగానికి సహకరించాలని కోరారు. సమావేశంలో ధర్మపురి తహసీల్దార్ శ్రీనివాస్ తో పాటు అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని వివిధ మండలాల తహసీల్దార్లు, ఎన్నికల శాఖ అధికారులు, గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొని, ప్రత్యేక సవరణ కార్యక్రమంపై తమ అభిప్రాయాలను వెల్లడించారు. సమావేశంలో అధికారులు పలు సందేహాలకు సమాధానాలు ఇచ్చి, కార్యక్రమం అమలుకు సంబంధించి తీసుకోవాల్సిన చర్యలను వివరించారు.

**పర్యావరణ పరిరక్షణ**

# ప్రతిఒక్కరి బాధ్యత

**వనమహోత్సవంలో భాగంగా 22వ డివిజన్‌లో ఉచిత మొక్కల పంపిణీ**

**నగర మేయర్ కొలగాని శ్రీనివాస్**



**కరీంనగర్, (సింగిడి):** నగరంలోని 22వ డివిజన్ హిందూపురి కాలనీ సమీపంలో వనమహోత్సవం సందర్భంగా స్థానిక కార్పొరేటర్ బండ రమణ రెడ్డి ఆధ్వర్యంలో, నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ అధ్యక్షతన డివిజన్ ప్రజలకు ఉచిత మొక్కలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మేయర్ కొలగాని శ్రీనివాస్ కాలనీ వాసులతో కలిసి మొక్కలు నాటి, పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. నగరాన్ని మరింత పచ్చదనంతో తీర్చిదిద్దేందుకు ప్రతి కుటుంబం కనీసం ఒక మొక్కను నాటి, దానిని సంరక్షించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో హిందూపురి కాలనీ కమిటీ అధ్యక్షుడు దామోదర్ రెడ్డి, కార్యదర్శి మహేందర్, స్థానిక ప్రజాప్రతినిధులు, కాలనీ వాసులు, ప్రజలు పాల్గొన్నారు.

## బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ప్రశాంత్




**జమ్మికుంట (సింగిడి):** హైదరాబాద్ లోని బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర కార్యలయంలో బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఇబ్రాం శేఖర్ అధ్యక్షతన స్టేట్ ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశం జరిగింది. ఈసమావేశానికి ముఖ్యఅతిధులుగా బీఎస్పీ సెంట్రల్ కోఆర్డినేటర్ అతార్ సింగ్ రావు, విశిష్ట అతిధిగా సెంట్రల్ కోఆర్డినేటర్ సురేష్ ఆర్య గారు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధిగా పాల్గొన్న అతార్ సింగ్ రావు రాష్ట్ర కమిటీ సమావేశంలో బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పల్లె ప్రశాంత్ ని ప్రకటించారు. ఈ సందర్భంగా అతార్ సింగ్ గారు మాట్లాడుతూ బహుజన్ సమాజ్ పార్టీ అధినేత్రి, యూపీ మాజీ ముఖ్యమంత్రి బెహన్ జీ మాయావతి గారి ఆదేశానుసారం యువతకు పార్టీలో విస్తృత అవకాశాలు కల్పించాలని గుర్తుచేశారు. ఆ క్రమంలోనే గత కొన్ని సంవత్సరాలుగా బీఎస్పీ పార్టీలో అంకితభావంతో పనిచేస్తున్న పల్లె ప్రశాంత్ ప్రత్యేకంగా అభినందించారు. బీఎస్పీ పార్టీ బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, ఇతర కులాల్లోని పేద ప్రజల సంక్షేమం కోసం అనేక సంవత్సరాలు మాయావతి గారి నాయకత్వం లో పనిచేస్తుందని గుర్తుచేశారు. ఓబీసీ వర్గాలను, యువకులను, విద్యావంతులను పార్టీకి జోడించబంలో పల్లె ప్రశాంత్ కృషి చేయాలని ఉపేదేశించారు. తెలంగాణ బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమించబడిన పల్లె ప్రశాంత్ ని రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీరాం కృష్ణ, జోన్ చీఫ్ ఇంచార్జులు దాగిల్ల దయానందరావు, నిషాని రామచంద్రం, బోడపట్ల ఈశ్వర్ లు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ రాష్ట్ర కమిటీ సభ్యులు, జోన్ ఇంచార్జులు, పార్లమెంట్ ఇంచార్జులు, కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు నల్లాల శ్రీనివాస్, హన్మకొండ జిల్లా అధ్యక్షుడు అంబాల ప్రశాంత్ మరియు పలు జిల్లాల అధ్యక్షులు పాల్గొన్నారు.

## వరుణుడి కటాక్షం కోసం.. జలాభిషేకం



**జమ్మికుంట, (సింగిడి):** వరుణ దేవుని కృపా కటాక్షం కోసం మహిళలు పెద్ద మొత్తంలో జలాభిషేకం నిర్వ హించారు. కరీంనగర్ జిల్లా జమ్మికుంట మండలంలోని వెంకటేశ్వర పల్లి గ్రామపంచాయతీ పరిధిలోగల గోవిందా పూర్ గ్రామానికి చెందిన మహిళలు వరుణ దేవుని కృపా కటాక్షం లేకపోవడం వల్ల పంటలు ఎండిపోతున్నాయని భావించి ప్రతి ఇంటి నుండి నీళ్లను తీసుకొని వచ్చి నవగ్రహా లతో పాటు పోచమ్మ తల్లి దేవాలయంలో జలాభిషేకం నిర్వహించారు. వరుణుడు కరుణించి వర్షం కురిపించాలని కోరుతూ ప్రత్యేక పూజలు మొక్కలు చెల్లించుకున్నారు.

## రైలు కిందపడి కేబుల్ ఆపరేటర్ ఆత్మహత్య



**జమ్మికుంట, (సింగిడి):** జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని హౌసింగ్ బోర్డ్ కాలనీలో నివాసం ఉంటున్న దాసరి రామ్మూర్తి గౌడ్(48) అనే వ్యక్తి రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం గత కొద్ది మాసాల నుండి కుటుంబ సమస్యల వల్ల బాధపడుతూ తీవ్ర మనస్తాపం చెందారని ఈ తరుణంలో ఆ బాధ తట్టుకోలేక రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. కేబుల్ ఆపరేటర్ మృతి చెందడంతో పెద్ద మొత్తంలో కేబుల్ ఆపరేటర్స్ సంతాపం వ్యక్తం చేశారు. మృతుడికి భార్య ఇద్దరు అమ్మాయిలు ఉన్నారు.

ప్రభాతనవ
సింగిడి తెలుగు దినపత్రిక
సింగిడి
ప్రతి రంగూ ఓ నిజం
Singidi
సోమవారం
20-7-2026

# జాతీయ ఒలింపియాడ్‌లో అల్ఫోర్స్ విద్యార్థికి బంగారు పతకం

విజేతలను అభినందించిన అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి. నరేందర్ రెడ్డి



**కరీంనగర్, (సింగిడి):** కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఈ–టెక్నో పాఠశాల విద్యార్థులు జాతీయస్థాయి తార్కిక నైపుణ్య (లాజికల్ రీజనింగ్) ఒలింపియాడ్‌లో ప్రతిభ కనబరి చారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అభినం దన కార్యక్రమంలో అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి. నరేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని విజేతలను సత్కరించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థులకు తరగతి గదిలో బోధించే అంశాలపై లోతైన అవగాహన పెంపొందితే పోటీ పరీక్షల్లో మెరుగైన విజయాలు సాధించగలరని అన్నారు. చిన్న వయస్సు నుంచే విశ్లేషణాత్మక ఆలోచన, విషయాలపై స్పష్టమైన అవగాహన కల్పించడం ద్వారా ఉన్నత లక్ష్యాలను చేరుకునే సామర్థ్యం పెరుగుతుందని పేర్కొన్నారు. పాఠశాల వార్షిక ప్రణాళికలో భాగంగా నిర్వహించిన జాతీయ తార్కిక నైపుణ్య ఒలింపియాడ్‌లో 9వ తరగతి విద్యార్థి ఎన్. సహర్ష్ బంగారు పతకంతో పాటు రూ. 1,000 నగదు బహుమతి గెలుచుకోగా, 8వ తరగతి విద్యార్థి జి. సహాంశ్ ప్రశంసాపత్రం అందుకున్నాడు. విజేతలకు పుష్పగుచ్ఛాలు అందజేసి, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని డాక్టర్ నరేందర్ రెడ్డి ఆకాంక్షించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## జర్నలిస్టుల సమస్యలు వెంటనే పరిష్కరించాలి

కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించిన టిడబ్ల్యూజేఎఫ్ సంఘం



**కరీంనగర్,(సింగిడి):** జర్నలిస్టుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ (టిడబ్ల్యూజేఎఫ్) జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. సోమవారం కరీంనగర్ జిల్లా కలెక్టరేట్ ఎదుట టిడబ్ల్యూజేఎఫ్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి, అనంతరం జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రాకు వినతిపత్రం సమర్పించింది. ఈ సందర్భంగా టిడబ్ల్యూజేఎఫ్ జిల్లా అధ్యక్షుడు కొమ్మెర తిరుపతి రెడ్డి, జిల్లా నాయకుడు బండోజు శ్రీకాంత్ మాట్లాడుతూ, పనిచేస్తున్న జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు కేటాయించి, అర్హులైన పేద జర్నలిస్టులకు గృహ నిర్మాణ సహాయం అందించాలని కోరారు. సంక్షేమానికి కృషి చేస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వం ఇప్పటికీ ఇళ్ల స్థలాల సమస్యను పరిష్కరించకపోవడం నిరాశ కలిగిస్తోందన్నారు. తక్కువ వేతనాలతో విధులు నిర్వహిస్తున్న జర్నలిస్టులను ప్రభుత్వం ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. కరీంనగర్ జిల్లాలో వివిధ పత్రికల్లో పనిచేస్తున్న పలువురు జర్నలిస్టులకు గుర్తింపు కార్డులు పెండింగ్‌లో ఉన్నాయని పేర్కొన్నారు, అర్హులైన వారందరికీ గుర్తింపు కార్డులు, ఆరోగ్య కార్డులు వెంటనే మంజూరు చేయాలని కలెక్టర్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో జయేందర్, రమణ, శ్రీనివాస్, సతీష్, అరవింద్, సంపత్, రవీందర్, ప్రవీణ్ రెడ్డి, శాంతికుమార్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

## హుజూరాబాద్‌లో నులిపురుగుల నిర్మూలన దినోత్సవం



**హుజూరాబాద్, (సింగిడి):** హుజూరాబాద్ పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత బాలికల పాఠశాలలో సోమవారం జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. "ఒక చిన్న మాత్ర... పిల్లల ఆరోగ్యానికి గొప్ప రక్షణ", "నులిపురుగుల నివారణ మాత్ర ప్రతి చిన్నారి హక్కు -- ప్రతి తల్లిదండ్రుల బాధ్యత" అనే సందేశంతో కార్యక్రమాన్ని నిర్వహించిన విద్యార్థులు, తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హుజూరాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ రొంటాల సుహాసిని హాజరై, జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా 1 నుంచి 19 సంవత్సరాల వయస్సు గల పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేసి, స్వయంగా వేయించారు. ప్రతి చిన్నారి ఆరోగ్యంగా ఎదగాలంటే నులిపురుగుల నివారణ అత్యంత అవసరమని ఆమె పేర్కొన్నారు. అధికారులు మాట్లాడుతూ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా 1 నుంచి 19 సంవత్సరాల వయస్సు గల పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలను ఉచితంగా అందజేస్తున్నట్లు తెలిపారు. తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ పిల్లలకు తప్పనిసరిగా మాత్ర వేయించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీటీసీఓ విమలిందు, డిప్యూటీ డీఎంహెచ్ఓ ప్రభుదాస్, జిల్లా పరిషత్ ఉన్నత బాలికల పాఠశాల ప్రధానోపాధ్యాయులు తిరుమల, సీడీపీఓ సుగుణ, మున్సిపల్ కౌన్సిలర్లు సునీత, శ్రీలేఖ, వైద్య సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## సిఎం రేవంత్ రెడ్డిపై పోలీసులకు బీఆర్ఎస్ ఫిర్యాదు

రాజకీయ వ్యాఖ్యలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి

బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జి.వి. రామకృష్ణరావు



**కరీంనగర్, (సింగిడి):** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇటీవల బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు, మాజీ మంత్రులు తన్నీరు హరీష్ రావు, కె.టి. రామా రావుపై చేసిన వ్యాఖ్యలు అనుచితమైనవి, రెచ్చగొట్టే స్వభావం కలిగినవని ఆరోపిస్తూ బీఆర్ఎస్ నాయకులు సోమవారం కరీంనగర్ టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జి.వి. రామకృష్ణ రావు, నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్, కేడీసీసీ బ్యాంకు ఉపాధ్యక్షుడు పింగిలి రమేష్, బీఆర్ఎస్‌వీ నాయకుడు పొన్నం అనిల్ కుమార్ కలిసి ఈ ఫిర్యాదు సమర్పించారు. రాజ్యాంగబద్ధమైన ముఖ్య మంత్రి పదవిలో ఉన్న వ్యక్తి రాజకీయ ప్రత్యర్థులపై వ్యక్తిగత దూషణలు, అవమానకర వ్యాఖ్యలు చేయడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని వారు పేర్కొన్నారు. ఇటువంటి వ్యాఖ్యలు ప్రజల్లో విద్వేషాన్ని రెచ్చగొట్టే అవకాశం ఉండటంతో పాటు శాంతిభద్రతలకు భంగం కలిగించే ప్రమాదం ఉందని తెలిపారు. భారతీయ న్యాయ సంహిత--2023 లోని సంబంధిత నిబంధనల ప్రకారం కేసు నమోదు చేసి, చట్టం ముందు అందరూ సమానమే అన్న సూత్రానికి అనుగుణంగా నిష్పాక్షికంగా విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు. ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాల్సిన ముఖ్యమంత్రి రాజకీయాల్లో హుందాతనం, బాధ్యతాయుతమైన భాషను పాటించాలని బీఆర్ఎస్ నాయకులు పేర్కొంటూ, తమ ఫిర్యాదుపై పోలీసులు నిష్పాక్షికంగా స్పందించి చట్టపరమైన చర్యలు తీసుకుంటారని ఆశాభావం వ్యక్తం చేశారు.

# ప్రజావాణి దరఖాస్తులను సత్వరం పరిష్కరించాలి

రెడ్‌క్రాస్ సభ్యత్వ నమోదు వేగవంతం చేయాలి: కలెక్టర్ చిత్రా మిశ్రా



**కరీంనగర్, (సింగిడి):** కరీంనగర్ జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి, సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా అధికారులను ఆదేశించారు. అదనపు కలెక్టర్లు అశ్విని తానాజీ వాకడే, శ్రీనివాస్ రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి స్వామి, రెవెన్యూ డివిజనల్ అధికారి శర్మిలతో కలిసి కలెక్టర్ ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ప్రజావాణికి మొత్తం 170 దరఖాస్తులు రాగా, గృహ నిర్మాణ శాఖకు 59, కరీంనగర్ నగరపాలక సంస్థకు 50 దరఖాస్తులు అందినట్లు తెలిపారు. రాష్ట్ర గవర్నర్, ప్రధాన కార్యదర్శి ప్రత్యేక దృష్టి నేపథ్యంలో రెడ్‌క్రాస్ సభ్యత్వ నమోదును వేగవంతం చేయాలని జిల్లా అధికారులను ఆదేశించారు. సభ్యత్వ నమోదు లక్ష్యాన్ని ఇప్పటికే సాధించిన శాఖలను అభినందిస్తూ, మిగతా శాఖలు కూడా లక్ష్యాన్ని త్వరగా చేరుకోవాలని సూచించారు. ఇందిరమ్మ ఇళ్లు, ఇతర ప్రభుత్వ అభివృద్ధి పనులకు ఇసుక కొరత తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కారంతో పాటు ప్రభుత్వ పథకాల అమలును సమర్థంగా పర్యవేక్షించేందుకు ఉన్నతాధికారులు చేపట్టే నెలవారీ క్షేత్రస్థాయి పర్యటనల వివరాలను సమర్పించాలని సూచించారు. వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులకు అవగాహన కల్పించి ప్రత్యామ్నాయ పంటల సాగును ప్రోత్సహించాలని వ్యవసాయ శాఖ అధికారులకు సూచించారు. అలాగే గ్రామాలు, వార్డుల్లో పారిశుద్ధ్యం, కల్వర్టులు, రహదారులకు సంబంధించిన సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలని ఆదేశించారు. అవసరమైన సమస్యలను జిల్లా యంత్రాంగం దృష్టికి తీసుకువస్తే నిధులు మంజూరు చేసి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# విద్యాసంస్థల్లో డీ–వార్మింగ్ డ్రైవ్



**ధర్మపురి, (సింగిడి):** చిన్నారులను నులిపురుగుల బారిన పడకుండా కాపాడడంతో పాటు రక్తహీనత, పోషకాహార లోపం, శారీరక-- మానసిక ఎదుగుదలలో ఏర్పడే ఆటంకాలను నివారించే లక్ష్యంతో నిర్వహిస్తున్న జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా ధర్మపురి లో సోమవారం ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆల్బెండాజోల్ మాత్రల పంపిణీ కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహించారు. జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు మాత్రలు పంపిణీ చేయడంతో పాటు నులిపురుగుల నివారణ, వ్యక్తిగత పరిశుభ్రత, పోషకాహారంపై అవగాహన కల్పించారు. ధర్మపురి పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ వేముల నాగలక్ష్మి రాజేష్ ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులకు ఆల్బెండాజోల్ మాత్రలు పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ, చిన్నారుల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, ప్రతి విద్యార్థి తప్పనిసరిగా ఆల్బెండాజోల్ మాత్రను తీసుకోవాలని సూచించారు. నులిపురుగుల కారణంగా పిల్లల్లో రక్తహీనత, పోషకాహార లోపం, చదువుపై ఏకాగ్రత తగ్గడం వంటి సమస్యలు తలెత్తే అవకాశముందని పేర్కొన్నారు. అందుకే వైద్య సిబ్బంది సూచనల మేరకు ప్రతి చిన్నారి ఈ మాత్రను తీసుకోవాలని, తల్లిదండ్రులు కూడా ఈ కార్యక్రమానికి సహకరించాలని కోరారు. జిల్లా ఉపవైద్యాధికారి డాక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ, జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో లక్షిత వయస్సు గల పిల్లలకు ఆల్బెండాజోల్ మాత్రలు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఒకటి నుంచి 19 సంవత్సరాల వయస్సు గల పిల్లలు తప్పనిసరిగా ఈ మాత్రలను తీసుకోవడం ద్వారా నులిపురుగుల సమస్యను సమర్థవంతంగా నివారించవచ్చని చెప్పారు. కార్యక్రమానికి హాజరు కాలేని విద్యార్థులకు ప్రభుత్వం నిర్ణయించిన మాప్–అప్ డే రోజున కూడా మాత్రలు పంపిణీ చేస్తామని తెలిపారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు సహకరించి ప్రతి చిన్నారికి మాత్ర అందేలా చూడాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ దినేష్, వైద్యులు డాక్టర్ శివకుమారి, డాక్టర్ వినయ్, ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది, ఆర్‌బీఎస్‌కే బృందాలు, ధర్మపురి మున్సిపల్ వార్డు కౌన్సిలర్లు సంగి ఆనంద్, చి. రాజేష్, ఎం. ప్రశాంత్, ఎం. పవన్, ఆశా కార్యకర్తలు, విద్యార్థులు, డీ–వార్మింగ్ కార్యక్రమంలో పాల్గొన్న చిన్నారులు తదితరులు పాల్గొన్నారు. ధర్మపురి మండలం నక్కలపేట గ్రామ పరిధిలోని జెడ్పీ హెచ్ఎస్ నక్కలపేట, ఎస్ఎస్ మోడల్ స్కూల్, బీఎన్‌సీ గూడెం ప్రభుత్వ పాఠశాల, చిన్న నక్కలపేట ప్రభుత్వ పాఠశాల, దుబ్బల గూడెం ప్రభుత్వ పాఠశాలతో పాటు అంగన్‌వాడీ కేంద్రాల్లో కూడా ఆల్బెండాజోల్ మాత్రల పంపిణీ కార్యక్రమాలు నిర్వహించారు. ఏఎన్ఎం జయ విద్యార్థులకు మాత్రలు పంపిణీ చేసి నులిపురుగుల నివారణ ప్రాధాన్యతను వివరించారు. ప్రతి చిన్నారి ఆల్బెండాజోల్ మాత్రను తప్పనిసరిగా తీసుకోవడంతో పాటు చేతులు శుభ్రంగా కడుక్కోవడం, పరిశుభ్రమైన ఆహారం తీసుకోవడం, గోర్లు చిన్నగా ఉంచుకోవడం వంటి అలవాట్లను పాటించాలని సూచించారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

# రైతు బజార్ వద్ద ట్రాఫిక్‌కు చెక్..


ఎస్ఐ మల్లేశం చొరవ...రోడ్డు ఆక్రమణల తొలగింపు.. అంబులెన్స్‌లు, వాహనదారులకు ఊరట



**జగిత్యాల ప్రతినిధి, (సింగిడి):** జగిత్యాల పట్టణంలోని రైతు బజార్ ఎదుట రహదారిపై కూరగాయల విక్రయాలు జరగడం వల్ల నెలకొన్న తీవ్ర ట్రాఫిక్ సమస్యను పరిష్కరించేందుకు ట్రాఫిక్ ఎస్ఐ మల్లేశం సోమవారం ప్రత్యేక చర్యలు చేపట్టారు. రైతు బజార్ ముందు రహదారిపై రైతులు, వ్యాపారులు కూరగాయలు విక్రయించడంతో విద్యానగర్ వైపు వెళ్లే ప్రధాన రహదారిపై వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. ముఖ్యంగా అత్యవసర వైద్య సేవలకు వెళ్లే అంబులెన్స్‌లు, ఆసుపత్రులకు చేరుకునే రోగులు, ద్విచక్ర, నాలుగు చక్రాల వాహనదారులు నిత్యం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యపై స్పందించిన ట్రాఫిక్ ఎస్ఐ మల్లేశం సంఘటనా స్థలాన్ని పరిశీలించి, వార్డు కౌన్సిలర్ అరవ లక్ష్మి, మున్సిపల్ సిబ్బందితో కలిసి రహదారిపై వ్యాపారం చేస్తున్న రైతులతో మాట్లాడారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా రైతు బజార్ ఆవరణలోనే కూరగాయల విక్రయాలు నిర్వహించాలని వారికి అవగాహన కల్పించి, లోపలికి తరలించే చర్యలు చేపట్టారు. దీంతో రైతు బజార్ ముందు రహదారిపై ట్రాఫిక్ రద్దీ గణనీయంగా తగ్గి, విద్యానగర్ వైపు వాహనాల రాకపోకలు సజావుగా కొనసాగాయి. అత్యవసర సేవల కోసం వెళ్లే అంబులెన్స్‌లకు ఎలాంటి ఆటంకం లేకుండా మార్గం అందుబాటులోకి రావడంతో పాటు, ఆసుపత్రులకు వెళ్లే రోగులు, ప్రజలు, ఇతర వాహనదారులు కూడా ఊరట పొందారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది ట్రాఫిక్ పోలీసులతో కలిసి రహదారిని ఖాళీ చేయించి, రైతులకు రైతు బజార్‌లో కేటాయించిన స్థలాల్లోనే వ్యాపారం నిర్వహించాలని సూచించారు. ఈ సందర్భంగా వార్డు కౌన్సిలర్ అరవ లక్ష్మి మాట్లాడుతూ, "రైతుల ప్రయోజనాలను కాపాడుతూ ప్రజలకు ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా చూడటం అందరి బాధ్యత. నిజమైన రైతులకు రైతు బజార్‌లో సక్రమంగా స్థలాలు కల్పించి, రహదారులపై వ్యాపారాలు జరగకుండా సంబంధిత శాఖలు నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలి" అని అన్నారు. ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టిన ట్రాఫిక్ ఎస్ఐ మల్లేశాన్ని స్థానికులు అభినందించారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి చర్యలు కొనసాగించి రైతు బజార్ పరిసరాల్లో ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించాలని ప్రజలు కోరారు. ఈ కార్యక్రమంలో ఏఎస్సై రవీందర్ రావు, పీసీలు నరేందర్, నవీన్, మహేష్, హోం గార్డ్ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# నీటి సంరక్షణ... భవిష్యత్ తరాలకు రక్షణ

జల ప్రతిజ్ఞ చేయించిన చైర్మన్ ప్రశాంత్ కుమార్





**జమ్మికుంట (సింగిడి):** నీటి సంరక్షణ చేయడం వల్ల భవిష్యత్ తరాలకు ఎంతో గాను ఉపయోగపడతాయని అది ప్రతి ఒక్కరు బాధ్యతగా గుర్తుంచుకోవాలని మున్సిపల్ చైర్మన్ ప్రశాంత్ కుమార్ అన్నారు. జమ్మికుంట పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో సోమవారం నీటి సంరక్షణ పై చైర్మన్ ప్రశాంత్ ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నీటిని పొదుపుగా వాడడంతో పాటు అవసరమైనంత వరకు మాత్రమే వినియోగించుకోవాలని ప్రతి చుక్కను సంరక్షించి జల్ శక్తి అభియాన్ వర్షాన్ని పట్టుకోండి అనే ప్రచారాన్ని ప్రోత్సహించాలని కోరారు. నీటిని ఒక వనరుగా భావించి దానిని అవసరాలకు అనుగుణంగా ఉపయోగించుకోవడంతోపాటు వృధా చేయకుండా ఉండాలని ప్రతి ఒక్కరికి నీటి యొక్క ఉపయోగాలను తెలియజేయాలని కోరారు. ప్రతి ఒక్కరు నీటిని సంరక్షించే బాధ్యతను ఒక ఉద్యమంగా భావించి ముందుకు సాగాలని ప్రస్తుత పరిస్థితుల్లో నీటిని పొదుపుగా వినియోగించుకోవాలని సూచించారు. ప్రతి అవసరానికి నీరు చాలా ప్రాధాన్యమని అత్యంత ప్రాధాన్యంగా ఉన్న నీటిని అవసరం మేరకు మాత్రమే ఉపయోగించుకొని మిగతా నీటిని ఆదా చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ గుట్టల మల్లికార్జున స్వామి, మేనేజర్ రాజిరెడ్డి, టి పి ఓ శ్రీధర్, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్, వార్డ్ ఆఫీసర్స్ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## గ్రీవెన్స్ డేలో ప్రజా ఫిర్యాదులపై ఎస్పీ అశోక్ కుమార్ ప్రత్యేక దృష్టి

బాధితులకు త్వరితగతిన న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలి: అధికారులకు ఆదేశం



**జగిత్యాల ప్రతినిధి, (సింగిడి):** ప్రజలకు పోలీసు సేవలను మరింత చేరువ చేయడంతో పాటు బాధితుల సమస్యలను నేరుగా తెలుసుకొని సత్వర పరిష్కారం అందించాలనే లక్ష్యంతో ప్రతి సోమవారం నిర్వహిస్తున్న గ్రీవెన్స్ డే కార్యక్రమంలో భాగంగా సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ శ్రీ అశోక్ కుమార్, ఐపీఎస్ ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను స్వయంగా స్వీకరించి పరిశీలించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన సుమారు 15 మంది అర్జీదారులతో జిల్లా ఎస్పీ నేరుగా మాట్లాడి వారి సమస్యలను పూర్తిగా తెలుసుకున్నారు. బాధితులు సమర్పించిన వినతిపత్రాలు, సంబంధిత ఆధారాలను పరిశీలించిన అనంతరం ప్రతి ఫిర్యాదును చట్టబద్ధంగా, నిష్పక్షపాతంగా, పారదర్శకంగా విచారించి బాధితులకు త్వరితగతిన న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత పోలీసు అధికారులను ఆదేశించారు. చట్ట పరిధిలో పరిష్కరించగల సమస్యలను ఎలాంటి జాప్యం లేకుండా వెంటనే పరిష్కరించాలని, విచారణ ప్రక్రియలో నిర్లక్ష్యం లేదా లోపాలకు తావులేకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఎస్పీ స్పష్టం చేశారు. ప్రజల ఫిర్యాదుల పరిష్కారంలో పారదర్శకత, జవాబుదారీతనం, వేగవంతమైన స్పందనకు జిల్లా పోలీసు శాఖ అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ప్రజలకు నాణ్యమైన పోలీసు సేవలు అందించడం, ప్రతి ఫిర్యాదును బాధ్యతాయుతంగా పరిష్కరించడం పట్ల జిల్లా పోలీసు శాఖ కట్టుబడి ఉందని, ఎలాంటి సమస్య ఉన్నా ప్రజలు నిర్భయంగా పోలీసు శాఖను ఆశ్రయించాలని జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ తెలిపారు.

## చిన్నారుల ఆరోగ్య రక్షణకు ఆల్బెండజోల్ కవచం



**హుస్నాబాద్ (సింగిడి):** అక్కన్నపేట మండలం నందారం గ్రామంలో జాతీయ నులి పురుగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని పాఠశాల విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను గ్రామ సర్పంచ్ సుగుర్తి శ్రీలత బాలరాజు, ఉప సర్పంచ్ లింగాల కనుకయ్య విద్యార్థులకు స్వయంగా మాత్రలు వేయించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నులి పురుగుల నివారణతో పిల్లల్లో పోషకాహార లోపం, రక్తహీనత వంటి సమస్యలు తగ్గి శారీరక, మానసిక ఎదుగుదల మెరుగుపడుతుందన్నారు. అర్హులైన ప్రతి చిన్నారులు ఆల్బెండజోల్ మాత్రలు తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సాగర్, ఆశా వర్కర్ మంజుల లతో పాటు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలో నులిపురుగుల నివారణ మందుల పంపిణీ



**జమ్మికుంట, (సింగిడి):** జమ్మికుంట పట్టణ పరిధిలోని బాలుర పాఠశాలలో విద్యార్థిని విద్యార్థులకు డి – వార్మింగ్ నులిపురుగుల నివారణ మందులను పంపిణీ చేసిన జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ ప్రశాంత్ కుమార్. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలో ప్రతి విద్యార్థిని విద్యార్థులకు డి–వార్మింగ్ నులిపురుగుల నివారణ మందులు ఉచితంగా అందిస్తుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ తప్పకుండా ఈ మందులను వేసుకోవాలని సూచించారు. అనంతరం మండల విద్యాధికారి మాట్లాడుతూ, నులి పురుగు మాత్రలు తప్పకుండా ప్రతి విద్యార్థికి అందేలా పాఠశాల ఉపాధ్యాయులు వైద్య సిబ్బంది చర్యలు చేపట్టాలని పిల్లల్లో ఉన్న అపోహలు తొలగించి వారికి ఈ మందులను వెయ్యాలని తెలిపారు. నులి పురుగు మాత్రలు వేసుకోవడం వల్ల ఎలాంటి ఇబ్బందులు ఉండాలని పిల్లల ఆరోగ్యం కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకొని ఈ కార్యక్రమాన్ని చేపడుతుందని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ మాచర్ల రాజు, మండల విద్యాధికారి మంతెన హేమలత, ఉపాధ్యాయులు బాదం సురేష్, వైద్యురాలు చందన, ఏఎన్ఎం ఆశ వర్కర్స్ తదితరులు పాల్గొన్నారు.

# హుజురాబాద్‌లో మహిళ హత్య కేసు మిస్టరీ వీడింది



**హుజురాబాద్, (సింగిడి):** హుజురాబాద్ పట్టణంలోని మామిండ్లవాడలో మహిళ హత్య కేసును పోలీసులు కేవలం 36 గంటల్లోనే ఛేదించి నిందితుడిని అరెస్ట్ చేసినట్లు హుజురాబాద్ ఏసీపీ వాసంశెట్టి మాధవి సోమవారం వెల్లడించారు. హుజురాబాద్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కేసు వివరాలను ఆమె వెల్లడించారు. పోలీసుల వివరాల ప్రకారం.. హుజురాబాద్ మండలం పోతిరెడ్డిపేట గ్రామానికి చెందిన చింత సునీత (35) కొంతకాలంగా మామిండ్లవాడలో నివాసం ఉంటోంది. భర్త మృతి అనంతరం గత ఐదేళ్లుగా మోతే కిరణ్‌తో సహజీవనం చేస్తోంది. సునీత తన పొరుగింటి మహిళతో సన్నిహితంగా ఉండడంపై కిరణ్‌కు అనుమానం ఏర్పడి, ఈ విషయమై ఇద్దరి మధ్య తరచూ గొడవలు జరుగుతున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ నెల 10న ఇద్దరూ కలిసి మద్యం సేవించిన అనంతరం మరోసారి వివాదం తలెత్తడంతో ఆగ్రహానికి గురైన కిరణ్, సునీత గొంతు నులిమి హత్య చేసినట్లు వెల్లడించారు. అనంతరం ఎవరికి అనుమానం రాకుండా మృతదేహాన్ని సమీపంలోని బావిలో పడవేసి, అక్కడి నుంచి కరీంనగర్‌కు పరారైనట్లు పోలీసులు తెలిపారు. సీఐ కరుణాకర్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందం దర్యాప్తు చేపట్టి, నిందితుడు హుజురాబాద్‌కు తిరిగి వచ్చినట్లు సమాచారం అందడంతో సోమవారం అదుపులోకి తీసుకున్నారు. విచారణలో నిందితుడు నేరాన్ని ఒప్పుకున్నట్లు ఏసీపీ తెలిపారు. అతని సూచన మేరకు ఘటన స్థలం, మృతదేహాన్ని పడవేసిన బావి, ఇతర ఆధారాలను స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. ఘటన స్థలం నుంచి పగిలిన గాజులు, గాజు ముక్కలు, పూసలు, కాలి పట్టీ తదితర కీలక ఆధారాలతో పాటు మృతురాలి దుస్తులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నిందితుడిని న్యాయస్థానంలో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. కేసు దర్యాప్తు కొనసాగుతోందని ఏసీపీ పేర్కొన్నారు. ఈ కేసును వేగంగా ఛేదించిన సీఐ కరుణాకర్, ఎస్ఐలు రవి, శ్రీనివాసరావు, పోలీసు సిబ్బంది మోహన్, అవినాష్, మహేందర్, శ్రీధర్, అనిల్‌లను ఏసీపీ వాసంశెట్టి మాధవి అభినందించారు.

# డిప్యూటేషన్ డాక్టర్‌పై ఫిర్యాదు

మెట్‌పల్లి ఆసుపత్రిలో దీర్ఘకాల కొనసాగింపుపై విచారణ జరపాలి



**మెట్ పల్లి (సింగిడి):** మెట్ పల్లి ప్రభుత్వ సామాజిక ఆసుపత్రిలో డిప్యూటేషన్‌పై కొనసాగుతున్న వైద్యుల వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని బీజేపీ కౌన్సిలర్, మాజీ పట్టణ అధ్యక్షుడు బొడ్ల రమేష్ కోరారు. ఈ మేరకు సోమవారం జగిత్యాల జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి లో జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. బొడ్ల రమేష్ మాట్లాడుతూ.. మెట్‌పల్లి ప్రభుత్వ సామాజిక ఆసుపత్రిలో విధులు నిర్వహిస్తున్న డాక్టర్ అమరేశ్వర్ 2011 సంవత్సరంలో ఇక్కడ విధుల్లో చేరారని, అనంతరం ఆయనకు జగిత్యాలకు బదిలీ జరిగినప్పటికీ తిరిగి డిప్యూటేషన్‌పై మెట్‌పల్లి ఆసుపత్రిలోనే కొనసాగుతున్నారని తెలిపారు. ఒకే ప్రాంతంలో సుదీర్ఘకాలం డిప్యూటేషన్‌పై కొనసాగుతున్న అంశంపై ఉన్నతాధికారులు దృష్టి సారించి విచారణ చేపట్టాలని కోరారు. అదేవిధంగా డాక్టర్ సాజిద్ అహ్మద్ 2008 సంవత్సరం నుంచి మెట్‌పల్లి ప్రభుత్వ ఆసుపత్రిలోనే విధులు నిర్వహిస్తున్నారని వినతిలో పేర్కొన్నారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం వైద్య ఆరోగ్య శాఖలో పెద్ద ఎత్తున బదిలీలు చేపట్టినప్పటికీ కొంతమంది వైద్యులు యథాతథంగా కొనసాగడం పట్ల అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో పనిచేస్తున్న వైద్యులు నిర్ణీత సమయాల్లో అందుబాటులో ఉండి రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాల్సిన బాధ్యత ఉందన్నారు. అయితే కొందరు వైద్యులు విధుల్లో సమయపాలన పాటించకుండా ప్రైవేట్ ఆసుపత్రులకు ప్రాధాన్యం ఇస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయని, వీటిపై కూడా సమగ్ర విచారణ జరపాలని కలెక్టర్‌ను కోరారు. ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే పేద, మధ్యతరగతి ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. డిప్యూటేషన్ కొనసాగింపునకు గల కారణాలు, నిబంధనల అమలుపై పరిశీలన జరిపి తప్పులు తేలితే డాక్టర్ అమరేశ్వర్ డిప్యూటేషన్‌ను రద్దు చేయాలని, డాక్టర్ సాజిద్ అహ్మద్‌ను వెంటనే బదిలీ చేయాలని కోరారు. ప్రజల ఆరోగ్యానికి సంబంధించిన అంశం కావడంతో జిల్లా యంత్రాంగం వెంటనే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని బొడ్ల రమేష్ విజ్ఞప్తి చేశారు.

ప్రభాతనవ
# సింగిడి
ప్రతి రంగూ ఓ నిజం
Singidi
సోమవారం
20-7-2026

## నులిపురుగుల నిర్మూలన దినోత్సవాన్ని విజయవంతం చేయాలి

### కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్





**కామారెడ్డి ప్రతినిధి, (సింగిడి):** జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా జిల్లాలో నిర్వహిస్తున్న కార్యక్రమాన్ని ప్రతి అర్హత కలిగిన చిన్నారికి చేరేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు. సోమవారం కామారెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ ప్రారంభించారు. అనంతరం విద్యార్థులకు స్వయంగా అల్బెండాజోల్ మాత్రలు అందించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ, 1 నుంచి 19 వయస్సు గల పిల్లలు, కిశోరులకు సంవత్సరానికి రెండుసార్లు అల్బెండాజోల్ మాత్ర ఇవ్వడం ద్వారా నులిపురుగుల సమస్యను సమర్థవంతంగా నివారించవచ్చని తెలిపారు. నులిపురుగుల కారణంగా పిల్లల్లో రక్తహీనత, పోషకాహార లోపం, శారీరక ఎదుగుదల మందగించడం, చదువుపై ఏకాగ్రత తగ్గడం వంటి సమస్యలు తలెత్తే అవకాశం ఉందని పేర్కొన్నారు. జిల్లాలో అర్హులైన 2,46,177 మంది ప్రతి చిన్నారులకు, ప్రతి విద్యార్థికి నులిపురుగుల నివారణ మాత్ర అందేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు. తల్లిదండ్రులు కూడా తమ పిల్లలకు తప్పని సరిగా మాత్ర వేయించి కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో భాగస్వాములు కావాలని కోరారు. జూలై 20 న నిర్వహించే మాప్-అప్ డే సందర్భంగా మొదటి విడతలో మాత్రలు తీసుకోలేక పోయిన పిల్లలకు తప్పనిసరిగా మాత్రలు అందచేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్. జె. వెంకటి, ప్రోగామ్ అధికారి డా. రోహిత్ కుమార్, కామారెడ్డి మున్సిపల్ కమిషనర్ పర్వతాలు, మున్సిపాలిటీ చైర్‌పర్సన్ ఇప్ప ఉమా రాణి, స్థానిక కౌన్సిలర్ అఖిల, జిల్లా విద్యాశాఖాధికారి మల్లికార్జున్, స్థానిక వైద్యాధికారి డాక్టర్ చందన ప్రియ, ఎంఈఓ ఎల్లయ్య, జెడ్పీహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయురాలు వై. మాధవి, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు, ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## సింగరేణి భవిష్యత్తుకు కేంద్రం ఊరట








**మోదీ సర్కార్ ప్రత్యేక నిర్ణయం**
**బొగ్గు బ్లాక్ కేటాయింపుపై**
**రాజకీయ రగడ వద్దు**
**సింగరేణిని కాపాడేందుకే తాడిచెర్ల--2**
**బొగ్గు బ్లాక్ కేటాయింపు**
**కేంద్ర నిర్ణయం వెనుక కారణాలను**
**వివరించిన కిషన్ రెడ్డి**

**లక్ష్మీదేవిపల్లి (సింగిడి):** సింగరేణి కాలరీస్ సంస్థను ఆర్థికంగా బలోపేతం చేయడమే కేంద్ర ప్రభుత్వ లక్ష్యమని, అందుకే తాడిచెర్ల--2 బొగ్గు బ్లాక్‌ను ప్రత్యేకంగా సింగరేణికి కేటాయించినట్లు కేంద్ర బొగ్గు శాఖ మంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. సింగరేణి కొత్తగూడెం ఏరియా లో సోమవారం జరిగిన భరోసా యాత్ర లో ఆయన పాల్గొని మాట్లాడుతూ... సింగరేణిలో బొగ్గు ఉత్పత్తి తగ్గడం, ఆదాయం క్షీణించడం, కార్మికుల సంఖ్య తగ్గిపోవడం వంటి పరిణామాలు ఆందోళన కలిగిస్తున్నాయని ఆయన అన్నారు. సంస్థ మనుగడకు కొత్త బొగ్గు నిల్వలు అత్యవసరమని, ఈ అవసరాన్ని గుర్తించిన ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వం న్యాయపరమైన అంశాలను పరిశీలించి ప్రత్యేక నిర్ణయం తీసుకుందని చెప్పారు. ఈ సందర్భంగా గత ప్రభుత్వాలపై కూడా ఆయన విమర్శలు గుప్పించారు. యూపీఏ హయాంలో బొగ్గు గనుల కేటాయింపుల్లో అవకతవకలు చోటుచేసుకోవడంతో సుప్రీంకోర్టు జోక్యం చేసుకుని పాతకేటాయింపులను రద్దు చేసి, 2014 నుంచి వేలం విధానాన్ని అమలు చేయాలని ఆదేశించిందని గుర్తు చేశారు. అయితే ప్రస్తుత పరిస్థితుల్లో సింగరేణి ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని కేంద్రం ప్రత్యేక మినహాయింపుతో తాడిచెర్ల--2 బొగ్గు బ్లాక్‌ను కేటాయించిందని చెప్పారు. ఇది తెలంగాణలో బొగ్గు ఉత్పత్తి పెరగడంతో పాటు వేలాది మంది కార్మికుల ఉపాధి భద్రతకు దోహదపడుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. బీఆర్ఎస్ ప్రభుత్వం సింగరేణి సమస్యలను రాజకీయ కోణంలో మాత్రమే చూసిందని, సంస్థ దీర్ఘకాల ప్రయోజనాల కోసం చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. తెలంగాణకు మరిన్ని బొగ్గు వనరులు అందించేందుకు కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని, సింగరేణిని మళ్లీ లాభాల బాటలో నడిపించడమే తమ లక్ష్యమని కిషన్ రెడ్డి స్పష్టం చేశారు.

### విద్యార్థుల ఆరోగ్య భద్రత
## రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం
### వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్



**వైరా, (సింగిడి):** విద్యార్థుల ఆరోగ్య భద్రతే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యం అని వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ స్పష్టం చేశారు. వైరా నియోజకవర్గ కేంద్రంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో సోమవారం విద్యార్థులకు నులుపురుగులు నివారణ మందులు పంపిణీ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే రాందాస్ నాయక్, సుడా చైర్మన్ పువ్వాళ్ళ దుర్గాప్రసాద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థుల ఆరోగ్య భద్రత ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ముందు జాగ్రత్త నులిపురుగుల నివారణ మందుల పంపిణీ కార్యక్రమం చేపట్టిందని అన్నారు. విద్యార్థులు చదువుతోపాటు ఆరోగ్యం విషయంలో జాగ్రత్తలు పాటించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ స్థాయి విద్యను అందిస్తుందని అన్నారు. పేద విద్యార్థుల కోసం ప్రతి నియోజకవర్గంలో 200 కోట్ల రూపాయలతో ఇంటిగ్రేటెడ్ స్కూల్స్, మండల కేంద్రాల్లో తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ నిర్మాణం చేపట్టడం జరుగుతుందని తెలిపారు. అనంతరం పాఠశాలలో ఏర్పాటు చేసిన మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### నిజామాబాద్ ప్రభుత్వ వైద్య కళాశాలకు
## పెరిగిన ఎంబీబీఎస్ సీట్లు
### 150 కి పెంచిన ఎన్ఎంసీ




**నిజామాబాద్ ప్రతినిధి, (సింగిడి):** నిజామాబాద్ ప్రభుత్వ వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ సీట్ల సంఖ్యను 120 నుంచి 150 కు పెంచేందుకు నేషనల్ మెడికల్ కమిషన్ (ఎన్ఎంసీ) అధికారికంగా అనుమతి మంజూరు చేసింది. ఈ మేరకు ఎన్ఎంసీ అండర్ గ్రాడ్యుయేట్ మెడికల్ ఎడ్యుకేషన్ అసెస్‌మెంట్ అండ్ రేటింగ్ బోర్డ్ సోమవారం (జూలై 13, 2026) లెటర్ ఆఫ్ పర్మిషన్ జారీ చేసింది. అదనంగా 30 ఎంబీబీఎస్ సీట్ల మంజూరు కోసం జూన్ 17, 2026 న ఎన్ఎంసీకి చెందిన నలుగురు అసెస్సర్ల బృందం నిజామాబాద్ ప్రభుత్వ వైద్య కళాశాలతో పాటు ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో ప్రత్యక్ష తనిఖీలు నిర్వహించింది. కళాశాలలో అందుబాటులో ఉన్న అధ్యాపక సిబ్బంది, మౌలిక వసతులు, బోధనా సదుపాయాలు, ఆస్పత్రి సేవలు తదితర అంశాలను సమగ్రంగా పరిశీలించింది. ఆ తనిఖీ నివేదిక ఆధారంగా ఎన్ఎంసీ అండర్ గ్రాడ్యుయేట్ మెడికల్ ఎడ్యుకేషన్ అసెస్‌మెంట్ అండ్ రేటింగ్ బోర్డ్ అదనంగా 30 సీట్లను మంజూరు చేస్తూ మొత్తం ఎంబీబీఎస్ సీట్ల సంఖ్యను 150కు పెంచేందుకు ఆమోదం తెలిపింది. ఈ సందర్భంగా ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపల్, అడిషనల్ డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ డా. కృష్ణ మోహన్ మాట్లాడుతూ, ఎన్ఎంసీ అనుమతితో జిల్లాతో పాటు ఉత్తర తెలంగాణ ప్రాంత విద్యార్థులకు మరిన్ని వైద్య విద్య అవకాశాలు లభిస్తాయని తెలిపారు. కళాశాల అభివృద్ధికి సహకరించిన ప్రతి ఒక్కరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

## 5.1 కిలోల గంజాయి పట్టివేత ఇద్దరు అరెస్ట్



**నిజామాబాద్ ప్రతినిధి, (సింగిడి):** నిజామాబాద్ రైల్వే స్టేషన్ లో నిజామాబాద్ ప్రొహిబిషన్ ఎక్సైజ్ శాఖ అధికారులు సంబల్పూర్ నుంచి నాందేడ్ వెళ్తున్న నాగవల్లి ఎక్స్ ప్రెస్ రైలు లో చేపట్టిన ప్రత్యేక తనిఖీల్లో 5. 1 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని, అక్రమ రవాణాకు పాల్పడుతున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేశారు. అధికారుల వివరాల ప్రకారం సోమవారం మధ్యాహ్నం ఎస్‌హెచ్ఓ నిజామాబాద్ బృందం రైలు తనిఖీల్లో భాగంగా నిర్వహించింది. ఈ సందర్భంగా అక్రమంగా గంజాయిని తరలిస్తున్న బీహార్ రాష్ట్రానికి చెందిన అఖిల్ ఆలం, మహమ్మద్ చాంద్‌లను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి మొత్తం 5. 1 కిలోల గంజాయితో పాటు రెండు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నిందితులపై సంబంధిత చట్టాల కింద కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచినట్లు అధికారులు తెలిపారు. ఈ తనిఖీల్లో ప్రొహిబిషన్, ఎక్సైజ్ సబ్ ఇన్‌స్పెక్టర్ ఏ. గంగాధర్, మల్లేష్, ట్రైనీ ఏఈఎస్ గాయత్రి, కానిస్టేబుళ్లు దేవేందర్, శైలేష్, గౌతమ్ పాల్గొన్నారు.

## ఆరోగ్యంగా ఉంటేనే చదువులో రాణింపు
### విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో ముందుకెళ్లాలి: కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్







**గద్వాల బ్యూరో (సింగిడి):** ఆరోగ్యంగా ఉంటేనే విద్యార్థులు చదువులో రాణిస్తారని, ఫలి తంగా ఉన్నత లక్ష్యాలతో ముందుకెళ్లవచ్చని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. సోమవారం జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం పురస్కరించుకొని గద్వాలలోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు వెనుకబడ్డ సబ్జెక్టులపై ప్రత్యేక దృష్టి సారించి సాధన చేయాలన్నారు. ప్రణాళిక బద్ధంగా చదివి పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని సూచించారు. నులిపు రుగుల నివారణకు జిల్లా వ్యాప్తంగా ఉన్న అంగన్వాడి కేంద్రాల చిన్నారులతో పాటు విద్యాసంస్థల విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు ఇవ్వడం జరుగుతుందన్నారు. విద్యార్థినిలు న్యూట్రీషన్ సమస్యలు లేకుండా పౌష్టికాహారం తీసుకోవాలని, ఐరన్ పోలిక్ యాసిడ్ మాత్రలతో రక్తహీనతను నివారించవచ్చన్నారు. నులిపురుగుల నివారణకు ఆల్బెండజోల్ మాత్రలు వేసుకోవడం వలన ఎలాంటి ఇబ్బంది లేదని పేర్కొన్నారు అనంతరం కలెక్టర్ పలువురు విద్యార్థులకు మాత్రలను అందజేశారు. ఈ కార్యక్రమంలో డిఎంహెచ్వో సంధ్య కిరణ్మయి, పాఠశాల ఇన్చార్జి ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మి, వైద్య సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి
### ప్రజావాణిలో ప్రజల అర్జీలు స్వీకరించిన జిల్లా కలెక్టర్ టీఎస్ దివాకర



**ఖమ్మం, (సింగిడి):** ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ జిల్లా అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి, ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ పారస్ కుమార్ లతో కలిసి ప్రజల అర్జీలను స్వీకరించారు.

-కూసుమంచి మండలం పాలేరు గ్రామానికి చెందిన ప్రజలు గ్రామ జనాభా అధికంగా ఉన్నందున తమ గ్రామానికి రెండవ రేషన్ దుకాణం మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారికి రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు.

-చింతకాని మండలం వందనం గ్రామానికి చెందిన అమర్లపూడి వసంత రాణి తాను ఇంటర్ చేశానని, ఖాళీగా ఉన్న ప్రీ ప్రైమరీ ఆయా పోస్ట్ కొరకు దరఖాస్తు చేసుకోగా మెరిట్ లిస్ట్ లో పేరు ఉన్నా కూడా పోస్ట్ రాలేదని, ఆయా పోస్ట్ ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, జిల్లా విద్యాశాఖ అధికారికి రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. తల్లాడ మండలం గొల్లగూడెంకు చెందిన జి. సురేష్ తన కుమారుడు గుండ్ల సాత్విక్ కు వైరా బీసీ మహాత్మ జ్యోతి బాపూలే స్కూల్ నందు సీటు ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, ఆర్సిఓ బీసీ సంక్షేమ అధికారికి రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ఖమ్మం రూరల్ మండలం గొల్లగూడెం గ్రామానికి చెందిన డి. ఉపేంద్ర తనకు బ్లాక్ ఫంగస్ వచ్చి కంటిచూపు పోయిందని తనకు దివ్యాంగుల పెన్షన్ మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, డీపీఎం, సదరంకు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సూపరింటెండెంట్ లు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లాలో భూసర్వేలు వేగవంతం చేయాలి
### లైసెన్సుడ్ సర్వేయర్లతో జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ సమీక్ష
### ప్రజలకు సకాలంలో సేవలు అందించడంలో సర్వేయర్లు భాగస్వాములు కావాలి
### జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్




**నాగర్‌కర్నూల్ (సింగిడి):** రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న భూ భారతి భూ సమస్యల పరిష్కారాన్ని విజయవంతం చేయడంలో లైసెన్సుడ్ సర్వే యర్లు కీలక పాత్ర పోషించాలని, జిల్లాలోని అన్ని మండలాల్లో అందుతున్న భూ సర్వే దరఖాస్తులను ఎలాంటి జాప్యం లేకుండా పూర్తి చేసేందుకు ముందుకు రావాలని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ సూచించారు. సోమవారం నాగర్‌కర్నూల్ కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో జిల్లాలోని లైసెన్సుడ్ సర్వేయర్లతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో జిల్లా కలెక్టర్ పలు కీలక సూచనలు చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ....., రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార, పౌర సంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆదివారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో వెల్లడించిన అంశాలను సమావేశంలో సర్వేయర్లకు వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం భూ సర్వే ప్రక్రియను మరింత సమర్థవంతంగా నిర్వహించడం, ప్రజలకు వేగవంతమైన సేవలు అందించడం, భూ వివాదాలను తగ్గించడం వంటి లక్ష్యాలతో పలు నిర్ణయాలు తీసుకుందని చెప్పారు. భూ సర్వేల నిర్వహణలో లైసెన్సుడ్ సర్వేయర్ల పాత్ర ఎంతో కీలకమని, ప్రభుత్వం నిర్ణయించిన నిబంధనలకు అనుగుణంగా జిల్లాలోని ప్రతి మండలంలో వచ్చే భూ సర్వే దరఖాస్తులను బాధ్యతాయుతంగా, పారదర్శకంగా, నిర్ణీత గడువులోగా పూర్తి చేసేలా సర్వేయర్లు ముందుకు రావాలని సూచించారు. ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి రాకుండా సకాలంలో సేవలు అందించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అన్నారు. ప్రభుత్వం లైసెన్సుడ్ సర్వేయర్లకు ప్రోత్సాహం కల్పించేందుకు భూ సర్వే నిర్వహించిన ప్రతి ఎకరానికి రీ-సర్వేలో పనిచేసే లైసెన్స్ సర్వేయర్లకు ఎకరానికి రూ. 50తో పాటు రవాణా, ఇతర ఖర్చుల నిమిత్తం మరో రూ. 10 కలిపి మొత్తం రూ. 60 చొప్పున పారితోషికం చెల్లించాలని నిర్ణయించిందని కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయాన్ని సద్వినియోగం చేసుకొని జిల్లాలో పెండింగ్‌లో ఉన్న సర్వేలను వేగంగా పూర్తి చేయాలని, భూ సర్వేల నిర్వహణలో చురుకుగా పాల్గొనాలని సర్వేయర్లను కోరారు. ప్రజలకు నాణ్యమైన సేవలు అందించడమే లక్ష్యంగా ప్రతి సర్వేయర్ పనిచేయాలని కలెక్టర్ అన్నారు. సర్వేల నిర్వహణలో నిబంధనలు తప్పకుండా పాటించాలని, క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితులను పరిశీలించి ఖచ్చితమైన సర్వేలు నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. భూ యజమానుల మధ్య వివాదాలకు అవకాశం లేకుండా రికార్డులు, సరిహద్దులు, భూమి వివరాలను సమగ్రంగా పరిశీలించి సర్వేలు పూర్తి చేయాలని, సర్వేల నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండ కూడదని, ప్రభుత్వంపై ప్రజలకు ఉన్న నమ్మకాన్ని నిలబెట్టేలా ప్రతి సర్వేయర్ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. సమావేశంలో తమ అభిప్రాయాలను వెల్లడించిన లైసెన్సుడ్ సర్వేయర్లు, ప్రభుత్వం నిర్ణయించిన పారితోషికం, సర్వేల నిర్వహణ విధానం తదితర అంశాలపై జిల్లాలోని సర్వేయర్లందరితో సమావేశమై సమగ్రంగా చర్చించి తుది నిర్ణయాన్ని త్వరలో జిల్లా యంత్రాంగానికి తెలియజేస్తామని కలెక్టర్‌కు వివరించారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలను సానుకూలంగా పరిశీలిస్తామని, జిల్లాలో భూ సర్వేలను సమర్థవంతంగా నిర్వహించేందుకు సహకరిస్తామని తెలిపారు. సమావేశంలో, జిల్లా సర్వేయర్ గిరిధర్, రెవెన్యూ శాఖ అధికారులు, వివిధ మండలాలకు చెందిన లైసెన్సుడ్ సర్వేయర్లు, అధికారులు పాల్గొన్నారు.

## నులిపురుగుల నివారణకు ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ






**భిక్కనూర్, (సింగిడి):** జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా సోమవారం భిక్కనూర్ మండలంలోని రామేశ్వర్‌పల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, భిక్కనూరులోని చైతన్య విద్యానికేతన్ హైస్కూల్‌లలో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. రామేశ్వర్‌పల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్ది చంద్రకాంత్ రెడ్డి ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా చిన్నారులు ఆరోగ్యంగా ఎదగడానికి నులిపురుగుల నివారణ ఎంతో అవసరమని, ప్రతి విద్యార్థి తప్పనిసరిగా ఆల్బెండజోల్ మాత్రలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ వినోద్ గౌడ్, మండల వైద్యాధికారి డాక్టర్ ఏమిమా దేవి, వీడీసీ అధ్యక్షుడు మద్ది సూర్యకాంత్ రెడ్డి, వీడీసీ కార్యదర్శి నాగర్తి చిన్న భూమారెడ్డి, ఉపాధ్యాయులు ఉమారాణి, విశాల, హెచ్ఈఓ వెంకట రమణ, ఏఎన్ఎం మాధవి, సతీష్, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

**చైతన్య విద్యానికేతన్ హైస్కూల్‌లో ....**

బిక్కనూర్ చైతన్య విద్యానికేతన్ హైస్కూల్‌లో విద్యార్థులకు నులిపురుగుల నివారణ, వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించి ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. నులిపురుగుల నివారణతో పిల్లల శారీరక, మానసిక ఎదుగుదలకు దోహదపడుతుందని వైద్య సిబ్బంది వివరించారు కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ రేణుకుమార్, ప్రధానోపాధ్యాయుడు అశోక్ యాదవ్, 9వ వార్డు సభ్యుడు గజ్జె వేణు, 11వ వార్డు సభ్యుడు సురేష్ గౌడ్, ఏఎన్ఎంలు లలిత, శ్యామల, ఆశా కార్యకర్తలు లావణ్య, వనజ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### అశ్వారావుపేటలో పిచ్చికుక్క బీభత్సం 30 మందికి గాయాలు





**అశ్వారావుపేట, (సింగిడి):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట పట్టణంలో గోగులుబంధం షిరిడి సాయి నగర్ విధుల్లో పిచ్చికుక్క స్వైర విహారం కలకలం రేపింది. ఒకేసారి 30 మందికి పైగా గ్రామస్తులపై పిచ్చికుక్కదాడి చేసింది. చిన్న పిల్లల నుండి పెద్దల వరకు కాళ్లు, చేతులు, ముఖంపై కుక్క కాటుకు గురయ్యారు. గాయపడిన వారందరూ చికిత్స కోసం అశ్వారావుపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలివెళ్లారు. ఆసుపత్రిలో వైద్యులు అందరికీ రాబిస్ వ్యతిరేక టీకాలు అందిస్తు న్నారు. సమాచారం అందుకున్న మున్సిపల్ సిబ్బంది గోగులుబంధం షిరిడి సాయి నగర్ నందు చుట్టుపక్కల ప్రాంతాల్లో పిచ్చికుక్క కోసం గాలింపుచర్యలు చేపట్టారు. వీధి కుక్కల బెడదను అదుపు చేయాలని గ్రామస్తులు అధికారులను కోరుతున్నారు.

### చిన్నారులకు ఆల్బెండాజోల్ మాత్రలు పంపిణీ చేసిన కౌన్సిలర్




**గద్వాల ప్రతినిధి, (సింగిడి):** జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా జోగులాంబ గద్వాల జిల్లా వ్యాప్తంగా 1 నుంచి 19 సంవత్సరాల వయస్సు గల పిల్లలకు ఆల్బెండాజోల్ మాత్రల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అయిజ పట్టణంలోని ఎస్సీ కాలనీ 16వ వార్డులోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, అంగన్వాడీ కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో మున్సిపాలిటీ 16వ వార్డు కౌన్సిలర్ ఎస్. మద్దిలేటి పాల్గొని విద్యార్థులకు ఆల్బెండాజోల్ మాత్రలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం చేపట్టిన జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమాన్ని ప్రతి తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకుని తమ పిల్లలకు తప్పనిసరిగా ఆల్బెండాజోల్ మాత్ర వేయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్లు ఏసమ్మ, సునీత, పాఠశాల ఉపాధ్యాయులు, అంగన్వాడీ సిబ్బంది పాల్గొని విద్యార్థులకు మాత్రల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. కార్యక్రమం విజయవంతంగా నిర్వహించారు.

### ఇందిరమ్మ ఇండ్లను పరిశీలించిన ఎంపీడీవో



**కోడేరు, (సింగిడి):** కోడేరు మండల పరిధిలోని మైలారం గ్రామంలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇండ్లను ఎంపీడీవో విజయలక్ష్మి సోమవారం నాడు క్షేత్రస్థాయిలో పరిశీలిచారు ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులతో నిర్మాణం పురోగతులను లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు ఇందిరమ్మ ఇల్లు నిర్మించుకునే ప్రతి ఒక్కరు మరుగుదొడ్డిని తప్పకుండా నిర్మించుకోవాలని ఆమె సూచించారు మరుగుదొడ్డి ఉంటే ఆరోగ్యకరమైన వాతావరణము ఉంటుందని ఆమె ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు సూచించారు త్వరితగతిన నిర్మాణంలో ఉన్న ఇండ్లను పూర్తి చేసుకోవాలని ఆమె అన్నారు ఈమె వెంట ఏపిఓ నాగరాజు పంచాయతీ కార్యదర్శి వెంకటేష్ పాల్గొన్నారు

### గుడిసెవాసుల గృహ నిర్మాణాలకు శ్రీకారం.



**బిక్కనూరు, (సింగిడి):** భిక్కనూరు మండలంలోని తిప్పాపూర్ గ్రామంలో ప్రభుత్వం మంజూరు చేసిన ఇళ్ల నిర్మాణ కార్యక్రమంలో భాగంగా సోమవారం ముగ్గురు లబ్ధిదారులు గృహ నిర్మాణ పనులను ప్రారంభించారు. గ్రామ సర్పంచ్ కుంట లింగారెడ్డి కొబ్బరికాయ కొట్టి భూమిపూజ నిర్వహించి పనులకు శ్రీకారం చుట్టారు. ఇటీవల గ్రామానికి మంజూరైన 13 ఇళ్లలో తొలి విడతగా ముగ్గురు లబ్ధిదారులు నిర్మాణ పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం కల్పించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని నాణ్యతతో ఇళ్ల నిర్మాణాన్ని పూర్తి చేసుకోవాలని సర్పంచ్ సూచించారు. కార్యక్రమంలో మండల్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు భీంరెడ్డి, ఉపసర్పంచ్ జీవన్, కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు ధర్మయ్య, మహేష్, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

### పోలీసుల అదుపులో గంజాయి
## సేవిస్తున్న ముగ్గురు యువకులు

- మాదకద్రవ్యాల నిర్మూలనకు జిల్లా పోలీసుల ప్రత్యేక చర్యలు
- విలేకరుల సమావేశంలో డిఎస్పీ ఆదినారాయణ



**లక్ష్మీదేవిపల్లి (సింగిడి):** మాదకద్రవ్యాల నిర్మూలనకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పోలీసులు ప్రత్యేక చర్యలు కొనసాగిస్తున్నారు. జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఆదేశాల మేరకు గంజాయి వినియోగం, విక్రయం, రవాణాపై నిఘా పెంచడంతో పాటు అవగాహన కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహిస్తు న్నారు. ఈ క్రమంలో లక్ష్మీదేవిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని లోతువాగు ప్రాంతంలో పోలీసులు నిర్వహించిన ప్రత్యేక తనిఖీల్లో గంజాయి సేవిస్తున్న ముగ్గురు యువకులను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం వారిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి వైద్య పరీక్షలు నిర్వహించగా గంజాయి సేవించినట్లు నిర్ధారణ కావడంతో కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు చేపట్టారు. పోలీసులు యువకులకు గంజాయి వల్ల కలిగే ఆరోగ్య, మానసిక, కుటుంబ, సామాజిక దుష్పరిణామాలపై అవగాహన కల్పించి, భవిష్యత్తులో మాదకద్ర వ్యాలకు పూర్తిగా దూరంగా ఉండాలని కౌన్సెలింగ్ నిర్వహించారు. అనంతరం న్యాయస్థానం ఆదేశాల మేరకు వారిని డీ-అడిక్షన్ సెంటర్‌కు తరలించారు. ఈ సందర్భంగా కొత్తగూడెం డీఎస్పీ ఆదినారాయణ మాట్లాడుతూ... యువత భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని మాదకద్రవ్యాల నియంత్రణలో పోలీసులు ఎలాంటి రాజీ పడబోరని స్పష్టం చేశారు. ఒకవైపు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూనే, మరోవైపు గంజాయి వినియోగం, విక్రయం, రవాణాలో పాల్గొనే వారిపై కఠిన చర్యలు కొనసాగుతాయని హెచ్చరించారు. మాదకద్రవ్యాల నిర్మూలనలో ప్రజలు, తల్లిదండ్రులు, విద్యాసంస్థల యాజమాన్యాలు పోలీసులకు సహకరించాలని, గంజాయి లేదా ఇతర మత్తు పదార్థాలకు సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్ లేదా డయల్-112కు సమాచారం అందించాలని కోరారు. ఈ తనిఖీల్లో చుంచుపల్లి సీఐ ఆర్. వెంకటేశ్వర్లు, ఎస్సై అఖిలతో పాటు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభాతనవ సింగిడి తెలుగు దినపత్రిక
ప్రతి రంగూ ఓ నిజం
Singidi
సోమవారం 20-7-2026

# చెక్ బౌన్స్ కేసులకు సత్వర పరిష్కారం

**18న స్పెషల్ లోక్ అదాలత్ విజయవంతం చేయాలి**

**సీనియర్ సివిల్ జడ్జి డి. నాగేశ్వర్ రావు పిలుపు**



**మెట్‌పల్లి, (సింగిడి):** చెక్ బౌన్స్ కేసుల సత్వర పరిష్కారం కోసం ఈ నెల 18న నిర్వహించనున్న స్పెషల్ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని సీనియర్ సివిల్ జడ్జి డి. నాగేశ్వర్ రావు న్యాయవాదులకు పిలుపునిచ్చారు. మండల్ లీగల్ సర్వీసెస్ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం మెట్‌పల్లి బార్ అసోసియేషన్ సభ్యులతో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశవ్యాప్తంగా పెరుగుతున్న చెక్ బౌన్స్ కేసుల పెండెన్సీని తగ్గించేందుకు ప్రత్యేక లోక్ అదాలత్‌లు సమర్థవంతమైన వేదికగా నిలుస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. రాజీ ద్వారా పరిష్కారం సాధ్యమయ్యే కేసులను గుర్తించి, సంబంధిత పక్షాలను ఒప్పించి లోక్ అదాలత్‌లో పరిష్కరించేలా ప్రతి న్యాయవాది చొరవ చూపాలని కోరారు. వారెంట్ ఉన్న కేసులతో పాటు రాజీకి అవకాశం ఉన్న అన్ని కేసులను కూడా లోక్ అదాలత్‌కు తీసుకురావాలని సూచించారు. న్యాయస్థానాల్లో పెండింగ్ కేసుల భారాన్ని తగ్గించడంతో పాటు, కక్షిదారులకు తక్కువ సమయంలో తక్కువ ఖర్చుతో న్యాయం అందించడమే లోక్ అదాలత్‌ల ప్రధాన ఉద్దేశమని ఆయన వివరించారు. న్యాయవాదుల సహకారంతో ఈ ప్రత్యేక లోక్ అదాలత్‌ను విజయవంతం చేసి, ఎక్కువ సంఖ్యలో కేసులను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో జూనియర్ సివిల్ జడ్జి వి. మాధవి, ఏపీపీ ప్రణయ్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఏలేటి రామ్‌రెడ్డి, లోక్ అదాలత్ సభ్యులు వద్దేపల్లి శ్రీనివాసన్, జేడి సుధాకర్, న్యాయవాదులు జిల్లా వెంకటేశ్వర్లు, మగ్గిడి వెంకట నర్సయ్య, కోటగిరి వెంకటస్వామి, పుప్పాల భానుమూర్తి, కటకం వేణుగోపాల్, బక్కూరి రమేష్, పసునూరి శ్రీనివాస్, బిగుర్ల శంకర్, అలాల శంకర్, అందె సంజయ్ తదితరులు పాల్గొన్నారు.

## ఓటరు జాబితాలో పేరు తప్పనిసరిగా పరిశీలించుకోవాలి



**హుజూరాబాద్, (సింగిడి):** హుజూరాబాద్ నియోజకవర్గంలో కొనసాగుతున్న ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో ప్రతి ఓటు ఎంతో విలువైనదని, అర్హులైన ప్రతి ఓటరు తమ పేరు ఓటరు జాబితాలో నమోదైందో లేదో తప్పనిసరిగా పరిశీలించుకోవాలని బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి, టీజీఎంఎస్ఐడీసీ మాజీ ఛైర్మన్ డా. చిరుమిల్ల రాకేష్ పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కే.టీ. రామారావు ఆదేశాల మేరకు ఈ సూచనలు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అర్హులైన ప్రతి ఓటరికి సంబంధిత దరఖాస్తు ఫారాలు అందాయా లేదా అనే విషయాన్ని పార్టీ నాయకులు, కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి పరిశీలించాలని సూచించారు. ఫారాలు అందని వారికి వెంటనే అందేలా చర్యలు తీసుకోవడంతో పాటు, ఓటరు నమోదు, పేరు మార్పులు, చిరునామా సవరణలు, కొత్తగా చేర్పులు వంటి అంశాల్లో ప్రజలకు అవసరమైన సహాయ సహకారాలు అందించాలని పార్టీ శ్రేణులకు ఆదేశించారు. అదేవిధంగా ప్రజలు కూడా తమ ఓటు హక్కు పట్ల బాధ్యతతో వ్యవహరించాలని, ఓటరు జాబితాలో తమ పేరు నమోదైందో లేదో స్వయంగా ధృవీకరించుకోవాలని సూచించారు. పేరు నమోదు కాని వారు వెంటనే దరఖాస్తు చేసుకుని ఓటు హక్కును వినియోగించుకునే అవకాశాన్ని కోల్పోకుండా చూసుకోవాలని హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి, డా. చిరుమిల్ల రాకేష్ కోరారు. ఈ కార్యక్రమంలో బండ శ్రీనివాస్, తక్కలపల్లి రాజేశ్వరరావు, పింగళి రమేష్, గందె శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## రూ.5 లక్షలతో సీసీ రోడ్డు పనులకు శ్రీకారం



**మల్లాపూర్, (సింగిడి):** కోరుట్ల ఎమ్మెల్యే డా. కల్వకుంట్ల సంజయ్ ప్రత్యేక కృషితో మంజూరైన రూ. 5 లక్షల విలువైన సీసీ రోడ్డు నిర్మాణ పనులను మల్లాపూర్ మండలం రాఘవపేటలో సర్పంచ్ తోట శ్రీనివాస్ ప్రారంభించారు. 2వ వార్డులో ఆకుల చిన్నయ్య గిర్నీ నుండి నత్తి గణేష్ ఇంటివరకు, అలాగే 8వ వార్డులో గాండ్ల మల్లయ్య ఇంటి నుండి గడ్డం సాయిరెడ్డి ఇంటి వరకు సీసీ రోడ్లు నిర్మించాలని గ్రామ ప్రజల తరఫున ఎమ్మెల్యేను కోరగా, వెంటనే స్పందించి ఈజీఎస్ నిధుల నుంచి రూ. 5 లక్షలు మంజూరు చేయించారనీ అన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ మద్దెల నర్సయ్య, పంచాయతీ కార్యదర్శి మోహన్ నాయక్, వార్డు సభ్యులు దాసరి భారతి మనోజ్, మామిడి లక్ష్మి నర్సయ్య, బి ఆర్ ఎస్ వి నియోజకవర్గ నాయకులు బైరి రవికుమార్ యాదవ్, నాయకులు పుప్పాల వినోద్, ఆకుల గంగారెడ్డి, ఆకుల మహిపాల్, శశికుమార్, చిన్నయ్య, బండి కమలాకర్, గజ్జి రవి, కమ్మల శంకర్, ముండల గంగారెడ్డి, కారోబార్ రంజిత్, 8వ వార్డు మహిళలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## కన్న రుణం తీర్చుకున్న... కూతురు

**తండ్రి చితికి నిప్పు పెట్టిన చిన్నకూతురు ప్రీతి**



**జమ్మికుంట, (సింగిడి):** అల్లారుముద్దుగా పెంచి పెద్ద చేసిన కన్న కూతురు తండ్రి అకాల మృత్యువాత పడటంతో బాధాతప్తమైన హృదయంతో తండ్రి చితికి నిప్పు పెట్టి కన్న రుణం తీర్చుకుంది ఓ కూతురు. జమ్మికుంట పట్టణంలోని హౌసింగ్ బోర్డు కాలనీలో స్థానిక కేబుల్ ఆపరేటర్ దాసరి రామ్మూర్తి గౌడ్ ఆర్థిక ఇబ్బందులను తట్టుకోలేక ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రామ్మూర్తి మృతితో ఆయన భార్య సుజాత, ఇద్దరు కుమార్తెలుతీవ్రశోకసంద్రంలో మునిగిపోయారు. తండ్రి మరణాన్ని తట్టుకోలేక చివరి కోరికను తీర్చేందుకు చిన్న కుమార్తె సాయి ప్రీతి చితికి నిప్పంటించి అంత్యక్రియలు నిర్వహించడం అక్కడున్న ప్రతి ఒక్కరినీ కంటతడి పెట్టించింది. ఈ హృదయవిదారక దృశ్యం చూసిన బంధువులు, గ్రామస్థులు భావోద్వేగానికి గురయ్యారు.

**త్వరలో ప్రజలకు అందుబాటులోకి**

## నూతన జిల్లా డిజిటల్ గ్రంథాలయం

**చివరి దశ పనులను పరిశీలించిన కమిషనర్ త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు ఆదేశం**

**నగరపాలక సంస్థ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్**



**కరీంనగర్, (సింగిడి):** పోటీ పరీక్షల అభ్యర్థులు, విద్యార్థులు, పాఠకుల సౌకర్యార్థం అత్యాధునిక సౌకర్యాలతో నిర్మిస్తున్న నూతన జిల్లా డిజిటల్ గ్రంథాలయ భవనాన్ని త్వరలో ప్రజల వినియోగంలోకి తీసుకువస్తామని నగరపాలక సంస్థ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ తెలిపారు. స్మార్ట్ సిటీ నిధులతో నిర్మించిన జిల్లా గ్రంథాలయ భవనాన్ని బుధవారం ఇంజినీరింగ్ అధికారులతో కలిసి ఆయన సందర్శించి, తుదిదశ నిర్మాణ పనులు, రంగుల పూత, రక్షణ కంచెలు తదితర అభివృద్ధి పనులను పరిశీలించారు. మిగిలిన పనులను వేగంగా పూర్తి చేసి ప్రారంభోత్సవానికి అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. గ్రంథాలయంలో విద్యార్థులు, నిరుద్యోగ యువత, పాఠకులకు అనుకూలంగా అన్ని వసతులు కల్పించాలని, నాణ్యమైన ఫర్నిచర్ ఏర్పాటు చేసి ప్రశాంతమైన అధ్యయన వాతావరణాన్ని సిద్ధం చేయాలని సూచించారు. డిజిటల్ గ్రంథాలయాన్ని వీలైనంత త్వరగా ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. ఈ తనిఖీలో సహాయ ఇంజినీర్ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# జోన్3లో కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ అగ్రస్థానం

**తెలంగాణ రాష్ట్ర పోలీస్ క్రీడల్లో 11 పతకాలతో విశిష్ట ప్రతిభ: పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం**



**కరీంనగర్, (సింగిడి):** 5వ తెలంగాణ రాష్ట్ర పోలీస్ క్రీడలు-క్రీడోత్సవంలో కరీంనగర్ పోలీస్ కమిషనరేట్‌కు చెందిన అధికారులు, సిబ్బంది అత్యుత్తమ ప్రతిభ కనబరిచి మొత్తం 11 పతకాలు సాధించి జోన్-3లో అగ్రస్థానాన్ని దక్కించుకున్నారు. కమిషనరేట్ క్రీడాకారులు 2 స్వర్ణ, 4 రజత, 5 కాంస్య పతకాలు గెలుచుకుని విశేష ప్రతిభ కనబరిచారు.

**పతక విజేతలు:**

పీసీ పి. రాజు 90 కిలోల బాడీ బిల్డింగ్‌లో స్వర్ణ పతకం. ఏఆర్‌పీసీ ఎస్. నరేందర్ 85 కిలోల బాడీ బిల్డింగ్‌లో రజత పతకం.
పీసీ ఎం.డి. వహాజుద్దీన్ 80 కిలోల బాడీ బిల్డింగ్‌లో రజత పతకం. ఏఆర్‌పీసీ ఎ. శంకర్ యోగా విభాగంలో స్వర్ణ పతకం. ఏఆర్‌పీసీ వి. సాయి మాధవ్, ఆర్మ్ రెజ్లింగ్‌లో రజత, 55 కిలోల బాక్సింగ్‌లో కాంస్య పతకం. పీసీ జె. శ్రీనివాస్ 81 కిలోల జూడోలో కాంస్య పతకం. డబ్ల్యూపీసీ ఎ. స్వప్న 65 కిలోల ఆర్మ్ రెజ్లింగ్‌లో రజత పతకం. డబ్ల్యూపీసీ ఎం. అరుణ 77 కిలోల బాక్సింగ్, వెయిట్‌లిఫ్టింగ్, పవర్‌లిఫ్టింగ్ విభాగాల్లో మూడు కాంస్య పతకాలు సాధించారు.
జోన్-3 పతకాల పట్టికలో కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ 11 పతకాలతో తొలి స్థానంలో నిలవగా, సిద్దిపేట కమిషనరేట్ 5, రాజన్న సిరిసిల్ల 3, కామారెడ్డి 2, మెదక్ 2 పతకాలు సాధించాయి. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం, ఐపీఎస్ పతక విజేతలను అభినందించారు. విధి నిర్వహణతో పాటు క్రీడల్లోనూ రాణించడం పోలీసు సిబ్బందికి ఆదర్శమని పేర్కొన్నారు. క్రమశిక్షణ, శారీరక దృఢత్వం, నిరంతర సాధనతోనే ఈ విజయాలు సాధ్యమవుతాయని తెలిపారు. రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో మరింత ప్రతిభ కనబర్చి కమిషనరేట్‌కు మరిన్ని విజయాలు తీసుకురావాలని ఆకాంక్షించారు.

# కార్మిక భవన్ నిర్మాణానికి కృషి చేస్తాం..

**ఎలక్ట్రికల్ కార్మికుల సంఘ భవనానికి స్థలం కేటాయించాలని వినతి**
**కార్మికుల సమస్యల పరిష్కారానికి అండగా ఉంటాం**
**డిప్యూటీ మేయర్ సునీల్‌రావు**



**కరీంనగర్, (సింగిడి):** కరీంనగర్ సెంట్రల్ ప్రైవేట్ ఎలక్ట్రికల్ వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, కరీంనగర్ నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్, మాజీ మేయర్ యాదగిరి సునీల్ రావును కలిసి సంఘ భవన నిర్మాణానికి తగిన స్థలం కేటాయించాలని వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘ ప్రతినిధులు మాట్లాడుతూ, ప్రైవేట్ ఎలక్ట్రికల్ కార్మికులు సంఘంగా ఏర్పడి సభ్యుల సహకారంతో కార్యాలయ అద్దెతో పాటు ఇతర ఖర్చులను భరిస్తున్నామని తెలిపారు. పెరుగుతున్న వ్యయభారాన్ని దృష్టిలో ఉంచుకుని సొంత సంఘ భవనం నిర్మించుకోవాలని నిర్ణయించామని, అందుకు అవసరమైన స్థలం కేటాయించి సహకరించాలని కోరారు. వినతిపై స్పందించిన యాదగిరి సునీల్ రావు మాట్లాడుతూ, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ మార్గదర్శకత్వంలో కరీంనగర్‌లో అన్ని కార్మిక సంఘాలకు ఉపయోగపడే విధంగా కార్మిక భవన్ నిర్మాణానికి కృషి చేస్తున్నామని తెలిపారు. భవన నిర్మాణానికి అవసరమైన స్థలం కేటాయింపుతో పాటు నిధుల సమీకరణ పూర్తయ్యే వరకు బాధ్యతగా వ్యవహరిస్తామని హామీ ఇచ్చారు. కార్మికుల సంక్షేమమే తమ లక్ష్యమని పేర్కొన్న ఆయన, ఉద్యోగ భవిష్య నిధి (ఈపీఎఫ్), ఉద్యోగుల రాష్ట్ర బీమా (ఈఎస్ఐ) వంటి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని అన్నారు. కార్మికులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా తమను నేరుగా సంప్రదించవచ్చని, వారి హక్కుల పరిరక్షణ, సంక్షేమం కోసం ఎల్లప్పుడూ అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు దువ్వాసి రాజబాబు, ఉపాధ్యక్షుడు కయ్యం పాపయ్య, ప్రధాన కార్యదర్శి బషీర్ మహమ్మద్, సంయుక్త కార్యదర్శి పింగిలి మహేష్, ఖజాంచి కయ్యం నాగరాజు, కార్యవర్గ సభ్యులు పెండ్యాల అనిల్ రెడ్డి, నాయిని గంగారెడ్డి, ఒల్లాల రవి తదితరులు పాల్గొన్నారు.

# మూగ జీవం... ప్రసవ వేదన..

**సకాలంలో వైద్య సేవలు అందించిన ప్రశాంత్ కుమార్**
**గో మాతలను సంరక్షించాలి...**
**మున్సిపల్ చైర్మన్**



**జమ్మికుంట, (సింగిడి):** ప్రసవ వేదన అనుభవిస్తున్న ఓ గోవును సంరక్షించడమే కాకుండా పశువైద్యాధికారి రాజ్ కుమార్ పర్యవేక్షణలో గోవుకు ప్రసవం చేసి తల్లి బిడ్డను కాపాడి మానవత్వం చాటుకున్నాడు మున్సిపల్ చైర్మన్ ప్రశాంత్ కుమార్. జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని పాత మున్సిపల్ కార్యాలయం వద్ద ఓ గోవు ప్రసవంతో ఇబ్బంది పడుతుండగా అటుగా వెళుతున్న చైర్మన్ ప్రశాంత్ కుమార్ గమనించి దానిని సంరక్షించాడు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోవుల యజమానులు తమ ఆవులను రోడ్లపై వదిలివేయడంతో రాత్రివేళలా ఇబ్బంది కలగడమే కాకుండా ట్రాఫిక్కు తీవ్ర అంతరాయం కలుగుతుందని పేర్కొన్నాడు. గోవు యజమానులు వాటిని ఇంటి వద్దనే సంరక్షించే బాధ్యతను తీసుకోవడంతోపాటు బయటికి రాకుండా చూసుకోవాలని సూచించారు. వారం రోజుల్లో ఆవుల యజమానులు అందరూ రోడ్డుపై తిరుగుతున్న వాటిని సంరక్షించుకోవాలని అలా కాకుండా రోడ్లపైనే గోవులను వదిలివేస్తే యజమానులపై మున్సిపల్ చట్టాల ప్రకారం శాఖా పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

### శభాష్ చైర్మన్... అభినందించిన పట్టణ ప్రజలు



బుధవారం ఒక మూగ జీవి ప్రసవ ఆవేదనను అర్థం చేసుకొని సకాలంలో పశువైద్యాధికారి చేత వైద్యం అందించి ఆ గోమాతను రక్షించిన మున్సిపల్ చైర్మన్ ప్రశాంత్ కుమార్ ను పట్టణ ప్రజలు అభినందించారు. నూతన చైర్మన్గా బాధ్య తలు స్వీకరించిన ప్రశాంత్ కుమార్ పట్టణ అభి వృద్ధి తో పాటు మానవత్వంతో ఒక మూగజీవి ప్రసవ ఆవేదనను అర్థం చేసుకొని దానికి సేవ లందించడం ఆయన మానవత్వానికి నిలువెత్తు నిదర్శనమని కొనియాడారు. సకాలంలో వైద్య సేవలు అందించిన పశు వైద్యాధికారి రాజకుమార్ ను కూడా ప్రజలు అభినందించారు.

# పోక్సో నిందితులను నడి రోడ్డుపై ఉరితీయాలి: ఆకినపల్లి శిరీష

**అంబేద్కర్ చౌరస్తాలో స్వేరోస్ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ**




**హుజురాబాద్, (సింగిడి):** రాష్ట్రంలో చిన్నారులు, మహిళలపై జరుగుతున్న అత్యాచా రాలు, హత్యలు వంటి అమానుష ఘటనలను అరికట్టేందుకు ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని, పోక్సో కేసుల్లో దోషులుగా తేలిన నిందితులకు అత్యంత కఠిన శిక్షలు అమలు చేయాలని స్వేరోస్ రాష్ట్ర నాయకురాలు ఆకినపల్లి శిరీష డిమాండ్ చేశారు. ఈ మేరకు హుజురాబాద్ అంబేద్కర్ చౌరస్తాలో స్వేరోస్ ఆధ్వర్యంలో మానవహారం నిర్వహించి, అనంతరం నిరసన ర్యాలీ చేపట్టారు. ఆకినపల్లి శిరీష మాట్లాడుతూ, 9 నెలల పసికందు నుంచి వృద్ధ మహిళల వరకు ఎవరూ సురక్షితంగా లేని పరిస్థితులు నెలకొన్నా యని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళలు, చిన్నారులపై లైంగిక దాడులు, హత్యలకు పాల్పడే నిందితులపై చట్టపరంగా అత్యంత కఠిన చర్యలు తీసుకోవాలని, ఇలాంటి నేరాలు పునరావృతం కాకుండా ప్రభుత్వం సమర్థవంతమైన చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమానికి ప్రజాసంఘాల నాయకులు, బీసీ సంఘాల నాయకులు, వివిధ రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు పెద్ద ఎత్తున హాజరై సంఘీభావం తెలిపారు. ముఖ్య అతిథులుగా మాజీ ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ బండ శ్రీనివాస్, బీసీ సిటిజన్ ఫోరం అధ్యక్షుడు జనార్ధన్, జేఏసీ అధ్యక్షుడు సందెల వెంకన్న, డీసీ జేఏసీ కార్యదర్శి చిలకమారి శ్రీనివాస్, హుజురాబాద్ మున్సిపల్ కౌన్సిలర్ గందె శ్రీనివాస్ రాధిక, మాజీ జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ తక్కలపల్లి రాజేశ్వరరావు, కేడీసీసీ బ్యాంకు వైస్ చైర్మన్ పింగిలి రమేష్ పాల్గొన్నారు. అదేవిధంగా ప్రజాసంఘాల నాయకులు ఇప్పకాయల సాగర్, స్వేరోస్ సీనియర్ నాయకులు గడప రాజు, మేకల రవీందర్, దేవసాని ప్రియదర్శిని, ప్రవీణ్, క్రాంతి, సొల్లు బాబు, శోభ, ఎండి బాబర్, ఎండి ఫరీదా, వాగ్దేవి తదితరులతో పాటు ప్రభుత్వ డిగ్రీ, ఇంటర్ కళాశాలల విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## విద్యార్థుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

**మున్సిపల్ చైర్పర్సన్ నాగలక్ష్మి రాజేష్**



**ధర్మపురి, (సింగిడి):** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థు లకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన పోషకాహారం అం దించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని ధర్మపురి మున్సిపల్ చైర్‌పర్సన్ వేముల నాగలక్ష్మి రాజేష్ అన్నారు. పట్టణంలోని మైనారిటీ పాఠశాలలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో 5వ తరగతి విద్యార్థులకు నూతన భోజన ప్లేట్లను ఆమె పంపిణీ చేశారు. అనంతరం తెలంగాణ రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఆదేశాల మేరకు పాఠశాలను పరిశీలించారు. ఉపాధ్యాయుల హాజరు నమోదును తనిఖీ చేయడంతో పాటు విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం నాణ్యత, భోజనశాల పరిశుభ్రతను పరిశీలించారు. విద్యార్థులకు ప్రతిరోజూ పరిశుభ్రమైన, పోషకాహారంతో కూడిన నాణ్యమైన భోజనం అందేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. చైర్‌పర్సన్ మాట్లాడుతూ, విద్యార్థుల విద్య, ఆరోగ్యం, సంక్షేమానికి సంబంధించిన ఏ సమస్య వచ్చినా రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ సహకారంతో పరిష్కరిస్తామని తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తు బలోపేతానికి ప్రభుత్వం అవసరమైన అన్ని సౌకర్యాలను కల్పిస్తోందని పేర్కొన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థుల పట్ల ప్రేమ, బాధ్యతతో వ్యవహరిస్తూ వారికి మెరుగైన విద్యా వాతావరణాన్ని కల్పించాలని సూచించారు. ప్రతి విద్యార్థి ఆరోగ్యంగా, ఆనందంగా చదువుకునే పరిస్థితులు కల్పించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు షూలు పంపిణీ



**అమరచింత, (సింగిడి):** అమరచింత పట్టణంలోని దేశాయి మురళీధర్‌రెడ్డి ప్రాథమిక ప్రభుత్వ పాఠశాలలో బుధ వారం పాఠశాల నిర్మాణదాత దేశాయి ప్రకాష్‌రెడ్డి మురళీ ధర్ రెడ్డి ట్రస్టు ఆధ్వర్యంలో విద్యార్థిని విద్యార్థులకు షూలు పంపిణీ చేశారు. మురళీధర్ రెడ్డి ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రత్యేక పాఠశాలలోని మొత్తంవిద్యార్థిని విద్యార్థులకు ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు ప్రకాష్రెడ్డి సేవా సమితి అధ్యక్షులు కలంపాష తెలిపారు. ఈ కార్య క్రమంలో ప్రధానో పాధ్యాయురాలు పద్మమ్మ, ఉపాధ్యాయులు సుధా, జ్యోతి, శ్రీలత, బాలమణి, షకీలా పాల్గొన్నారు.

# 'ఎస్ఐఆర్'ను పకడ్బందీగా పూర్తి చేయాలి : ఆర్డీఓ



**ధర్మపురి, (సింగిడి):** రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు చేపడుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్)--2026 కార్యక్రమాన్ని నిర్దేశిత గడువులోగా పకడ్బందీగా పూర్తి చేయాలని 022 ధర్మపురి (ఎస్సీ) అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికల రిజిస్ట్రేషన్ అధికారి, మెట్ పల్లి రెవెన్యూ డివిజనల్ అధికారి సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం ధర్మపురి తహసీల్దార్ కార్యాలయంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో కార్యక్రమం పురోగతిపై సవివ రంగా చర్చించారు. ఎస్ఐఆర్--2026 కార్యక్ర మం ద్వారా ఓటరు జాబితాను మరింత పారదర్శ కంగా, ఖచ్చితత్వంతో రూపొందించడమే లక్ష్యమని సమా వేశంలో వివరించారు. ఇందుకోసం ప్రతి ఇంటిని సందర్శించి గణన పత్రాల (ఎన్యూమరేషన్ ఫారా లు) సేకరణ, వాటి పరిశీలన, డిజిటైజేషన్ ప్రక్రియను వేగవంతంగా చేపట్టాలని అధికారులకు సూచించారు. ఇప్పటివరకు నమోదైన పురోగతిని సమీక్షిస్తూ, మిగిలిన పనులను ప్రణాళికాబద్ధంగా పూర్తి చేయాలని తెలిపారు. గణన పత్రాల సేకరణలో వెనుకబడిన పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆర్డీఓ ఆదేశించారు. ఆయా కేంద్రాలకు చెందిన బూత్ లెవల్ అధికారులు (బీఎల్ వోలు), బూత్ లెవల్ ఏజెంట్లు (బీఎల్ఏలు) పరస్పర సమన్వయంతో పనిచేసి ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వివరాలను సేకరించాలని సూచించారు. సేకరించిన గణన పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించి, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా డిజిటైజేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని స్పష్టం చేశారు. ఓటరు జాబితాలో అర్హులైన ప్రతి ఓటరికి స్థానం కల్పించడంతో పాటు అనర్హుల పేర్లను తొలగించే ప్రక్రియను ఎన్నికల సంఘం నిబంధనలకు అనుగుణంగా నిర్వహించాలని సూచించారు. కార్యక్రమం విజయవంతం కావడంలో రాజకీయ పార్టీల సహకారం కూడా కీలకమని పేర్కొంటూ, బీఎల్ఏలు క్షేత్రస్థాయిలో చురుకుగా పనిచేసి ఎన్నికల యంత్రాంగానికి సహకరించాలని కోరారు. సమావేశంలో ధర్మపురి తహసీల్దార్ శ్రీనివాస్ తో పాటు అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని వివిధ మండలాల తహసీల్దార్లు, ఎన్నికల శాఖ అధికారులు, గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొని, ప్రత్యేక సవరణ కార్యక్రమంపై తమ అభిప్రాయాలను వెల్లడించారు. సమావేశంలో అధికారులు పలు సందేహాలకు సమాధానాలు ఇచ్చి, కార్యక్రమం అమలుకు సంబంధించి తీసుకోవాల్సిన చర్యలను వివరించారు.

**పర్యావరణ పరిరక్షణ**

# ప్రతిఒక్కరి బాధ్యత

**వనమహోత్సవంలో భాగంగా 22వ డివిజన్‌లో ఉచిత మొక్కల పంపిణీ**

**నగర మేయర్ కొలగాని శ్రీనివాస్**



**కరీంనగర్, (సింగిడి):** నగరంలోని 22వ డివిజన్ హిందూపురి కాలనీ సమీపంలో వనమహోత్సవం సందర్భంగా స్థానిక కార్పొరేటర్ బండ రమణ రెడ్డి ఆధ్వర్యంలో, నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ అధ్యక్షతన డివిజన్ ప్రజలకు ఉచిత మొక్కలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మేయర్ కొలగాని శ్రీనివాస్ కాలనీ వాసులతో కలిసి మొక్కలు నాటి, పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. నగరాన్ని మరింత పచ్చదనంతో తీర్చిదిద్దేందుకు ప్రతి కుటుంబం కనీసం ఒక మొక్కను నాటి, దానిని సంరక్షించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో హిందూపురి కాలనీ కమిటీ అధ్యక్షుడు దామోదర్ రెడ్డి, కార్యదర్శి మహేందర్, స్థానిక ప్రజాప్రతినిధులు, కాలనీ వాసులు, ప్రజలు పాల్గొన్నారు.

## బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ప్రశాంత్




**జమ్మికుంట (సింగిడి):** హైదరాబాద్ లోని బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర కార్యలయంలో బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఇబ్రాం శేఖర్ అధ్యక్షతన స్టేట్ ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశం జరిగింది. ఈసమావేశానికి ముఖ్యఅతిధులుగా బీఎస్పీ సెంట్రల్ కోఆర్డినేటర్ అతార్ సింగ్ రావు, విశిష్ట అతిధిగా సెంట్రల్ కోఆర్డినేటర్ సురేష్ ఆర్య గారు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధిగా పాల్గొన్న అతార్ సింగ్ రావు రాష్ట్ర కమిటీ సమావేశంలో బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పల్లె ప్రశాంత్ ని ప్రకటించారు. ఈ సందర్భంగా అతార్ సింగ్ గారు మాట్లాడుతూ బహుజన్ సమాజ్ పార్టీ అధినేత్రి, యూపీ మాజీ ముఖ్యమంత్రి బెహెన్ జీ మాయావతి గారి ఆదేశాను సారం యువతకు పార్టీలో విస్తృత అవకాశాలు కల్పించాలని గుర్తుచేశారు. ఆ క్రమంలోనే గత కొన్ని సంవత్సరాలుగా బీఎస్పీ పార్టీలో అంకితభావంతో పనిచేస్తున్న పల్లె ప్రశాంత్ ప్రత్యేకంగా అభినందించారు. బీఎస్పీ పార్టీ బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, ఇతర కులాల్లోని పేద ప్రజల సంక్షేమం కోసం అనేక సంవత్సరాలు మాయావతి గారి నాయకత్వం లో పనిచేస్తుందని గుర్తుచేశారు. ఓబీసీ వర్గాలను, యువకులను, విద్యావంతులను పార్టీకి జోడించబంలో పల్లె ప్రశాంత్ కృషి చేయాలని ఉపేదేశించారు. తెలంగాణ బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమించబడిన పల్లె ప్రశాంత్ ని రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీరాం కృష్ణ, జోన్ చీఫ్ ఇంచార్జులు దాగిల్ల దయానందరావు, నిషాని రామచంద్రం, బోడపట్ల ఈశ్వర్ లు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ రాష్ట్ర కమిటీ సభ్యులు, జోన్ ఇంచార్జులు, పార్లమెంట్ ఇంచార్జులు, కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు నల్లాల శ్రీనివాస్, హన్మకొండ జిల్లా అధ్యక్షుడు అంబాల ప్రశాంత్ మరియు పలు జిల్లాల అధ్యక్షులు పాల్గొన్నారు.

## వరుణుడి కటాక్షం కోసం.. జలాభిషేకం




**జమ్మికుంట, (సింగిడి):** వరుణ దేవుని కృపా కటాక్షం కోసం మహిళలు పెద్ద మొత్తంలో జలాభిషేకం నిర్వ హించారు. కరీంనగర్ జిల్లా జమ్మికుంట మండలంలోని వెంకటేశ్వర పల్లి గ్రామపంచాయతీ పరిధిలోగల గోవిందా పూర్ గ్రామానికి చెందిన మహిళలు వరుణ దేవుని కృపా కటాక్షం లేకపోవడం వల్ల పంటలు ఎండిపోతున్నాయని భావించి ప్రతి ఇంటి నుండి నీళ్లను తీసుకొని వచ్చి నవగ్రహా లతో పాటు పోచమ్మ తల్లి దేవాలయంలో జలాభిషేకం నిర్వహించారు. వరుణుడు కరుణించి వర్షం కురిపించాలని కోరుతూ ప్రత్యేక పూజలు మొక్కలు చెల్లించుకున్నారు.

## రైలు కిందపడి కేబుల్ ఆపరేటర్ ఆత్మహత్య



**జమ్మికుంట (సింగిడి):** జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని హౌసింగ్ బోర్డ్ కాలనీలో నివాసం ఉంటున్న దాసరి రామ్మూర్తి గౌడ్(48) అనే వ్యక్తి రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం గత కొద్ది మాసాల నుండి కుటుంబ సమస్యల వల్ల బాధపడుతూ తీవ్ర మనస్తాపం చెందారని ఈ తరుణంలో ఆ బాధ తట్టుకోలేక రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. కేబుల్ ఆపరేటర్ మృతి చెందడంతో పెద్ద మొత్తంలో కేబుల్ ఆపరేటర్స్ సంతాపం వ్యక్తం చేశారు. మృతుడికి భార్య ఇద్దరు అమ్మాయిలు ఉన్నారు.




సినిమా సింగిడి
Cinma Singidi

సోమవారం
20-7-2026

# నాకు ఆ ఆలోచనే లేదు

## నటి ఐశ్వర్య లక్ష్మి

ప్రస్తుతం 'గట్టా కుస్తీ 2' విజయాన్ని ఆస్వాదిస్తున్న నటి ఐశ్వర్య లక్ష్మి వరుస ప్రాజెక్ట్‌లతో బిజీగా ఉన్నారు. ఇందులో బాలీవుడ్ ఎంట్రీ సహా రెండు వెబ్ సిరీస్‌లు, ఒక ఫిమేల్ లీడ్ తమిళ సినిమాలో నటిస్తున్నారు. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. ఫెమినిజం, సోషల్ మీడియా, కామెడీ, తన రాబోయే చిత్రాల గురించి పలు ఆసక్తికర విషయాలను పంచుకున్నారు.

"గట్టా కుస్తీ 2' సినిమా బాక్సాఫీస్ కలెక్షన్ల వివరాలను ఎప్పటికప్పుడు నా టీమ్ తెలియజేస్తూ ఉంటుంది. వీటికన్నా కూడా ప్రేక్షకులు సినిమా ఆస్వాదించడమే నాకు అసలైన సంతృప్తి. థియేటర్లలో వారు నవ్వుతుంటే అదే మాకు ఆనందం. దాని కోసమే కదా మేం కష్టపడేది. 'గట్టా కుస్తీ 2' చక్కటి వినోదాన్ని పంచుతూనే స్త్రీ, పురుష సమానత్వాన్ని ప్రతిబింబిస్తుంది. ఒక మహిళ తన కలలను సాకారం చేసుకోవడానికి పురుషుడు ఏవిధంగా వెన్నంటి నిలిచాడన్నది ఈ చిత్ర కథాంశం. ప్రియాంక చోప్రానే తీసుకోండి.. భర్త నిక్ జోన్స్ ప్రతి విషయంలో ఆమెకు అండగా ఉంటాడు. మా మూవీ కూడా ఇదే చెబుతుంది"

ఈ వీకెండ్‌లో ఓటీటీ వినోదాలు.. అస్సలు మిస్సవ్వొద్దు..

"నాకు సినిమాల్లో కామెడీ సన్నివేశాలు చేయడం ఇష్టం. కానీ, కామెడీ పండించడంలో నేను ఇంకా మెరుగుపడాలి. ఇప్పటివరకూ నేనెప్పుడూ సోషల్ మీడియాలో సురక్షితంగా ఉన్నట్లు అనిపించలేదు. అది లేకుండా పని చేయడం చాలా సులభం. ప్రస్తుతం సోషల్ మీడియాలోకి తిరిగి రావాలనే ఆలోచనే లేదు. గతంలో నా ఫొటోలను మార్ఫ్ చేయడం, కామెంట్లు పెట్టడం వల్ల అందరూ నన్ను ద్వేషిస్తున్నట్లు అనిపించేది. ఇప్పుడు ప్రజలను నేరుగా కలవడం సంతోషంగా ఉంది. రోజుకు రూ.100 కోట్లు ఇచ్చినా సోషల్ మీడియా దరిదాపుల్లోకి వెళ్లను. నా డాగ్ ఇన్‌స్టాగ్రామ్ ఖాతా ద్వారా మాత్రమే వార్తలు, సినిమా అప్‌డేట్స్ చూస్తాను" అని ఐశ్వర్య పేర్కొన్నారు.

ప్రస్తుతం ఐశ్వర్య ఆనంద్ దర్శకత్వంలో ఒక ఫిమేల్ సెంట్రిక్ తమిళ సినిమాలో పోలీస్ ఆఫీసర్‌గా నటిస్తున్నారు. తర్వాత 'తీవినయ్ పొట్రు', 'లవ్' అనే రెండు వెబ్ సిరీస్‌లు ఐశ్వర్య లక్ష్మి ఖాతాలో ఉన్నాయి. బాలీవుడ్‌లో కూడా ఆమె ఎంట్రీ ఇవ్వబోతున్నట్లు సమాచారం. ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన అధికారిక ప్రకటన ఇంకా రాలేదు.

### డ్యాన్సర్స్ అసోసియేషన్

# వివాదానికి తెర..

## వివరణ ఇచ్చిన జానీ మాస్టర్

డ్యాన్సర్స్ అసోసియేషన్‌లో నెలకొన్న వివాదానికి తెరపడిందని ఫిల్మ్ ఫెడరేషన్ అధ్యక్షుడు వల్లభనేని అనిల్ తెలిపారు. జానీ మాస్టర్ ఇచ్చిన వివరణతో ఫెడరేషన్ సంతృప్తి చెందిందని తెలిపారు. ఇకపై అంతా కలిసి కట్టుగా పనిచేయాలని నిర్ణయించుకున్నామన్నారు.

నృత్యదర్శకుడు జానీ మాస్టర్, అసోసియేషన్ ప్రెసిడెంట్ సుమలతతో కలిసి విలేకరులతో ఆయన మాట్లాడారు.

ఈ సందర్భంగా జానీ మాస్టర్ మాట్లాడుతూ.. 'నా వివరణతో ఫెడరేషన్ సంతృప్తి చెందింది. ఈ వివాదం ఇంతటితో సద్దుమణిగిందని భావిస్తున్నా. వివాదాలతో డ్యాన్సర్లు చాలా ఇబ్బంది పడ్డారు. పరిశ్రమలో 24 క్రాఫ్ట్స్‌కి ఫెడరేషన్ అవసరం ఉంది. చిరంజీవిగారితో పాటు పెద్దలంతా మా బాధ అర్థం చేసుకున్నారు. నన్ను, శేఖర్ మాస్టర్‌ను కూర్చోబెట్టి చిరంజీవి మాట్లాడారు. యూనియన్ సమస్యను పరిష్కరించారు. బాలకృష్ణగారు కూడా సమస్యపై స్పందించి, అంతా సద్దుమణిగేలా చూడాలన్నారు' అని జానీ మాస్టర్ తెలిపారు. కార్మికుల



ఈనెల 26న జనరల్‌బాడీ మీటింగ్‌లో తుది నిర్ణయం తీసుకుంటామని, ఆరోపణలు ఎదుర్కొంటున్న జనరల్ సెక్రటరీపై చర్యలు ఉంటాయన్నారు. అలాగే, సుమలత ఆధ్వర్యంలోనే అసోసియేషన్ కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఆదివారం


కష్టం వారికే దక్కాలన్నదే తమ కోరిక అని అధ్యక్షురాలు సుమలత తెలిపారు. డ్యాన్సర్లు కట్టే రూ. 100తోనే అసోసియేషన్ నడుస్తోందన్న ఆమె.. తాము కార్మికులకు అండగా నిలబడతామన్నారు.

### అప్పుడు సినిమాలపై

# ఉత్సాహం కోల్పోయా

## మాధవన్

'సఖి', 'రంగ్ దే బసంతి', 'త్రీ ఇడియట్స్' లాంటి అద్భుతమైన చిత్రాలతో ప్రేక్షకులను అలరించారు ప్రముఖ నటుడు ఆర్. మాధవన్ . అయితే, తన కెరీర్‌లో 40 ఏళ్ల వయసులో సినిమాలపై తాను ఆసక్తి కోల్పోయానని ఆయన తాజాగా వెల్లడించారు. తనలో వచ్చిన ఈ మార్పును తనకంటే ముందే భార్య సరిత గుర్తించిందని తెలిపారు. సోషల్ మీడియాలోకి తిరిగి రావాలనే ఆలోచనే లేదు: ఐశ్వర్య "నా జీవితంలో అదొక భిన్నమైన దశ. అప్పుడు నేను చేసిన సినిమాలన్నీ కేవలం సాధారణ విజయాలనే సాధించాయి. వాటిలో గొప్పగా చెప్పుకొనే ప్రశంసలు గానీ, కెరీర్‌లో పెద్ద కుదుపులు గానీ లేవు. ఉదయాన్నే నిద్రలేచి కథల గురించి ఆలోచించడం, ఎప్పుడెప్పుడు సెట్స్‌కి వెళ్లాలా అనే ఉత్సాహం నాలో అప్పట్లో లేదు. కొత్త కథల గురించి ఆలోచించడం కూడా మానేశా. నాలో వచ్చిన ఈ మార్పును నాకంటే ముందుగా నా భార్య సరితే గుర్తించింది " అని మాధవన్ ఓ ఇంటర్వ్యూలో తెలిపారు. ప్రస్తుతం ఆయన కృష్ణకుమార్ రామకుమార్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'జి.డి.నాయుడు' లో ప్రధాన పాత్ర పోషిస్తున్నారు. ఈ చిత్రం ఆగస్టు 7న ప్రేక్షకుల ముందుకు రానుంది



# ఇదంతా అభిమానుల చలవే.. ప్రేమతో మీ ధనుష్!

72వ జాతీయ పురస్కారాలు ధనుష్‌కు రెండింతల ఆనందాన్ని తీసుకొచ్చాయి. ఆయన దర్శకత్వంలో వచ్చిన 'రాయన్' ఉత్తమ ప్రాంతీయ చిత్రంగా (తమిళ) ఎంపికవడంతో పాటు.. 'కెప్టెన్ మిల్లర్' తో ధనుష్ స్పెషల్ మెన్షన్ (నటుడు) గౌరవాన్ని పొందిన సంగతి తెలిసిందే. దర్శకుడిగా జాతీయ స్థాయిలో తొలిసారి అవార్డును సొంతం చేసుకోవడం, నటుడిగా నాలుగోసారి జ్యూరీ గుర్తింపును పొందడంపై ధనుష్ ఆనందం వ్యక్తం చేశారు. ఎంపిక కమిటీకి, అభిమానులకు ధన్యవాదాలు తెలిపారు. ఇన్‌స్టా పోస్టులో తన భావాలను ఇలా పంచుకున్నారు.



"ఓం నమశ్శివాయ..! జాతీయ పురస్కారాల్లో 'రాయన్' ఉత్తమ ప్రాంతీయ చిత్రంగా ఎంపిక కావడంతో పాటు, 'కెప్టెన్ మిల్లర్'తో స్పెషల్ మెన్షన్(నటుడు) గుర్తింపు దక్కడం ఎంతో ఆనందాన్ని కలిగిస్తోంది. ఈ సందర్భంగా జాతీయ చలనచిత్ర అవార్డుల జ్యూరీకి, ఎంపిక కమిటీకి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నాను. కెరీర్ తొలినాళ్ల నుంచి మద్దతుగా నిలిచిన మీడియాకు ధన్యవాదాలు. నటుడిగా ఇది నాకు నాలుగో జాతీయ అవార్డు కాగా, దర్శకుడిగా మొట్టమొదటిది. నాకు ఇంత శక్తినిచ్చి, నా ఎదుగుదలకు మూలస్తంభాలుగా నిలిచిన నా అభిమానులే లేకపోతే ఇవేవీ సాధ్యమయ్యేవి కావు. అందుకు వారికి మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలుపుతున్నాను"

"కెప్టెన్ మిల్లర్'కు వచ్చిన గుర్తింపు మరింత ప్రత్యేకమైనది. ఎందుకంటే ఇప్పటివరకూ నేను అత్యుత్తమ నటన కనబర్చింది ఈ చిత్రంలోనే అని మొదటినుంచి బలంగా విశ్వసిస్తున్నాను. నా మనసుకు అంత దగ్గరైన పాత్రకు ఇప్పుడు స్పెషల్ మెన్షన్ గౌరవం దక్కడంతో ఈ విజయం మరింత అర్థవంతంగా మారింది. అలాగే మొదటి విజయం ఎప్పటికీ మర్చిపోలేనిది. 'రాయన్'తో దర్శకుడిగా దక్కిన తొలి జాతీయ పురస్కారాన్ని జీవితాంతం విలువైన జ్ఞాపకంగా దాచుకుంటాను. మన ఆలోచనలను బట్టే మన జీవితం ఉంటుందనే మాటను ప్రతిసారీ చెబుతుంటాను. ఈ సందర్భంలోనూ అదే మాటను గుర్తుచేసుకుంటున్నాను

# Yami Gautam



ఓ నాయికగా గ్లామర్ కంటే కథకు, వైవిధ్యమైన పాత్రలకు ప్రాధాన్యం ఇచ్చే తక్కువమంది నాయికల్లో యామీ గౌతమ్ ఒకరు. నాయికా ప్రాధాన్య చిత్రాల్లో సత్తా చాటే ఈ తార 'ఆర్టికల్ 370'లో పోషించిన ఇంటెలిజెన్స్ అధికారిణి జూనీ హక్సర్ పాత్రతో మరింత గుర్తింపు తెచ్చుకున్నారు. ఇప్పుడు ఈ పాత్రే ఆమెని జాతీయ ఉత్తమ నటిగా నిలబెట్టింది. జమ్మూకశ్మీర్‌లోని ఆర్టికల్ 370 రద్దుకు సంబంధించిన అత్యంత కీలకమైన ఆపరేషన్‌లో ఇంటెలిజెన్స్ అధికారిణిగా దేశభక్తిని చాటుతూ.. భావోద్వేగమైన సందర్భాలలో కూడా పాత్రలో గంభీరతని ప్రదర్శించి, ఉత్కంఠభరితమైన యాక్షన్ సన్నివేశాలతో సినీప్రియుల్ని ఆకట్టుకున్నారు. నిశ్శబ్ద సన్నివేశాల్లో కళ్లతోనే కట్టిపడేశారామె. 'నేను ఎంచుకునే సినిమాలు ప్రస్తుత సంఘటనలతో ముడిపడి ఉంటున్నాయేమో అందుకే సామాజిక మాధ్యమాల్లో నన్ను విమర్శిస్తున్నారు'అని చెప్పే యామీ ఇటీవలే 'హక్' చిత్రంలో షాజియా పాత్రలో కనిపించి తన నటనతో ప్రేక్షకుల్ని ఆకట్టుకున్నారు. ఆమె ఎక్కువగా సీరియస్ పాత్రల్నే పోషిస్తుందని అనుకుంటున్న సమయంలో 'బాల' చిత్రంతో నవ్వులు పూయించిన నాయిక ఈమె. పాత్ర ఏదైనా కానీ అందులోకి పరకాయ ప్రవేశం చేయడమే యామికి తెలుసంటూ అందరిచేత ప్రశంసలు అందుకునే ఈ నాయిక ప్రస్తుతం వరుస చిత్రాలతో బిజీగా ఉంది.

# ఏదైనా పరకాయ ప్రవేశమే

Printed,published & Owned by P. Sunitha Reddy on behalf of Flamingo Media Networks, Printed at Sree Seshasai Enterprises Plot no.98/1, Co-operative Industrial Estate, Gandhi Nagar, Near Balanagar, Medchel Malkajgiri Dist.Hyderabad Telangana 500037.and Published from PLOT NO 74 A/D, KAMAKSHI NILAYAM, ESHWARIPURI COLONY, SAINIKPURI, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500094.
Editor : Dussa Shivaprasad, PRGI.NO. TGTEL/26/A4370. Cell 8179799090